
మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - బుధవారం 4 నవంబర్ 2026 || సంపుటి: 10 || సంచిక: 299 || పేజీలు:12 || వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

ఆసియా కుబేరుడు ముకేశ్ అంబానీ



6

ఊపిరాడని ఢిల్లీ..కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి



2

ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం.. అరాచకవాదాన్ని అంతం చేద్దాం

పాకిస్తాన్‌లో కుట్రదారులకు, ఢిల్లీలో గుంట నక్కలకు వినిపించేలా

వందేమాతరం నినాదాలు మార్మోగాలె

వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో ఎగిరేది కాషాయ జెండానే

నిర్మల్ మహా పాదయాత్రలో బీజేఎల్పీ నేత ఏలేటి గర్జన



2

2028లో ఇదే స్ఫూర్తి కావాలి

టీ.బీజేపీ చీఫ్ రాంచదర్‌రావును అభినందించిన అమిత్ షా



తుమ్మిడి హట్టిపై సీఎం ఫోకస్

మంత్రి ఉత్తమ్‌తో కలిసి సమీక్ష

ఉన్నతాధికారులకు పలు ఆదేశాలు

మహారాష్ట్ర సర్వేను స్వాగతించాలి

ముంపు పరిహారంకు చర్యలు తీసుకోవాలి



హైదరాబాద్, నవంబర్ 03, (మనం బ్యూరో): తుమ్మిడిహెట్టిపై బ్యారేజ్ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్రతో నిరంతరం సంప్రదింపులు జరపాలని సీఎం రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ముంపునకు గురయ్యే ప్రాంతాలకు సంబంధించిన పూర్తి వివరాలతో సిద్ధంగా ఉండాలనీ, గతంలో చేసుకున్న ఒప్పందాలు, ఇతర అంశాలకు సంబంధించిన పత్రాలను ఆ రాష్ట్ర అధికారులకు అందజేయాలని సూచించారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ ...మిగతా 2లో

ఎమ్మెల్సీ ఎన్నికల్లో సహకరించండి

కూనంనేని, కోదాండరాం లను కోరిన సీఎం





హైదరాబాద్, నవంబర్ 3(మనంబ్యూరో): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిపిఐ, తెలంగాణ జన సమితి పార్టీ నేతలను కోరారు. మంగళవారం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, తెలంగాణ జన సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదాండరాంలు హైదరాబాద్‌లో రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రానున్న ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కూనంనేని సాంబశివరావు, కోదాండరాంలు తమ మద్దతును ప్రకటించారు.

పూర్తిస్థాయి వైద్య సేవలు అందాలె

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కేన్సర్ వైద్య సేవలు

వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ యుద్ధ ప్రతిపాదికన పూర్తిచేయాలి

ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ




3

మాటించిండు..నిలబెట్టుకుండు

తల్లిని, బిడ్డని కలిపిన కేటీఆర్

కేటీఆర్ చొరవతో స్వదేశానికి చేరుకున్న కొడంగల్ గల్ఫ్ బాధితురాలు లక్ష్మి





2

కుప్పం టు పులివెందుల.. క్లీన్ స్వీప్!

ఏపీ పుర పోరులో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి సునామీ



అమరావతి, (మనం ప్రత్యేక ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్‌లో సార్వత్రిక ఎన్నికల ఫలితాలే మళ్లీ పునరావృతమయ్యాయి. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అప్రతిహత విజయంతో విపక్షాన్ని తుడిచిపెట్టేసింది. 'ఇచ్ఛాపురం నుంచి కుప్పం' దాకా, చివరకు విపక్ష నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సొంత కోట 'పులివెందుల' వరకు కూటమి జెండా రెపరెపలాడింది. మంగళవారం ...మిగతా 2లో

సమర్థవంత పాలనే సర్కార్ లక్ష్యం

- పెండింగ్ సమస్యల పరిష్కారం.. ప్రజలకు మరింత ప్రభుత్వ సేవలు
- 9 ఉమ్మడి జిల్లాల్లో సమీక్షలు పూర్తి.. నేడు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సమావేశం: మంత్రి పొంగులేటి

9

దమ్కీలు ఇస్తే భయపడలా?

అమిత్ షా పర్యటనపై మంత్రి అడ్లూరి విమర్శలు

మా తప్పులుంటే బయటవెట్టండి.. కేంద్రానికి సవాల్

2

కమలం పుంజుకునేనా..?

మిషన్ తెలంగాణ మొదలైపోయినట్టేనా!

అధికారం మాదేనన్నది కాషాయ దళం ధీమా

6 నెలల్లో పార్టీలో మార్పులు?

హైదరాబాద్, మనంబ్యూరో: నెక్స్ట్ టార్గెట్ తెలంగాణే అంటూ పార్టీ ముఖ్య నేతలు ఆ మధ్య ప్రకటించినా అడపా దడపా తప్ప ఆ దిశలో సీరియస్ కార్యాచరణ ఇప్పటిదాకా మొదలవలేదన్న అభిప్రాయం రాజకీయవర్గాల్లో ఉంది. కానీ క్రమంగా ఇప్పుడిప్పుడే పరిస్థితిలో మార్పు వస్తున్నట్టు కనిపిస్తోందంటున్నారు. బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జీ, పార్టీ జాతీయ ...మిగతా 2లో



జాగో..! ఎల్‌నినోను ఎదుర్కొందాం

ప్రకృతి విపత్తుపై 'మన'ం యుద్ధం

manamelnino2026@gmail.com, whatsapp no 9133199333

ఎల్‌నినో విపత్తును ఎదుర్కొనే దిశలో మనమంతా భాగస్వాములమవుదాం. సామాజిక బాధ్యతను నిర్వర్తిద్దాం. ఎల్ నినో ఎందుకు వచ్చింది..? ఇందుకు కారకులెవరు..?? లాంటివి ఇప్పుడు అప్రస్తుతం. మన ముంగిటికి ఎల్ నినో రక్కసి వచ్చి చేరింది. ఈ సమయంలో వ్యక్తిగతంగా ప్రతి పౌరుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. సామాజికంగా ఎలాంటి అడుగులు ముందుకు పడాలి ... ఇదే ఇప్పుడు అత్యవసరం. అలాగే ప్రభుత్వపరంగా తీసుకోవాల్సిన చర్యలు ఎలా ఉండాలి వంటి అంశాలు ఎంతో ముఖ్యం. ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఇందుకు సన్నద్ధమయ్యాయి. పౌరులుగా మనమందరం కూడా ఇందుకు సిద్ధం కావాలి. తెలంగాణ ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసి సబ్ కమిటీని సైతం ఏర్పాటు చేసింది. ఎల్ నినోలాంటి విపత్తులను దిగ్విజయంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రజలు ఎవరి బాధ్యతలను వాళ్లు నిర్వర్తించాల్సిందే... ఎల్ నినో ప్రభావం ఇప్పుడిప్పుడే ప్రారంభమైనప్పటికీ సమీప భవిష్యత్తులో దాని విశ్వరూపాన్ని చూడాల్సిన పరిస్థితిలు రావచ్చు.. విపత్కర పరిస్థితులను ఎదుర్కోవడం మనకేం కొత్త కాకపోయినప్పటికీ పౌరులుగా మనం తీసుకోవాల్సిన జాగ్రత్తలు మనం తీసుకోవాల్సిందే... ప్రభుత్వాలు చేపట్టాల్సిన చర్యలు చేపట్టాల్సిందే. ఈ కోణంలోనే ఎలాంటి జాగ్రత్తలు ప్రజలు తీసుకోవాలి , ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు చేపట్టాలి అనే అంశాన్ని మీరు సూటిగా స్పష్టంగా తెలియజేయండి. ఈ విపత్కర పరిస్థితిలకు కారకులు వీరంటూ, వారంటూ ఎవరిని నిందించాల్సిన అవసరం లేదు.. అసలు ఆ జోలికే వెళ్ళకూడదు.. నిర్మాణాత్మకంగా ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు, ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు వీటిపైనే మీ సూచనలు సలహాలు పంపాలి.. మీడియా సంస్థగా మనం తెలుగు దినపత్రిక ఈ అంశాన్ని తన బాధ్యతగా గుర్తించి ఈ బహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ మహా యజ్ఞంలో మీరూ పాలుపంచుకోండి. మీ ఆలోచనలను మాకు పంపించండి. వాటిని మీ పేరు, చిరునామా, ఫోటోతో పాటు ఈ శీర్షికలో రోజువారీగా ప్రచురిస్తాం. ఉత్తమ సూచనలకు గుర్తింపు కూడా ఇస్తాం మీ ఆలోచనలు, సలహాలు, సూచనలను పైన తెలిపిన వాట్సాప్ లేదా ఈ మెయిల్‌కు పంపించండి.

– ఎడిటర్

24 గంటలైంది మోదీ జీ.. రాహుల్ గాంధీ మరోసారి బహిరంగ చర్చకు సవాల్



ఢిల్లీ, నవంబర్ 3: ప్రధాని నరేంద్ర మోదీకి లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి బహిరంగ చర్చకు సవాల్ విసిరారు. తాను ఛాలెంజ్ చేసి 24 గంటలు గడిచినా చర్చకు రావడంపై స్పందన లేదంటూ నవంబర్ 3 న సోషల్ మీడియాలో వీడియో విడుదల చేశారు. దేశ వ్యతిరేక కార్యకలాపాలు, విదేశీ శక్తులతో సంబంధాలపై చేస్తున్న ఆరోపణలను బహిరంగ వేదికపై చర్చిద్దామని మోదీని కోరారు.

మోహన్ భగవత్ను న్యాయనిర్ణేతగా పెట్టుకోండి!

చర్చకు వేదిక, స్థలం ఎక్కడైనా ఎంచుకోవచ్చని రాహుల్ పేర్కొన్నారు. మీడియా, దేశ యువత సమక్షంలో ఇద్దరం ఎదురెదురుగా కూర్చొని మాట్లాడుకుందామని ప్రతిపాదించారు. న్యాయ నిర్ణేతను కూడా మోదీయే ఎంపిక చేసుకోవచ్చని, కావాలంటే ఆర్ఎస్ఎస్ ...మిగతా 2లో

48 గంటలు..20మంది సుక్షితం

మత్స్య నౌక హైజాక్

అజినీపై అటాక్

భారత నౌకాదళం సాహసం

న్యూఢిల్లీ, నవంబర్ 3: సోమాలియా ఈశాన్య తీరంలో సముద్ర దొంగల చెరలో చిక్కుకున్న 'అజినీ' అనే మత్స్యకార నౌకను భారత నౌకాదళం విజయవంతంగా రక్షించింది. సుమారు 48 గంటల పాటు సాగిన ప్రత్యేక ఆపరే షన్ అనంతరం నౌకలో బందీలుగా ఉన్న 20 మంది సిబ్బందిని సురక్షితంగా విడుదల చేసింది. ఈ ఆపరేషన్లో ఎవరి కీ గాయాలు కాలేదని భారత నౌకాదళం వెల్లడించింది. భారత నౌకాదళం మోహరించిన యుద్ధనౌక, సముద్ర నిఘా విమానం, మెరైన్ కమాండోలు సమన్వ యంతో ఈ ఆపరేషన్ చేపట్టారు. భారత వ్యూహాత్మక చర్యలతో ...మిగతా 2లో





నిరసనలకు ప్రత్యేక స్థలం కేటాంచండి: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, నవంబర్ 3: నిరసనల పేరుతో ఒక ప్రాంతాన్ని నిరవధికంగా ఆక్రమించడానికి వీల్లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నిరసనల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా కేటాయించిన ప్రదేశాలకు కూడా నిర్దిష్ట సమయ పరిమితి ఉండాలని వ్యాఖ్యానించింది. గత నెలలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద భారీ నిరసనలు, ఇటీవల ప్రతిపక్ష ఇండీ కూటమి రాష్ట్రాల మైదాన్ ర్యాలీల నేపథ్యంలో దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు ...మిగతా 2లో

లాయర్స్ వర్సెస్ కాప్స్

ఏసీపీ మనస్వి వశిష్ఠపై సస్పెన్షన్ వేటు



ఢిల్లీ, మనంబ్యూరో: ఢిల్లీ పోలీసు ప్రధాన కార్యాలయం బయట ఇటీవల జరిగిన అరుదైన నిరసనకు నాయకత్వం వహించిన అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ మనస్వి వశిష్ఠను సస్పెండ్ చేశారు. అక్టోబర్ 23న షాదరా పోలీస్ స్టేషన్లో న్యాయవాదులకు, పోలీసులకు మధ్య జరిగిన ఘర్షణ తర్వాత తనపై, తోటి అధికారిపై తీసుకున్న శాఖాపరమైన చర్యలను నిరసిస్తూ ఆయన ఈ ఆందోళనకు దిగారు. షాదరా పోలీస్ స్టేషన్ ఘటన తర్వాత ఏసీపీ మనస్వి వశిష్ఠ, ఆ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఇన్స్పెక్టర్ అరుణ్ కుమార్లను వేరే ప్రాంతాలకు బదిలీ చేశారు. దీన్ని వ్యతిరేకిస్తూ మహిళా అధికారులు సహా సుమారు 150 మంది ఢిల్లీ పోలీసులు సోమవారం నాడు ఢిల్లీ పోలీసు హెడ్క్వార్టర్స్ బయట వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. ఏసీపీ వశిష్ఠ, ఇన్స్పెక్టర్ అరుణ్ కుమార్లను మళ్లీ వారి పాత ...మిగతా 2లో

అమెరికా మిడ్ టర్మ్ ఎన్నికలు..

వాషింగ్టన్, నవంబర్ 3(మనంన్యూస్): అమెరికాలో మిడ్టర్మ్ ఎన్నికల పోలింగ్ కొనసాగుతోంది. అధ్యక్షుడు డొనాల్ ట్రంప్‌కు ఈ ఎన్నికలు ఎంతో కీలకంగా మారాయి. ఆయన రిపబ్లికన్ పార్టీ ఆధిక్యత సాధిస్తేనే కాంగ్రెస్ లోని ప్రతినిధుల సభ, సెనెట్లో ఇబ్బందులు ఉండవు. డెమోక్రాట్లు విజయం మెజారిటీ సాధిస్తే బిల్లుల విషయంలో సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. ఇదే కాకుండా ఈ ఎన్నికల్ని ట్రంప్ పాలనపై రెఫరెండంగా చూస్తున్నారు. ప్రతినిధుల సభలోని ...మిగతా 2లో

ఎవరెస్టుపై రెండు హెలికాప్టర్లు ఢీ

ఖట్మండ్, నవంబర్ 3: నేపాల్‌లోని ప్రపంచ ప్రఖ్యాత మౌంట్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్ సమీపంలో మంగళవారం ఉదయం ఘోర హెలికాప్టర్ ప్రమాదం చోటుచేసు కుంది. మంగళవారం ...మిగతా 2లో

చిక్కుకుపోయాం.. రక్షించండి

వీడియోల ద్వారా బాధితులు ప్రధాని మోడీకి విజ్ఞప్తి

ఉక్రెయిన్ యుద్ధ క్షేత్రంలో విశాఖకు చెందిన ఐదుగురు

ముగ్గురి ఆచూకీ గల్లంతు

ఉద్యోగాల పేరుతో మోసం చేశారని ఆవేదన



విజయవాడ, మనంప్రత్యేక ప్రతినిధి: ఉపాధి కోసం విదేశాలకు వెళ్లిన భారతీయ యువతను టార్గెట్ చేస్తూ సాగుతున్న అంతర్జాతీయ జాబ్ రాకెట్ మోసాలు ...మిగతా 2లో

తెలంగాణకు మురసు తుపాను ఎఫెక్ట్

పలు జిల్లాలకు ఎల్లో వార్నింగ్ • నేటి నుంచి హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం • ఏపీ చిలకలూరిపేట హైవేపై వరద నీరు, విజయవాడలో ఎడతెరిపిలేని వాన

8

ఊపిరాడని ఢిల్లీ..కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీ మరోసారి తీవ్ర వాయు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. దీపావళి వేడుకలకు ముందే గాలి నాణ్యత ప్రమాదకర స్థాయికి చేరడంతో అధికారులు గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ రెండో దశను అమల్లోకి తీసుకొచ్చారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి తాజా గణాంకాల ప్రకారం రోహిణి ప్రాంతంలో గాలి నాణ్యత సూచీ 484కు చేరి తీవ్ర ప్రమాద కర స్థాయిలో నమోదైంది. నగరంలోని పలు ప్రాంతాల్లో ఎక్యూఐ 400కు పైగా నమోదవడంతో ప్రజలు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలుష్యం పెరగడానికి చల్లటి వాతావరణం, గాలుల వేగం తగ్గడం, వాహనాల ఉద్గారాలు, నిర్మాణ ప్రాంతాల నుంచి వాతావన్న దుమ్ము, అతని ప్రధాన కారణాలుగా అధికారులు పేర్కొన్నారు. దీపావళి సమయంలో బాణసంచా కాల్చడం వల్ల పరిస్థితి మరింత దిగజారే అవకాశం ఉందని హెచ్చరించారు. కాలుష్యాన్ని నియంత్రించేందుకు అధికారులు పలు చర్యలు చేపట్టారు. నిర్మాణ ప్రాంతాల్లో దుమ్ము నియంత్రణ చర్యలను కట్టుదిట్టం చేయడంతో పాటు, రోడ్లపై నీటిని చల్లడం, యాంత్రికంగా శుభ్రపరిచే పనులను వేగవంతం చేశారు. డీజిల్ జనరేటర్ల వినియోగంపై పరిమితులు విధించగా, ప్రజా రవాణా సేవలను మరింత బలోపేతం చేయాలని సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేశారు. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు, శ్వాస సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నవారు అవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. బయటకు వెళ్లాల్సి వస్తే మాస్క్ లు ధరించాలని, ఉదయం, సాయంత్రం వేళల్లో ఎక్కువసేపు బహిరంగ ప్రదేశాల్లో ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

48 గంటలు..20మంది సుక్షితం

(మొదటి పేజీ తరువాయి)

సముద్ర దొంగలను అదుపులోకి తీసుకుని నౌకను స్వాధీనం చేసుకుంది. ఈ విజ యవంతమైన ఆపరేష్న రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్ భారత నౌకాదళం, వైమానిక దళాన్ని అభినందించారు. సముద్ర మార్గాల్లో భద్రత కల్పించడంలో భారత సాయుధ దళాలు మరోసారి తమ సామర్థ్యాన్ని చాటాయని పేర్కొన్నారు. ఇటీవల సోమాలియా తీర ప్రాంతంలో సముద్ర దొంగల దాడులు మళ్లీ పెరుగు తున్న నేపథ్యంలో ఈ రక్షణ చర్యకు ప్రాధాన్యం ఏర్పడింది. వాణిజ్య నౌకలపై దాడులకు మత్స్యకార నౌకలను 'మదర్ వైమానిక దళం సీ17 గ్లోబ్మస్టర్ షిప్'లుగా ఉపయోగించే అవకాశం విమానం ద్వారా కమాండోలను ఘటనా ఉందని అంతర్జాతీయ సముద్ర భద్రతా స్థలికి తరలించింది. అనంతరం సంస్థలు హెచ్చరిస్తున్నాయి.

చిక్కుకుపోయాం.. రక్షించండి

(మొదటి పేజీ తరువాయి)

తీవ్ర కలకలం రేపుతున్నాయి. నాలుగు నెలల క్రితం ఉద్యోగం కోసం రష్యా వెళ్లిన విశాఖపట్నం దువ్వాడ మంగళపాలెం జెఎన్ ఎన్యూఆర్ఎం కాలనీకి చెందిన ఐదుగురు యువకులు రష్యా-ఉక్రెయిన్ యుద్ధభూమిలో చిక్కుకుపోయిన దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది.

ఉద్యోగం పేరుతో మోసం ..

ఫుడ్ ప్యాకేజింగ్ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి, ఓ నేపాల్ కు చెందిన ఏజెంట్ ఈ ఐదుగురు యువకులను రష్యాకు తీసుకువెళ్లాడు. తీరా అక్కడికి చేరుకున్నాక, స్థానిక భాష తెలియని వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని బలవంతంగా కొన్ని ఆర్మీ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేయించుకున్నారు. ఆ తర్వాత వారి చేతికి సైనిక దుస్తులు, ఆధునిక ఆయుధాలు ఇచ్చి, ఉక్రెయిన్తో సాగుతున్న యుద్ధంలో సరిహద్దు ఫ్రంట్ లైన్ వారియర్స్ గా బలవంతంగా నెట్టేశారు.

ముగ్గురి ఆచూకీ గల్లంతు ...

యుద్ధ క్షేత్రానికి తరలించిన ఈ ఐదుగురిలో ముగ్గురి ఆచూకీ గత కొన్ని రోజులుగా లభ్యం కాకపోవడంతో వారి పరిస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఇక బంకర్లలో రహస్యంగా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని దాక్కున్న మిగిలిన ఇద్దరు యువకులు ఒక కన్నీటి సెల్ఫీ వీడియోను విడుదల చేశారు.

బాంబుల మోత, శత్రువుల తుపాకుల శబ్దాల మధ్య తాము అనుభవిస్తున్న నరకాన్ని అందులో వివరించారు. 'ఏ క్షణంలో ఏం జరుగుతుందో తెలియని స్థితిలో ఉన్నాం, బహుశా ఇదే మాకు చివరి రోజు కావచ్చు. ప్రధాని మోదీ తక్షణమే స్పందించి మమ్మల్ని రక్షించి స్వదేశానికి తీసుకెళ్లాలి' అని ఆవేదనతో వేడుకున్నారు.

బాధిత కుటుంబాల ఆవేదన..

విశాఖలో ఉన్న బాధితుల కుటుంబ సభ్యులు ఈ వీడియో చూసి గుండెలు పగిలేలా ఏడుస్తున్నారు. తమ బిడ్డలు బతికి బట్టకడతారో లేదోనన్న భయంతో తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు. రష్యా ఎంబసీ, కేంద్ర విదేశాంగ శాఖతో వెంటనే మాట్లాడి, తమ పిల్లలను క్షేమంగా ఇండియాకు రప్పించేలా ఏపీ రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని వేడుకుంటున్నారు.

ఎవరెస్టుపై రెండు హెలికాప్టర్లు ఢీ

(మొదటి పేజీ తరువాయి)

ఉదయం సోలుఖుంబు ప్రాంతంలోని ఫెరిచే హెలిప్యాడ్ వద్ద ల్యాండ్ అవుతుండగా ఈ ప్రమాదం జరిగింది . ఈ ఘటనలో భారతీయుడు ప్రాణాలు కోల్పోయారు. ఇక ఓ ఎన్నారై, పైలట్ గాయపడ్డారని పోలీసులు వెల్లడించారు. తమకు అత్యంత సమీపంలో రెండు హెలికాప్టర్లు ఢీకొనడంతో హెలిప్యాడ్కు సమీపంలో ఉన్నవారంతా పరుగులు తీశారు. ప్రమాద దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్గా మారాయి.ల్యాండింగ్కు క్షణాల ముందు హెలికాప్టర్ల రోటర్లు పరస్పరం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. 'ఫిష్టెయిల్ ఎయిర్' హెలికాప్టర్లో ప్రయాణిస్తున్న భారత ప్రయాణికుడు ప్రాణాలు కోల్పోగా.. 'ఎయిర్ డైనాస్టీ' సంస్థకు చెందిన హెలికాప్టర్ పైలట్ గాయపడ్డారు. మృతి చెందిన భారతీయుడి పేరు వసంత్ కుమార్ బలరామరామడు (47)గా గుర్తించారు. ఆయనది భారత్లో ఏ రాష్ట్రమో తెలియాల్సి ఉంది. అదే హెలికాప్టర్లో భారత సంతతికి చెందిన న్యూజిలాండ్ వాసి 49 ఏళ్ల శైలేష్ క్రిష్ణ పటేల్ గాయపడ్డారు. ప్రస్తుతం ఆయనను ఖాట్మండుకు తరలించి చికిత్స అందిస్తున్నారు. హిమాలయ దేశం నేపాల్లో పర్యాటకులు, పర్వతారోహకులు, సరకు రవాణా, అత్యవసర తరలింపులు చేపట్టడానికి చిన్న హెలికాప్టర్లను విస్తృతంగా వినియోగిస్తున్నారు. పర్వత ప్రాంతం, వేగంగా మారే వాతావరణ పరిస్థితులు విమాన కార్యకలాపాలను ప్రమాదకరంగా మారుస్తున్నాయి. ఇలాంటి సవాళ్లతో కూడుకున్న వాతావరణం కారణంగానే ఇటీవల ఉత్తరాఖండ్ లోని చమోలీ వద్ద హెలికాప్టర్ ప్రమాదం జరిగింది. బద్రీనాథ్ నుంచి దేహ్రాదూన్కు వెళ్తున్న సమయంలో జరిగిన ఈ ఘటనలో పైలట్ సహా ఆరుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు.

ఏసీపీ మనస్వి వశిష్ఠపై సస్పెన్షన్ వేటు

(మొదటి పేజీ తరువాయి)

పోస్టులకే కేటాయించాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. ఈ నిరసనలో భాగంగా పోలీసుల బృందం పోలీసు కమిషనర్ అనురాగ్ కుమార్ను కలిసి ఐదు ప్రధాన డిమాండ్లతో వినతిపత్రం సమర్పించింది.

షాదరా ఘటనలో ప్రమేయం ఉన్న న్యాయవాదులపై చర్యలు తీసుకోవాలని, అలాగే రౌడీయిజానికి పాల్పడే లాయర్లపై ఎఫ్ఐఆర్లు నమోదు చేయాలని ఆ డిమాండ్లలో కోరారు. పోలీసుల మనోధైర్యాన్ని దెబ్బతీయకుండా సత్వర తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు. నిరసనకారులు వర్దీ కా అప్మాన్ నహీ సహేంగే (యూనిఫాం అవమానాన్ని సహించబోం) అంటూ ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. ప్రధాన కార్యాలయం 1వ గేట్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో న్యూఢిల్లీ డీసీపీ సచిన్ శర్మ అక్కడికి చేరుకుని పోలీసులను సముదాయించే ప్రయత్నం చేశారు. కొందరిని లోపలికి రావాల్సిందిగా కోరినా వారు తిరస్కరించి, పోలీసు కమిషనర్తో నేరుగా 'సంపర్క్ సభ' నిర్వహించాలని పట్టుబట్టడంతో చివరకు అదే విధంగా సమావేశం జరిగింది.

నిరసనలకు ప్రత్యేక స్థలం కేటాయించండి: సుప్రీంకోర్టు

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం విచారణ జరిపింది. నిరసన తెలిపే హక్కు ఉంది, అయితే దానికి కాలపరిమితి ఉండాలని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ అన్నారు. కేవలం నిరసన జరుగుతోందన్న కారణంగా ఒక సమూహం బహిరంగ ప్రదేశంలో ఇతరుల రాకపోకల్ని అడ్డుకోకూడదని వ్యాఖ్యానించారు. క్రాంచ్ జనతా పార్టీ జూలై 20న జరిగిన నిరసనకు కేవలం ఒక్క రోజు మాత్రమే అనుమతి ఇచ్చామని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు. అయితే, నిరసనకారులు అనుమతించిన సమయం కన్నా ఎక్కువ సమయం, 17 రోజుల పాటు అక్కడే ఉన్నారనే విషయాన్ని కోర్టుకు వెల్లడించారు. పార్లమెంట్ వరకు ర్యాలీగా వెళ్లారని తెలిపారు. పార్లమెంట్, సుప్రీంకోర్టులు సాధారణ రాజకీయ భవనాలు కాదని, మీరు అక్కడికి ర్యాలీగా వెళ్లలేరని మెహతా అన్నారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్తో పాటు జస్టిస్ జోయ్మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనాలతో కూడిన ధర్మాసనం పలు పిటిషన్లను విచారించింది. వీటిలో వ్యాపార సంఘాలు దాఖలు చేసిన పిటిషన్లతో పాటు నిరసన సందర్భంగా పెద్ద సంఖ్యలో ప్రజల్ని నిర్బంధించడం, పోలీసుల దౌర్జన్యాలు, మెట్రో స్టేషన్ల మూసివేత, ఇంటర్నెట్ నిలిపివేత అంశాలపై పిటిషన్లు దాఖలయ్యాయి. నిరసనల కారణంగా వ్యాపారానికి నష్టం జరిగిందని వ్యాపార సంఘాలు ఆరోపించాయి. ఈ సమయంలో ఆందోళనలు నిర్వహించిన రాజకీయ పార్టీలను కూడా పిటిషన్లో ప్రతివాదులుగా చేర్చాలని ధర్మాసనం సూచించింది. వ్యాపారుల తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు.

తుమ్మిడి హట్టిపై సీఎం ఫోకస్

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి తుమ్మిడి హెట్టి ప్రాజెక్టుపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లా డుతూ మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూము లకు తగిన పరిహారం చెల్లించడానికి సిద్ధంగా ఉన్నా మని స్పష్టం చేశారు. ఇందుకోసం అవసరమైన నిధులను జాయింట్ అకౌంట్లో ఉంచుతామనీ, భూముల ముంపుపై మహారాష్ట్ర ఎలాంటి సర్వే చేయించుకున్నా తమకు అభ్యంతరం లేదని వ్యాఖ్యానించారు. తుమ్మిడిహట్టి బ్యారేజ్ నిర్మాణం విషయంలో అంతర్రాష్ట్ర సమన్వయానికి ప్రాధాన్యత ఇస్తూ మహారాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారులతో నిరంతరం సమన్వయం సాధించాలన్నారు. ప్రాజె క్టుకు సంబంధించిన ఏ అంశంపై అయినా స్పష్ట తతో ముందుకు వెళ్లాలని సూచించారు.

మహారాష్ట్ర అధికారులకు కావాల్సిన సమా చారం ఎప్పటికప్పుడు అందించాలని స్పష్టం చేశారు.

ఈ సమీక్షలో ఇరిగేషన్ శాఖ సలహాదారు ఆది త్యనాథ్ దాస్, సెక్రటరీ శ్రీధర్, ఈఎన్సీ రమేశ్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కాగా, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై సీఎం రేవంత్ రెడ్డి తాజాగా జరిపిన సమీ క్షతో ఆ ప్రాజెక్టుకు సంబంధించి మహారాష్ట్ర ప్రభు త్వంతో చర్చలు, ముంపు భూముల సర్వే, పరి హారం చెల్లింపు అంశాలు మరోసారి ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ నేపథ్యంలో తుమ్మిడి హెట్టి బ్యారేజ్ నిర్మాణానికి సంబంధించిన అంశంలో త్వరలోనే ముందడుగు పడనుందని రెండు రాష్ట్రాల ప్రజలు భావిస్తున్నారు.

ముంపు భూములకు తగిన పరిహారం..

జాయింట్ అకౌంట్లో నిధులు

బ్యారేజ్ నిర్మాణం వల్ల మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ముంపునకు గురయ్యే భూములకు పూర్తిస్థాయిలో తగిన పరిహారం చెల్లించడానికి తెలంగాణ ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. దీనికోసం ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా, అవసరమైన నిధులను ప్రత్యేకంగా 'జాయింట్ అకౌంట్'లో ఉంచుతామని స్పష్టం చేశారు. అంతేకాకుండా, ముంపు ప్రాంతాలు, భూముల వివరాలపై మహారాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి స్వతంత్ర సర్వే చేయించుకున్నప్పటికీ తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన తేల్చిచెప్పారు. మహారాష్ట్ర అధికారులకు కావాల్సిన సమస్త సమాచారాన్ని, ఇప్పటివరకు కుదిరిన ఒప్పందాలు , ఇతర పత్రాలను ఎప్పటికప్పుడు వారికి అందజేయాలని అధికారులను ఆదేశించారు. ముంపునకు సంబంధించిన పూర్తి సమగ్ర వివరాలతో ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని సూచించారు.

ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం.. అరాచకవాదాన్ని అంతం చేద్దాం

హైదరాబాద్, నవంబర్ 03, (మనం బ్యూరో): రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిద్దాం...అరాచకవా దాన్ని అంతం చేద్దామని బీజేఎల్పీ నేత ఏలేటి మహే శ్వర్ రెడ్డి అన్నారు. పాకిస్తాన్లో కుట్రదారులకు, ఢిల్లీలో గుంట నక్కలకు వినిపించేలా వందేమాతరం నినాదాలు మార్మోగాలని పిలుపునిచ్చారు.వర్షం పడుతుంటే శుభసూచకమని, తెలంగాణలో రాబోయేది కాషాయ జెండా అనీ, సునీల్ బన్సల్ ఇక్కడికి రావడమే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు.ఒడిశా, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్లో కాషాయ జెండా ఎగురవేసిన సునీల్ బన్సల్ గారికి స్వాగతం పలుకుతూ, 3 కిలోమీటర్ల పాదయాత్రలో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పాల్గొన్న ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు.నిర్మల్లో నిర్వ హించిన మహా పాదయాత్ర సందర్భంగా బీజేఎల్పీ నేత ఏలేటి మాట్లాడుతూ ఢిల్లీలో నలుగురిని పోగేసుకొని కాంగ్రెస్ పార్టీ అరాచకాలు సృష్టిస్తున్న తీరును దేశ ప్రజలు గమనిస్తున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీ ఓటు చోరీ అంటూ ఆరోపణలు చేస్తున్నారని, కానీ ఆయన చేస్తున్నది పేరు చోరీ రాజకీయాలని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ కుటుంబ చరిత్రను ప్రస్తావిస్తూ, ఫిరంగి జహంగీర్ నుంచి రాజీవ్ గాంధీ, అక్కడి నుంచి రాహుల్ గాంధీ వరకు వచ్చిన కుటుంబ రాజకీయాలపై ప్రశ్నలు సంధించారు. విదేశీ కుట్రలతో నేపాల్, శ్రీలంక, బంగ్లాదేశ్లో జరిగిన పరిణామాలను భారత్లోనూ సృష్టించాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అయితే కేంద్రం లోని బీజేపీ ప్రభు త్వం అలాంటి కుట్రలను అనుమతించబోదని, యువత దేశం వైపే నిలుస్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలపై ప్రశ్నిస్తూ, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రూ.4,000 పెన్షన్ ఇవ్వలేదు, యువతకు ఉద్యోగాలు కల్పించలేదు, విద్యార్థులకు రీయింబర్స్మెంట్ చెల్లించలేదు, రైతులకు రైతు భరోసా అందించలేదు....ఇలా అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం చేస్తూ, వారి సమస్యలను పక్కనపెట్టి ఢిల్లీలో రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి తనను తాను మూటా మేస్త్రీగా చెప్పుకుంటారని, కానీ వాస్తవానికి ఆయన మూటల మేస్త్రీ అని విమర్శించారు. రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసిన రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేస్తూ, ఢిల్లీలో మూటలు మోస్తున్నారని మండిపడ్డారు.రాహుల్ గాంధీ ఓటు చోరీ అంటూ ఆరోపణలు చేస్తున్నారని, కానీ ఆయన చేస్తున్నది పేరు చోరీ రాజకీయాలని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ కుటుంబ చరిత్రను ప్రస్తావిస్తూ, ఫిరంగి జహంగీర్ నుంచి రాజీవ్ గాంధీ, అక్కడి నుంచి రాహుల్ గాంధీ వరకు వచ్చిన కుటుంబ రాజకీయాలపై ప్రశ్నలు సంధించారు.
విదేశీ కుట్రలతో నేపాల్, శ్రీలంక, బంగ్లాదేశ్లో జరిగిన పరిణామాలను భారత్లోనూ సృష్టించాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

దమ్మీలు ఇస్తే భయపడలా?

మీ దమ్మీలకు భయపడబోము?: మంత్రి అడ్లూరి లక్ష్మణ్

హైదరాబాద్, మనం ప్రతినిధి: కేంద్ర హోంమంత్రి అమిత్ షా హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో తెలంగాణ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్రెడ్డి ప్రభుత్వం తప్పులు చేస్తే కేంద్ర హోంశాఖ చేతిలో ఉన్న అధికారాలతో వాటిని బయటపెట్టాలని సవాల్ విసిరారు. జనాలను పోగేసి దమ్మీలు ఇస్తే భయపడేవాళ్లు ఇక్కడ ఎవరూ లేరని వ్యాఖ్యానించారు. రాహుల్గాంధీ పేరు చెబితే బీజేపీ ఎందుకు భయపడుతోందని ప్రశ్నించారు. బడుగు, బలహీన వర్గాలు కాంగ్రెస్కు అండగా ఉన్నందునే వారి ఓట్లను తొలగించేందుకు ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను బీజేపీ ఉపయోగించుకుంటోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వానికి నిజాయతీ ఉంటే ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ను పదవి నుంచి తొలగించాలని అడ్లూరి డిమాండ్ చేశారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని వివిధ పార్టీలు కోరుతున్నా కేంద్రం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

2028లో ఇదే స్ఫూర్తి కావాలి

హైదరాబాద్, నవంబర్ 3, మనం ప్రతినిధి: నగరంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాపాదయాత్ర సక్సెస్ అయిందని.. ఇలా పని చేస్తే తెలంగాణలో అధికారంలోకి వస్తామని పార్టీ శ్రేణులకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. మంగళవారం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బీజేపీ జిల్లా, డివిజన్ అధ్యక్షులు, జిల్లా ఇన్చార్జీలతో మంత్రి అమిత్ షా టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మహాపాదయాత్ర సక్సెస్ అయిన నేపథ్యంలో టీ. బీజేపీ చీఫ్ రాంచందర్ రావును అభినందించారు. పాదయాత్రలో జన సందోహం చాలా బాగుందని అన్నారు. ప్రజల్లో ఉత్సాహం కనిపిస్తుందని అమిత్ షా పేర్కొన్నారు. హైదరాబాద్లో లోక్తంత్ర్య బచావో - అరాచకత హటావో (ప్రజాస్వామ్యాన్ని కాపాడండి -అరాచకత్వాన్ని అంతం చేయండి) పేరిట బీజేపీ ఆధ్వర్యంలో మహాపాదయాత్ర ఎంజే మార్కెట్ వరకు సాగిన తీరును అమిత్ షా గుర్తు చేసుకున్నారు. ఢిల్లీలో విపక్షాలు చేపట్టిన ర్యాలీకి దీటుగా హైదరాబాద్ వేదికగా బీజేపీ ఈ ర్యాలీ నిర్వహించిన విషయం తెలిసిందే. ఇండియా కూటమిపై మండిపడ్డ ఆయన.. దమ్ముంటే చర్చకు రావాలని విపక్షాలకు అమిత్ షా సవాల్ విసిరారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని కూడా షా తనదైన శైలీలో మాటల తుటాలు పెల్చారు. ఈ ర్యాలీలో బీజేపీ నేతలు, కార్యకర్తలు, పార్టీ మద్దతుదారులతోపాటు ప్రజలు రాకతో భారీగా పాదయాత్ర సక్సెస్ కావడంతో టీ. బీజేపీ చీఫ్ను కేంద్ర మంత్రి అమిత్ షా అభినందనలతో ముంచెత్తారు. పాదయాత్ర, బహిరంగ సభలో అమిత్ షా మాట్లాడుతూ.. తెలంగాణలో రేవంత్ సర్కార్పై నిప్పులు చెరిగారు.

అమెరికా మిడ్ టర్మ్ ఎన్నికలు..

(మొదటి పేజీ తరువాయి)

మొత్తం 435 స్థానాలతో పాటు సెనేట్లోని 35 స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. వీటితో పాటు 36 రాష్ట్రాల్లో గవర్నర్ పదవులకూ ఓటింగ్ నిర్వహిస్తున్నారు.

ట్రంపకు సర్వేల షాక్..

ఎన్నికలకు ముందు వెలువడిన మూడు సర్వేలు ట్రంప్కు షాక్ ఇస్తున్నాయి. మూడింటిలో డెమొక్రాట్లకు ఆధిక్యత వస్తుందని అంచనా వేశాయి. జాన్ జోగ్బీ స్ట్రాటజీస్ నవంబర్ 1, 2 తేదీల్లో నిర్వహించిన సర్వేలో డెమొక్రాట్లకు 53 శాతం, రిపబ్లికన్లకు 47 శాతం మద్దతు లభించింది. అక్టోబర్ 30న వెలువడిన యూగోవ్ సర్వేలో డెమొక్రాట్లకు 53 శాతం, రిపబ్లికన్లకు 44 శాతం మద్దతు నమోదైంది.

రాహుల్ గాంధీ మరోసారి బహిరంగ చర్చకు సవాల్

(మొదటి పేజీ తరువాయి)

చీఫ్ మోహన్ భగవత్ను నియమించుకోవచ్చని వ్యాఖ్యానించారు. అసలు దేశ వ్యతిరేకి ఎవరు? విదేశీ శక్తులతో ఎవరికి సంబంధాలున్నాయి? వాటి స్వరూపమేంటి? అనే ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని డిమాండ్ చేశారు. చర్చకు భయపడవద్దంటూ ప్రధానిని ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు.

అమెరికా ఒప్పందం నుంచి అదానీ కేసు వరకు..

భారత్-అమెరికా ఒప్పందం కుదిరిన తీరు, దాని వేగం, మంత్రివర్గానికి సమాచారం ఇచ్చారా లేదా అనే అంశాలతోపాటు అదానీ కేసు, ఎప్స్టీన్ వ్యవహారంపై కూడా చర్చించాలని రాహుల్ కోరారు. ఈ అంశాలపై ఆయన లేవనెత్తిన ప్రశ్నలు, ఆరోపణలకు స్వతంత్ర ఆధారాలను వెల్లడించలేదు. తనపై ఇప్పటికే అనేక పరువునష్టం కేసులు ఉన్నాయని పేర్కొన్న రాహుల్, విదేశీ సంబంధాలపై తాను చేసిన ఆరోపణలకు సంబంధించి కూడా కేసు వేయాలని సవాల్ చేశారు. మరోవైపు రాహుల్ వ్యాఖ్యలను కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు విమర్శించారు. విదేశీ శక్తుల అంశంపై కాంగ్రెస్ నేత చేస్తున్న ఆరోపణలను ఆయన తప్పుబట్టారు. ఈ రాజకీయ వాగ్వాదం మధ్య మోదీతో నేరుగా చర్చ జరపాలన్న డిమాండ్ను రాహుల్ మరోసారి ముందుకు తీసుకొచ్చారు.

కమలం పుంజుకునేనా..?

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్ ఇటీవలే స్టేట్ లీడర్స్కు వార్నింగ్ ఇచ్చారు. అదే సమయంలో ఈసారి తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందంటూ ధీమాగా చెప్పారాయన. 6 నెలల్లో రాష్ట్ర పార్టీలో విప్లవాత్మక మార్పులు ఉంటాయని కూడా స్పష్టం చేశారు బన్సల్. అందులో భాగంగానేనా అన్నట్టు ప్రస్తుతం పరిస్థితులు మారుతున్నాయంటున్నారు. బన్సల్ చెప్పినట్టుగానే మెల్లిగా తెలంగాణ బీజేపీ స్పీడ్ పెంచుతోంది. నేషనల్ కాషాయ లీడర్స్ రాష్ట్రానికి వరుసబెడుతున్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్తో పాటు బడా నేతలంతా ఇక మీదట రాష్ట్రానికి రెగ్యులర్గా రాబోతున్నారట. ఒక రకంగా చెప్పాలంటే ఇక మీదట రాజకీయ దండయాత్రలు ఉంటాయని అంటున్నారు. పేరు ఏదైనా. కేంద్ర హోం మంత్రి అమిత్షా తాజా టూర్ కూడా మిషన్ తెలంగాణలో భాగమే అన్నది పొలిటికల్ అనాలసిస్. అసెంబ్లీ ఎన్నికల దిశగా రాష్ట్రంలో పార్టీకి ఊపు తీసుకుని వచ్చే కార్యక్రమంలో భాగంగానే షా.. హైదరాబాద్ ప్రోగ్రాం పెట్టుకున్నారన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. తెలంగాణ. కాంగ్రెస్ పాలిత రాష్ట్రం కావడం, ఢిల్లీలో కాంగ్రెస్ ర్యాలీ జరిగిన మరుసటి రోజే ఆయన హైదరాబాద్లో అడుగుపెట్టడం యాదృచ్ఛికం కాదని, దీని వెనక గట్టి రాజకీయ వ్యూహం ఉందని చెప్పుకుంటున్నారు.

దీని ద్వారా కాంగ్రెస్కు ఆయన సవాల్ విసిరారన్న విశ్లేషణలు సైతం ఉన్నాయి. ఇక దీపావళి తర్వాత పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ తెలంగాణకు రాబోతున్నారు. కరీంనగర్లో జరిగే మహా పాదయాత్రలో పాల్గొంటారాయన. సాధారణంగా బీజేపీ అధిష్టానం ఒక రాష్ట్రం మీద దృష్టి పెట్టిందంటే రెండేళ్ల ముందే మిషన్ స్టార్ట్ చేస్తుందని అంటారు. ప్రస్తుత పరిస్థితుల్ని చూస్తుంటేతెలంగాణలో కూడా మిషన్ స్టార్ట్ అయిపోయిందని, గేరు మార్చేందుకే అమిత్ షా ఇక్కడికి వచ్చారన్నది రాజకీయ విశ్లేషణ. ప్రజలకు పార్టీ కేడర్కి స్పష్టమైన సంకేతాలు ఇచ్చేందుకే అయన వచ్చినట్టు చెప్పుకుంటున్నారు. అమిత్ షా , మోడీ లాంటి బీజేపీ నేతలు రాష్ట్రాలకు వచ్చారంటేనే ఆ పొలిటికల్ హీట్, కేలిక్యులేషన్స్ వేరే లెవెల్లో ఉంటాయన్నది రాజకీయ వర్గాల అభిప్రాయం. వీటన్నిటినీ కలిపి చూస్తుంటే తెలంగాణ పొలిటికల్ పిచ్ మీద బీజేపీ బ్యాటింగ్ మొదలైనట్టేనన్నది రాజకీయ విస్తృతాభిప్రాయం.

కుప్పం టు పులివెందుల.. క్లీన్ స్వీప్!

(మొదటి పేజీ తరువాయి)

ఉదయం ఓట్ల లెక్కింపు ప్రారంభమైన క్షణం నుంచే కూటమి అభ్యర్థులు ఏకపక్ష ఆధిక్యతను ప్రదర్శిస్తూ విపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కోలుకోలేని దెబ్బకొట్టారు. ఈ ఫలితాలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి పాలనపై ప్రజలు ఉంచిన నమ్మకానికి అద్దం పడుతున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

కార్పొరేషన్లలో వన్-సైడ్ వార్

రాష్ట్రంలోని గ్రేటర్ విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు సహా మొత్తం 13 మున్సిపల్ కార్పొరేషన్లలో కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీతో క్లీన్ స్వీప్ చేశారు. పులివెందులలో చారిత్రాత్మక మార్పు కనిపించింది. వైఎస్సార్సీపీ కంచుకోటగా భావించే పులివెందుల మున్సిపాలిటీలో టీడీపీ అభ్యర్థి టి. గీతాకుమారి ఘనవిజయం సాధించారు. ఇక్కడ మొత్తం 40 వార్డులకు గానూ 37 వార్డులను కూటమి గెలుచుకోగా, వైసీపీ కేవలం 3 స్థానాలకే పరిమితమైంది. కుప్పం, మాచర్లలో సంపూర్ణ విజయం దక్కింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సొంత నియోజకవర్గమైన కుప్పం మున్సిపాలిటీలోని మొత్తం 32 వార్డులనూ టీడీపీ కైవసం చేసుకుని విపక్షానికి ఖాతా కూడా తెరవనివ్వలేదు. మాచర్లలోని మొత్తం 36 వార్డులనూ కూటమి (టీడీపీ 32, జనసేన 3, బీజేపీ 1 క్లీన్ స్వీప్ చేసింది. మున్సిపాలిటీల్లోనూ అదే జోరు కనపడింది. : దాదాపు 92 పట్టణ స్థానిక సంస్థల్లో 88 కి పైగా స్థానాల్లో కూటమి స్పష్టమైన విజయభేరి మోగించింది. పుంగనూరు, పెనుకొండ, ఆత్మకూరు, వినుకొండ, పలాస వంటి కీలక మున్సిపాలిటీలన్నీ కూటమి ఖాతాలోకే చేరాయి.

పోలింగ్కు ముందే సగం విజయం

ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన నాటి నుంచే కూటమి హవా కనిపించింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 17 మున్సిపల్ ఛైర్మన్ స్థానాలను కూటమి అభ్యర్థులు ఏకగ్రీవంగానే సొంతం చేసుకుని రికార్డు సృష్టించారు. ఈ ఫలితాలపై కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పందిస్తూ, ఇది గత వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనకు ప్రజలు ఓటు ద్వారా బుద్ధి చెప్పిన తీర్పు అని, కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, ప్రగతి వైపే ప్రజలు ఉన్నారని స్పష్టం చేశారు.

మాటించిండు..నిలబెట్టుకుండు

హైదరాబాద్, నవంబర్ 3(మనం ప్రతినిధి): మంచి జీతంతో పాటు విదేశాల్లో మంచి ఉద్యోగం(ఉపాధి) కల్పిస్తామని నమ్మించి మోసం చేసిన ఘటనలో పాడరాని బాధలువడుతున్న మహిళకు బీఆర్ఎస్ పార్టీ పూర్తి అండగా నిలిచింది. మీరేం రంది పడకండి మీకు నేనున్ననంటూ భరోసా ఇచ్చిన ఇచ్చిన కేటీఆర్ ఎట్టకేలకు తన మాట నిలబెట్టుకున్నారు. గత కొద్ది రోజుల క్రితం మస్కట్లో చిక్కుకుపోయిన వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గానికి చెందిన తుప్పుడు లక్ష్మిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సురక్షితంగా స్వదేశానికి రప్పించి, నెల రోజుల్లోనే తల్లిని ఇంటికి తీసుకొస్తానని ఆమె కుమారుడు రాజుకు ఇచ్చిన హామీని నెరవేర్చి ఆ కుటుంబంలో ఆనందం నింపారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని గోకఫసల్వాడ గ్రామానికి చెందిన తుప్పుడు లక్ష్మి, భర్త వెంకటప్ప ఉపాధి కోసం ఫిబ్రవరి 27న మస్కట్కు వెళ్లారు. అయితే అక్కడికి చేరుకున్న తర్వాత ఏజెంట్ చెప్పిన పనికి భిన్నమైన పని అప్పగించడంతో ఆమె తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అంతేకాకుండా యజమాని (కఫీల్) ఆమె పాస్పోర్టును స్వాధీనం చేసుకుని స్వదేశానికి పంపించేందుకు నిరాకరించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తనను విదేశాలకు పంపించిన ఏజెంట్ కూడా ఫోన్కు స్పందించకుండా, తిరిగి భారత్కు పంపించేందుకు రూ.2 లక్షలు డిమాండ్ చేసినట్లు లక్ష్మి కుటుంబానికి తెలిపింది. ఈ క్రమంలో ఆమె వైఫై, సిమ్ కార్డు సేవలు కూడా నిలిచిపోవడంతో కుటుంబ సభ్యులతో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. చివరకు పక్కింటి వారి ఇంటర్నెట్ సహాయంతో తన కుమారుడు రాజును సంప్రదించి అక్కడ ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. తల్లి పడుతున్న కష్టాలను చూసి చలించిపోయిన కుమారుడు రాజు సెప్టెంబర్ 29న కేటీఆర్ను కలిసి తమ కుటుంబ పరిస్థితిని వివరించారు. స్పందించిన కేటీఆర్ నెల రోజుల్లోనే పాస్పోర్టు సమస్యను పరిష్కరించి, తల్లిని సురక్షితంగా స్వదేశానికి తీసుకొస్తానని రాజుకు భరోసా ఇచ్చారు.
ఇచ్చిన మాట ప్రకారం కేటీఆర్ వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు లేఖ రాయడంతో పాటు అవసరమైన చర్యలు తీసుకున్నారు. దీంతో లక్ష్మి సురక్షితంగా భారత్కు తిరిగి చేరుకున్నారు.స్వదేశానికి చేరుకుని కుటుంబ సభ్యులను కలుసుకున్న అనంతరం లక్ష్మి ఈరోజు మంగళవారం హైదరాబాద్లో తెలంగాణ భవన్లో కేటీఆర్ను,మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని బాధితురాలు లక్ష్మి, ఆమె కుమారుడు రాజు స్వయంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తమ కుటుంబం తీవ్ర ఆందోళనలో ఉన్న సమయంలో అండగా నిలిచి, కుమారుడికి ఇచ్చిన మాటను నెల



రోజుల్లోనే నిలబెట్టుకున్న కేటీఆర్కు జీవితాంతం రుణపడి ఉంటానని భావోద్వేగంతో పేర్కొన్నారు. ఈ సందర్భంగా తుప్పుడు లక్ష్మి మాట్లాడుతూ..నా కొడుకుకు కేటీఆర్ ఇంటికి తీసుకొస్తానని, ఇచ్చిన మాట ప్రకారం నన్ను సురక్షితంగా ఇంటికి తీసుకొచ్చారు. నేను, నా కుటుంబం ఎదుర్కొంటున్న కష్టకాలంలో కేటీఆర్ మాకు అండగా నిలిచారన్నారు. ఆయన చేసిన సహాయాన్ని మా జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేను అని ఆమె అన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్కు.. లక్ష్మి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

విద్యుత్ వినియోగంపై ప్రజలకు వాస్తవాలు తెలియాలె



- ప్రజా ప్రభుత్వం తీసుకున్న చర్యలతో పరిశ్రమల ఉత్పత్తులు పెరిగినై
- ప్రభుత్వ విప్ డా.బల్మూరి వెంకట్

హైదరాబాద్, నవంబర్ 03, (మనం బ్యూరో) : రాష్ట్రంలో విద్యుత్ వినియోగంపై ప్రజలకు వాస్తవాలు తెలియాలని ప్రభుత్వ విప్ డా.బల్మూరి వెంకట్ అన్నారు. విద్యుత్ వినియోగం పెరగడం అభివృద్ధికి చిహ్నమనీ, ప్రజా ప్రభుత్వం తీసుకున్న చర్యలతో పరిశ్రమల్లో ఉత్పత్తులు పెరిగాయని పేర్కొన్నారు. మంగళవారం ఎలక్ట్రిసిటి రెగ్యులేటరీ కమిషన్ నిర్వహించిన పబ్లిక్ హియరింగ్‌కు హాజరైన సందర్భంగా బల్మూరి వెంకట్ మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యుత్ విషయంలో వాస్తవాలు చెప్పే ప్రయత్నం చేయలేదని విమర్శించారు. బొగ్గు లభ్యతను పరిగణనలోనికి తీసుకోకుండా యాదాద్రి పవర్ ప్లాంట్ కట్టారని ఆరోపించారు. భారమైనప్పటికీ ఈ ప్లాంట్‌ను ప్రజా ప్రభుత్వం వినియోగంలోకి తీసుకొచ్చిందనీ, బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన నీటి ప్రాజెక్టులు, పవర్ ప్లాంట్ల ఖర్చు తడిసి మోపెడెందని తెలిపారు. నీళ్ల విద్యుత్ వినియోగం విషయంలో బీఆర్ఎస్ నేతలు ప్రజలకు తప్పుడు సమాచారం ఇస్తున్నారనీ, ప్రజలకు వాస్తవాలు చెప్పాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని వ్యాఖ్యానించారు. అందుకే మేం ఏ విషయంలోనైనా ప్రజలకు వాస్తవ పరిస్థితి చెప్పే ప్రయత్నం చేస్తున్నామని ఈ సందర్భంగా బల్మూరి వెంకట్ స్పష్టం చేశారు.

పుట్టిన రోజు సందర్భంగా బల్మూరి వెంకట్ సీఎం రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా సీఎం ఆయనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పి ప్రజలకు సేవ చేసే విషయంలో మరింత కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకుని వెళ్లి పార్టీని బలోపేతం చేయాలని పేర్కొన్నారు. అలాగే, బల్మూరి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు.

పూర్తిస్థాయి వైద్య సేవలు అందాలె

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కేన్సర్ వైద్య సేవలు
జిల్లాల్లో కీమోథెరపీ కేంద్రాల పనితీరుపైనా సమీక్ష
నివారణ, ముందస్తు గుర్తింపుపై ప్రత్యేక దృష్టి
వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ యుద్ధ ప్రతిపాదికన పూర్తిచేయాలి
ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



హైదరాబాద్, నవంబర్ 3(మనంబ్యూరో): ప్రజలకు పూర్తిస్థాయి వైద్య సేవలు అందించేందుకు హాస్పిటల్‌ను సిద్ధం చేయాలని అధికారులకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు. సెక్రటేరియట్‌లో మంగళవారం ఆర్ అండ్ బీ, ఆరోగ్యశాఖ అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పెండింగ్ పనులన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను త్వరలో ప్రారంభించనున్న నేపథ్యంలో హాస్పిటల్‌లో ప్రతి ఫ్లోర్ ప్లాన్‌ను మంత్రి పరిశీలించారు. తొలుత అవుట్ పేషెంట్ వైద్య సేవలు ప్రారంభించనున్న నేపథ్యంలో, ఇందుకు అవసరమైన రిజిస్ట్రేషన్ డెస్క్‌లు, ఓపీ కన్సల్టేషన్ రూమ్‌లు, ఫార్మసీ, డయాగ్నస్టిక్స్ తదితర సేవలకు సంబంధించిన పనులన్నీ పూర్తి చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. ఈ నెల 15వ తేదీ నాటికి అవుట్ పేషెంట్ సేవలకు సంబంధించిన అన్ని పనులు పూర్తవుతాయని నిర్మాణ సంస్థ ప్రతినిధులు మంత్రికి వివరించారు. 6 ఆపరేషన్ థియేటర్లు సైతం సిద్ధమవుతాయని తెలిపారు. ఒక్కసారి పేషెంట్ హాస్పిటల్‌కు వచ్చాక, మరో హాస్పిటల్‌కు రిఫర్ చేసే ప్రసక్తే ఉండకూడదని, అవసరమైన అన్ని రకాల వైద్య సేవలు అందించే విధంగా హాస్పిటల్‌లో సౌకర్యాలు ఉండాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం నియమించిన డాక్టర్ల బందం వరంగల్ హాస్పిటల్, అల్వాల్, కొత్తపేట టిమ్స్ హాస్పిటళ్లను రెగ్యులర్‌గా విజిట్ చేయాలని మంత్రి ఆదేశించారు. అల్వాల్ టిమ్స్ పనులు సైతం చివరి దశలో ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. ఎక్విప్‌మెంట్ ఇన్‌స్టాలేషన్ జరుగుతోందని తెలిపారు. ఈ ఏడాది మార్చి నాటికి ఎల్‌బీ నగర్ టిమ్స్ పనులు చివర దశకు వస్తాయని అధికారులు తెలిపారు. పనులన్నీ స్పీడప్ చేయాలని, వీలైనంత త్వరగా హాస్పిటళ్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

కేన్సర్ వైద్య సేవలు మరింత మెరుగు పర్చాలి

రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో కేన్సర్ రోగులకు అందుతున్న వైద్య సేవలను మరింత మెరుగుపర్చాలన్నారు. ఎంఎన్జే, నిమ్స్ ఆస్పత్రుల్లో కేన్సర్ రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, చికిత్సా విధానాలు, అందుబాటులో ఉన్న సదుపాయాల గురించి అధికారులు మంత్రికి వివరించారు. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే కేన్సర్ బాధితులకు మెరుగైన వైద్యం అందించేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. రోగులకు అవసరమైన వైద్య సేవలు సకాలంలో అందేలా చూడాల్సిన అంశాలపై సమావేశంలో చర్చించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఏర్పాటు చేసిన కీమోథెరపీ కేంద్రాల పనితీరుపైనా మంత్రి ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఆయా కేంద్రాల్లో రోగులకు అందుతున్న సేవలు, చికిత్సా సదుపాయాలు, కేంద్రాల నిర్వహణ తీరుపై అధికారులను ఆరా తీశారు. హైదరాబాద్‌లోని ప్రధాన ఆస్పత్రులకే పరిమితం కాకుండా జిల్లాల్లోనూ కేన్సర్ బాధితులకు అవసరమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చూడాల్సిన అవసరంపై చర్చించారు. కేన్సర్ నివారణ, ముందస్తు గుర్తింపు కోసం చేపట్టాల్సిన చర్యలపైనా సమావేశంలో చర్చించారు. కేన్సర్ స్క్రీనింగ్‌ను విస్తరించడం, వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించడం, బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించడం వంటి అంశాలపై సమీక్ష జరిగింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కేన్సర్ చికిత్సా సదుపాయాలను మరింత బలోపేతం చేయడంతోపాటు రోగులకు అందుబాటులో ఉండే సేవలను విస్తరించేందుకు తీసుకోవాల్సిన చర్యలను అధికారులు, వైద్య నిపుణులు సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ కేన్సర్ వైద్య నిపుణుడు నోరి దత్తాత్రేయుడు, ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా, ఆరోగ్యశాఖకు చెందిన ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డిపై మాట్లాడేటప్పుడు ఒళ్లు దగ్గర పెట్టుకో

- హరీష్ రావుకు చరణ్ కౌశిక్ యాదవ్ కౌంటర్

హైదరాబాద్, నవంబర్ 03, (మనం బ్యూరో): సీఎం రేవంత్ రెడ్డిపై హరీష్ రావు మాట్లాడేటప్పుడు ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని లైవ్‌స్టాక్ కార్పొరేషన్ చైర్మన్ చరణ్ కౌశిక్ యాదవ్ అన్నారు. అబద్దాలు మాట్లాడితే ఇకపై ఆయనకు కర్రు కాల్చి వాత పెడతామని హెచ్చరించారు.

మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాస్తవాలు మాట్లాడితే ప్రజలు నమ్ముతారు, హరీష్ రావు బుద్ధి మార్చుకుని వాస్తవ విషయాలు మాట్లాడితే మంచిదని పేర్కొన్నారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు తుమ్మిడిహెట్టి దగ్గర కట్టకుండా కాళేశ్వరం వద్ద కట్టి ఆదిలాబాద్‌ను ఎండబెట్టారన్నారు.

అధికార దాహం కోసం కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని కట్టారనీ, పాలమూరు ప్రాజెక్టు కనీసం 30 శాతం కూడా పూర్తి కాకుండానే 90 శాతం పూర్తి చేశామని అబద్దాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ కుటుంబం ప్రాజెక్టుల పేరు మీద 30 శాతం కమిషన్ తీసుకుని బంగారుమయమైందనీ, తెలంగాణ ప్రజలను మాత్రం అంధకారంలోకి నెట్టారని వ్యాఖ్యానించారు. కమీషన్‌లకు కక్కుర్తిపడి రాష్ట్రాన్ని చీకటిమయం చేశారనీ, ఎల్నినోను ఎదుర్కోవడానికి సీఎం రేవంత్ రెడ్డి అన్ని చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఇంత కరువు వస్తే కేంద్రం ఎందుకు ఆర్థిక సాయం చెయ్యదు ? అమిత్ షా తెలంగాణకు వస్తే హరీష్ రావు ఎందుకు మాట్లాడలేదని ఈ సందర్భంగా చరణ్ కౌశిక్ యాదవ్ ప్రశ్నించారు.

‘అమ్మతనం ఇదే’నేమో.. పరిమళించిన మాతృత్వం

ఎల్‌బీనగర్ స్పెషల్ కోర్టులో చంటి బిడ్డకు అమ్మలా మారిన మహిళా కానిస్టేబుల్..
మానవత్వమే ప్రాధాన్యం అంటూ గొప్ప మనసు చాటిన దీప
బిడ్డ ఏడవకుండా లాలిస్తూ, ఆడిస్తూ తల్లిలా మారి ఆలనాపాలనా చూసిన వైనం
ఇబ్బందుల్లో ఉన్న మహిళకు, ఆమె బిడ్డకు భద్రతగా నిలిచి బాధ్యత కోర్టు కానిస్టేబుల్



హైదరాబాద్, నవంబర్ 3, మనం ప్రతినిధి : పోలీసు విధుల్లో మానవత్వానికి ప్రాధాన్యం ఎంత ముఖ్యమో చైతన్యపురి మహిళా కోర్టు కానిస్టేబుల్ దీప చేసిన మంచి పనితో సమాజానికి చాటిచెప్పారు. రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టులో విచారణకు హాజరైన ఓ బాధితురాలు తన చంటి బిడ్డతో ఇబ్బంది పడుతున్న విషయాన్ని గమనించిన ఆ మహిళా కానిస్టేబుల్.. ఆ చిన్నారిని తన చేతుల్లోకి తీసుకుని విచారణ పూర్తయ్యే వరకు లాలించారు. బిడ్డను లాలిస్తూ, ఆడిస్తూ తల్లిలా ఆలనాపాలనా బాధ్యత తీసుకున్నారు. బాధితురాలికి కొంత ఊరట కల్పించడంతో పాటు.. పోలీసులంటే కేవలం చట్టాన్ని అమలు చేసేవారే కాదని.. కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలిచే మానవతావాదులని నిరూపించారు.

మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లో మహిళా కోర్టు కానిస్టేబుల్‌గా దీప విధులు నిర్వహిస్తున్నారు. పోలీసులంటే కఠినంగా విధులు నిర్వహించే అధికారులు మాత్రమే కాదు?.. అవసరమైన సమయంలో ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచే మనసున్న మంచి మనుషులని ఆ మహిళా కానిస్టేబుల్ మరోసారి నిరూపించారు.

‘మీరు విచారణపై దృష్టి పెట్టండి.. బిడ్డను నేను చూసుకుంటాను’ అన్నట్లుగా ఆ చిన్నారిని తన చేతుల్లోకి తీసుకున్నారు. విచారణ పూర్తయ్యే వరకు పసికందును ఎంతో ప్రేమగా చూసుకున్నారు. బిడ్డ ఏడవకుండా లాలిస్తూ, ఆడిస్తూ తల్లిలా ఆలనాపాలనా చూసిన తీరు, ఖాకీ యూనిఫాంలో ఉన్నా మాతృత్వాన్ని మరువని ఆమె మానవీయ స్పందన ఇప్పుడు అందరి ప్రశంసలు అందుకుంటోంది. ఒకవైపు పోలీసు విధులు.. మరోవైపు బాధితురాలికి సహాయం చేయాలనే తపన.. ఈ రెండింటినీ సమన్వయం చేస్తూ దీప వ్యవహరించిన తీరు అక్కడున్న వారిని ఆకట్టుకుంది. ఆ సమయంలో ఆమెకు అప్పగించిన బాధ్యత కేవలం కోర్టు విధులకే పరిమితం కాలేదు. ఇబ్బందుల్లో ఉన్న ఓ మహిళకు కొంత ఊరట కల్పించడం, ఆమె బిడ్డకు భద్రతగా నిలవడం కూడా తన బాధ్యతేనని ఆచరణలో చూపించారు.

చంటి బిడ్డను చేతుల్లోకి తీసుకుని చూసుకోవడం బయటకు చిన్న విషయంలా కనిపించవచ్చు. కానీ, బాధితురాలి పరిస్థితిని అర్థం చేసుకుని, ఆమెకు అవసరమైన సమయంలో సహాయం చేయడం వెనుక ఎంతో మానవత్వం ఉంది. ముఖ్యంగా పోక్సో వంటి సున్నితమైన కేసుల్లో బాధితులు ఇప్పటికే ఎన్నో మానసిక, సామాజిక ఇబ్బందులను ఎదుర్కొంటుంటారు. అలాంటి సమయంలో పోలీసు వ్యవస్థ నుంచి లభించే చిన్నపాటి ఆప్యాయత కూడా వారికి ధైర్యాన్నిస్తుంది. దీప చేసిన పని ఈ విషయాన్ని గుర్తుచేస్తోంది. కోర్టు ప్రాంగణంలో దీప చూపిన చొరవను గమనించిన లాయర్లు, పోలీసు సిబ్బంది, కోర్టుకు వచ్చినవారు ఆమెను అభినందించారు. ఈ ఘటనకు సంబంధించిన ఫొటో కూడా పలువురి దృష్టిని ఆకర్షిస్తోంది. విధి నిర్వహణ అంటే కేవలం ఆదేశాలు పాటించడం, కేసుల విచారణకు హాజరు కావడం మాత్రమే కాదని.. ప్రజల కష్టాలను అర్థం చేసుకుని స్పందించడం కూడా పోలీసు బాధ్యతలో భాగమేనని ఆమె తన చర్యతో చాటిచెప్పారు. పోలీసు యూనిఫాం క్రమశిక్షణకు, బాధ్యతకు ప్రతీక. అదే యూనిఫాంలో ఉన్న వ్యక్తి ఆప్యాయతను పంచినప్పుడు ప్రజల్లో పోలీసులపై మరింత నమ్మకం పెరుగుతుంది. చట్టాన్ని అమలు చేసే చేతులే అవసరమైనప్పుడు పసిబిడ్డను అక్కున చేర్చుకోగలవని దీప నిరూపించారు. బాధితురాలికి విచారణ సమయంలో సహాయం చేయడం ద్వారా ఒక తల్లికి ఊరటనివ్వడమే కాకుండా, ఓ చిన్నారికి ఆప్యాయతను అందించారు.

పెద్ద పెద్ద సేవా కార్యక్రమాలే మానవత్వానికి నిదర్శనం కావని.. ఎదుటివారి ఇబ్బందిని గుర్తించి, వారికి అవసరమైన సమయంలో చిన్న సహాయం చేయడమే నిజమైన మానవత్వమని ఈ ఫోటో చూసిన నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. ఎల్‌బీనగర్ ప్రత్యేక పోక్సో కోర్టులో మహిళా కానిస్టేబుల్ దీప చేసిన పని అందుకు చక్కని ఉదాహరణ అని కామెంట్లు పెడుతున్నారు. ఖాకీ వెనుక కఠినమైన బాధ్యత మాత్రమే కాదు.. అవసరమైనప్పుడు కరిగిపోయే అమ్మ మనసు కూడా ఉంటుందని ఆమె మరోసారి చాటిచెప్పారని ప్రశంసిస్తున్నారు. చిన్నారిని ఎత్తుకుని ఉన్న కానిస్టేబుల్ దీప ఫోటో ఇప్పుడు పిక్ ఆఫ్ ది డేగా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

అక్రమ బోర్లపై హైడ్రా నజర్

హైదరాబాద్ శివార్లలో ఇల్లిగల్ బోర్లను టార్గెట్ చేసిన హైడ్రా
సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌లో 7 బోర్లు, 6 వాటర్ సంపుల ధ్వంసం
అనుమతి లేని భూగర్భ జలాల వాణిజ్య వినియోగంపై ఉక్కుపాదం
ట్యాంకర్ల వేగానికి చెక్ పడటంతో హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు



హైదరాబాద్, నవంబర్ 3, మనం ప్రతినిధి : హైదరాబాద్, దాని శివారు ప్రాంతాల్లో అక్రమంగా భూగర్భ జలాలను తోడేస్తూ సాగిస్తున్న నీటి వ్యాపారంపై హైడ్రా ఉక్కుపాదం మోపుతోంది. ఎలాంటి అనుమతులు లేకుండా బోర్లు వేసి, నీటిని ట్యాంకర్ల ద్వారా అమ్ముకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా, సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో సోమవారం భారీ ఆపరేషన్ చేపట్టింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా తెల్లాపూర్లోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో 7 అక్రమ బోర్వెల్లను పైపులతో సహా తొలగించి, వాటిని పూర్తిగా పూడ్చివేసింది. అలాగే, నీటి నిల్వ కోసం నిర్మించిన 6 భారీ వాటర్ సంపులను కూడా అధికారులు ధ్వంసం చేశారు. నీటి రవాణాకు ఉపయోగిస్తున్న ట్యాంకర్లను సీజ్ చేసి, సంబంధిత యజమానులపై కేసులు నమోదు చేశారు.

భూగర్భ జలాలు అడుగంటిపోకుండా కాపాడటంతో పాటు, స్థానిక ప్రజలకు నీటి కొరత ఏర్పడకుండా చూసేందుకే ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. గత కొంతకాలంగా నీటి ట్యాంకర్లు అతివేగంగా, నిర్లక్ష్యంగా ప్రయాణిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నాయని, తమ ప్రాణాలకు భద్రత లేకుండా పోయిందని పలు కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీల వాసులు ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో హైడ్రా ఈ చర్యలకు ఉపక్రమించింది. హైడ్రా తీసుకుంటున్న చర్యలతో తమకు ప్రాణభయం తప్పిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చెరువులు, కుంటల సమీపంలో జరుగుతున్న అక్రమ నీటి దందాను పూర్తిగా అరికట్టాలని వారు కోరుతున్నారు. అనుమతులు లేని బోర్లపై నిఘా కొనసాగిస్తామని, అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు.

ప్రజల ఓటుతో చెలగాటమా?

- ప్రజల ఓటు హక్కుకు గండికొడితే సహించం
- రాహుల్ గాంధీ పోరాటానికి అండగా ఉంటాం
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 3(మనంన్యూస్): ప్రజల ఓటుతో చెలగాటమాడే అధికారం ఎవరికీ లేదని రాష్ట్ర నీటిపారుదల, ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై మంగళవారం హైదరాబాద్‌లో విడుదల చేసిన ప్రకటనలో ఆయన స్పందించారు. ప్రతి అర్హ పౌరుడి ఓటుకు రక్షణ కల్పించడం, ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని నిలబెట్టడం రాజ్యాంగబద్ధ బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు. సామాన్యుడి చేతిలో రాజ్యాంగం అందించిన అత్యంత శక్తిమంతమైన ఆయుధం ఓటు అని, అధికారాన్ని అప్పగించడానికి, పాలకులను ప్రశ్నించడానికి, అవసరమైతే వారిని మార్చడానికి ప్రజలకు ఉన్న నిర్ణయాధికారం ఓటు ద్వారానే లభిస్తుందని వివరించారు. అలాంటి ఓటు హక్కుతో చెలగాటమాడే అధికారం ఎవరికీ లేదన్నారు. ప్రజలే నిర్ణయ ప్రక్రియకు దూరమయ్యే పరిస్థితులు ఏర్పడితే ప్రజాస్వామ్య పునాదులు బలహీనపడతాయని వ్యాఖ్యానించారు.ప్రజల ఓటు హక్కుకు గండికొట్టే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ఓటరు జాబితాల ప్రక్షాళన పేరుతో అర్హులైన పౌరుల పేర్లను తొలగిస్తే అది వారి హక్కులను హరించడమేనని పేర్కొన్నారు. పౌరుడి రాజకీయ అస్తిత్వం..

ఓటరు జాబితాలోని ప్రతి పేరు వెనుక ఒక పౌరుడి రాజకీయ అస్తిత్వం, ఆత్మగౌరవం, దేశ భవిష్యత్తును నిర్ణయించాలన్న ఆకాంక్ష ఉంటాయని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. అర్హుడైన వ్యక్తి పేరు అన్యాయంగా తొలగిపోతే దాన్ని సాధారణ పరిపాలనా పొరపాటుగా పరిగణించలేమన్నారు. ఒక పౌరుడి హక్కుకు అన్యాయం జరిగినప్పుడు వ్యవస్థ వెంటనే స్పందించి పరిష్కారం చూపాలని కోరారు. వ్యవస్థలో జరిగిన తప్పులకు పౌరులను బాధ్యులను చేయడం సరికాదని అన్నారు.

తన పేరు ఎందుకు తొలగించారో తెలుసుకోవడానికి ఓటరు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఎందుకు రావాలని ప్రశ్నించారు. హక్కులను కాపాడాల్సిన వ్యవస్థే అడ్డంకిగా మారకూడదని స్పష్టం చేశారు. ఓటు హక్కుల పరిరక్షణ కోసమే లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా బలమైన స్వరాన్ని వినిపిస్తున్నారని ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. ప్రజల ఆందోళనలను రాజకీయ చర్చలోకి తీసుకురావడంతోపాటు న్యాయపరమైన పరిష్కారాల కోసం ఆయన చేస్తున్న పోరాటం ప్రజాస్వామ్య బాధ్యతకు నిదర్శనమని పేర్కొన్నారు.

పర్యావరణహిత, సుస్థిర అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి: సీఎస్ సంజయ్ జాజు



హైదరాబాద్, నవంబర్ 3(మనంబ్యూరో): రాష్ట్ర శాసన మండలి ప్రాంగణంలో ప్రతిపాదించిన అభివృద్ధి, సుందరీకరణ పనుల ప్రణాళికలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మంగళవారం పరిశీలించారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలాతో కలిసి శాసన మండలి ప్రాంగణాన్ని సందర్శించి, ప్రతిపాదిత పనులకు గుర్తించిన స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా శాసనసభ స్పీకర్, శాసన మండలి ఛైర్మన్, వైస్ ఛైర్మన్, డిప్యూటీ స్పీకర్తో పాటు శాసనసభ, శాసన మండలి కార్యదర్శుల నివాస భవనాల నిర్మాణ ప్రతిపాదనలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. శాసనసభ ప్రాంగణానికి సంబంధించిన ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్, అనుబంధ భవనం ఏర్పాటు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి అంశాలపై సమీక్షించారు.

ప్రస్తుతం పర్యాటక శాఖకు చెందిన భూమిని శాసనసభకు బదిలీ చేయడంతో పాటు, పక్కనే ఉన్న డీజీపీ కార్యాలయానికి సంబంధించిన కొంత భూమిని కూడా శాసనసభకు బదిలీ చేసే ప్రతిపాదనపై చర్చించారు. అనుబంధ భవనం, పరిపాలనా భవనం, శాసనసభా పక్ష కార్యాలయాలు, విశ్రాంతి భవనం, క్రీడా మైదానం, పార్కింగ్ సదుపాయాల అభివృద్ధి, విస్తరణకు సంబంధించిన ప్రణాళికలను పరిశీలించారు. ప్రాజెక్టు ప్రతిపాదనలు, స్థల పరిస్థితులు, ఇంజినీరింగ్ అంశాలపై సంబంధిత అధికారుల నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. ప్రతిపాదిత అభివృద్ధి పనుల్లో పర్యావరణహిత, సుస్థిర అభివృద్ధి విధానాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి స్పష్టం చేసినట్లు తెలిపారు. ఇప్పటికే ఉన్న పచ్చదనానికి ఎలాంటి విఘాతం కలగకుండా, పర్యావరణంపై ప్రతికూల ప్రభావం తగ్గేలా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో ఆర్డీఓ రామకృష్ణ, తహసీల్దార్ నయీముద్దీన్, ఆర్ అండ్ బీ ఎస్ఈ మాధవి, ఈఈ మనోహర్బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు గడువు పొడిగింపు

హైదరాబాద్, నవంబర్ 3(మనంన్యూస్): తెలంగాణలో త్వరలో జరగనున్న పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియలో కీలక మార్పు చోటుచేసుకుంది. గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు గడువును పొడిగిస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సీ. సుదర్శన్ రెడ్డి అధికారికంగా వెల్లడించారు. కొత్త నిర్ణయం ప్రకారం అర్హులైన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్లు దాఖలు చేసే చివరి రోజు వరకు తమ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు.

గత కొన్ని రోజులుగా ఓటరు నమోదు కోసం వినియోగిస్తున్న అధికారిక పోర్టల్లో సాంకేతిక లోపాలు తలెత్తాయి. దరఖాస్తు ప్రక్రియ నిలిచిపోవడంతో వేలాది మంది పట్టభద్రులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆన్లైన్ అప్లికేషన్ పోర్టల్లో సాంకేతిక అడ్డంకులు వీర్పడి సేవలు నిలిచిపోయాయి. వెబ్సైట్ సర్వర్ లోపాలను త్వరితగతిన సరిదిద్ది, ఆన్లైన్ దరఖాస్తు సేవలను త్వరలోనే పునరుద్ధరిస్తామని సీఈఓ తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల దరఖాస్తు చేయలేకపోయిన గ్రాడ్యుయేట్లు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నామినేషన్ల గడువు వరకు అవకాశం అందుబాటులో ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఎన్నికల సంఘం ప్రక్రియ ముమ్మరం చేసింది. నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితాను అధికారికంగా వెల్లడిస్తారు. ముసాయిదా జాబితా విడుదలైన రోజు (నవంబర్ 25) నుండి డిసెంబర్ 10 వరకు మార్పులు, చేర్పులు, అభ్యంతరాలను స్వీకరిస్తారు. దాఖలైన దరఖాస్తులు, అభ్యంతరాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం తుది ఓటర్ల జాబితాను రూపొందిస్తారు.

బహిరంగ ప్రకటన

పేరు లో మార్పు

ఇందుమూలంగా.. ఈ ప్రకటన ద్వారా తెలియజేసేదేమనగా..

మచన శైలజ W/O మచన రఘునందన్
ప్లాట్ నంబర్ 3, గ్రౌండ్ ఫ్లోర్, రైల్ కాలని, సిఖ్ విలేజ్, హైదరాబాద్, 500009

మాచన శైలజ w/o మాచన రఘు నందన్
ఈ రెండు పేర్లు ఒక్క వ్యక్తివే.

కొన్ని అంతే...!

గాలికి
పరిమళాలద్దిన పూలు
అదే గాలికి రాలిపోవచ్చు
అట్లని గాడ్పును అవి నిందించవు!
ప్రేమిస్తే
ప్రేమొస్తుందని చెప్పడానికి
నిర్దిష్టమైన జీవన సూత్రాలు
ఏ ప్రేమికుని దగ్గరా ఉండవు!
ఒక ప్రయాణం
మైలురాళ్లను అధిగమించినట్లు
సుఖం దుఃఖం ఆనందం ప్రేమ
అన్నిటినీ అధిగమిస్తూ వెళ్లాల్సిందే!
జీవన తీరం చేరుకున్నాక
సందర్భోచితంగా నెమరేసుకోవడానికి
అనుభవించిన అన్ని అనుభవాలు
భావితరాలకు పాఠ్యాంశాలవుతాయి!
ఓటు వేస్తే
ప్రజాస్వామ్యం పరిఢవిల్లితే
ఎన్నిసార్లు ఓటేసినా
అది అనుభవంలోకి రాదెందుకు?!
జీవితంలో కొన్ని అబద్ధాలు
నిజాలుగా చలామణవుతాయి
నామినేషన్ పత్రాలు చింపేస్తుంటే
అది అబద్ధమన్నా అవునంటున్నాం!
ఓటరు జాబితాలో
మన పేరు లేకపోతే
అది చావుతో సమానమంటారు
నిజంగా అది ఎంత అబద్ధం!
కొన్ని అంతే ఏమి చేయలేం
సందర్భోచితంగా
అవునంటూ కాదంటూ
గిరిశాలమై జారుకోవాల్సిందే!!

- కోట్ల వెంకటేశ్వర రెడ్డి
9440233261

ఆశ అదుపు చేయడం

చెరువు దగ్గరికి వెళ్ళాను చిప్పలు ఏరుకున్నాను
నది దగ్గరికి వెళ్ళాను శంఖువులు కోరుకున్నాను
అలాగే
సముద్రం దగ్గరికి వెళ్ళాను
అలల ఆవలింతలు కెరటాల కేరింతలు చూసి
సుడులు అలజడులు చూసి
వేయి బడబాగ్నులు లక్ష దావాగ్నులు చూసి
భయపడ్డాను
ముత్యాలు రత్నాలు పగడాలు కోసం వచ్చినా
నేను నిలువునా జడిసాను
వలేయటం కాదు
వదిలేయటం కూడా తెలియాలి
ఆశ పడ్డం కాదు
ఆశ అదుపు చేయడం కూడా ఎరగాలి

- కోటం చంద్రశేఖర్
9492043348

పర్యావరణ చట్టం పనితీరుపై సమీక్ష ఏదీ?



భారత ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ, అభివృద్ధి కోసం రూపొందించిన ముఖ్యమైన చట్టాలలో పర్యావరణ (రక్షణ) చట్టం, 1986 ఒకటి. 1984లో జరిగిన భోపాల్ విషవాయువు దుర్ఘటన నేపథ్యంలో పర్యావరణ భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ చట్టాన్ని ప్రవేశపెట్టారు. గాలి, నీరు, నేల కాలుష్యంతో సహా అన్ని రకాల పర్యావరణ కాలుష్యాలను నివారించడం, నియంత్రించడం, తగ్గించడం ఈ చట్టం యొక్క ప్రధాన లక్ష్యం. పర్యావరణ ప్రమాదాల నుంచి మానవులు, జంతువులు, మొక్కలు, ఇతర జీవరాశులను రక్షించడం కూడా దీని ముఖ్య ఉద్దేశం. కాలుష్య నియంత్రణకు సంబంధించి పర్యావరణ నాణ్యతా ప్రమాణాలను నిర్ణయించడానికి, కాలుష్యానికి కారణమయ్యే పారిశ్రామిక కార్యకలాపాలను నియంత్రించడానికి ఈ చట్టం కేంద్ర ప్రభుత్వానికి అధికారాలను కల్పిస్తుంది. అంతేకాకుండా, పరిశ్రమలను తనిఖీ చేయడం, నమూనాలను సేకరించడం, అవసరమైన ఆదేశాలు జారీ చేయడం, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం వంటి అధికారాలను కూడా అందిస్తుంది. సుస్థిర అభివృద్ధిని ప్రోత్సహించడం, సహజ వనరులను పరిరక్షించడం, పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో ఈ చట్టం ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంది. మొత్తంమీద, పర్యావరణ (రక్షణ) చట్టం, 1986 ప్రస్తుత, భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన, సురక్షితమైన, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించేందుకు సమగ్ర చట్టపరమైన పునాదిగా నిలుస్తోంది.

భారతదేశంలో పర్యావరణ (రక్షణ) చట్టం, 1986 సమగ్ర చట్టపరమైన నిబంధనలను కలిగి ఉన్నప్పటికీ, దాని సమర్థవంతమైన అమలులో అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి. కాలుష్య నియంత్రణ మండళ్లకు తగిన ఆర్థిక వనరులు, సాంకేతిక సదుపాయాలు, శిక్షణ పొందిన సిబ్బంది లేకపోవడం ప్రధాన అవరోధాలుగా ఉన్నాయి. 2025లో కౌన్సిల్ ఆన్ ఎనర్జీ, ఎన్విరాన్మెంట్ అండ్ వాటర్ నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం, భారతదేశంలోని 28 రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండళ్లలో 26 మండళ్లలో సిబ్బంది ఖాళీలు ఉన్నాయి. బీహార్లో అత్యధికంగా 83.94 శాతం పోస్టులు ఖాళీగా ఉండగా, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలిలో 33.44 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. చట్టాల అమలులో బలహీనత, పరిశ్రమలపై సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల అనేక పరిశ్రమలు పర్యావరణ ప్రమాణాలను ఉల్లంఘిస్తున్నాయి. వేగవంతమైన పారిశ్రామికీకరణ, పట్టణీకరణ, జనాభా పెరుగుదల, వ్యర్థ పదార్థాల ఉత్పత్తి అధికమవడం పర్యావరణ కాలుష్యాన్ని మరింత తీవ్రతరం చేస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వ సంస్థల మధ్య సమన్వయం లేకపోవడం, రాజకీయ జోక్యం, అవినీతి, న్యాయపరమైన ప్రక్రియల్లో జాప్యం, ప్రజల్లో పర్యావరణ అవగాహన తక్కువగా ఉండటం కూడా ఈ చట్టం అమలును బలహీనపరుస్తున్నాయి. పర్యావరణ ప్రభావ అంచనా ప్రక్రియను నిర్వహించకపోవడం, వ్యర్థ పదార్థాలను శాస్త్రీయ పద్ధతుల్లో పారవేయకపోవడం, కాలుష్య నియంత్రణ ప్రమాణాలను పాటించకపోవడం వంటి సమస్యలు కూడా తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.

అయితే, పర్యావరణ పరిరక్షణకు సంబంధించి భారత న్యాయవ్యవస్థ అనేక చారిత్రాత్మక తీర్పుల ద్వారా ఈ చట్టం అమలును బలోపేతం చేసింది. ఎం.సి. మెహతా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (1987) కేసులో, ఒలియం గ్యాస్ లీక్ దుర్ఘటన నేపథ్యంలో సుప్రీంకోర్టు సంపూర్ణ బాధ్యత అనే సూత్రాన్ని స్థాపించింది. దీని ప్రకారం, ప్రమాదకర పరిశ్రమల కార్యకలాపాల వల్ల జరిగే నష్టానికి సంబంధిత పరిశ్రమలే పూర్తి బాధ్యత వహించాలి. గంగా కాలుష్య కేసు (1987-1988)లో, శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయకుండా గంగానదిలోకి శుద్ధి చేయని వ్యర్థ జలాలను విడుదల చేస్తున్న తోళ్ల పరిశ్రమలను (టానరీలను) మూసివేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. వెల్లూరు సిటిజన్స్ వెల్ఫేర్ ఫోరం వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (1996) కేసులో, సుస్థిర అభివృద్ధిలో ముందుజాగ్రత్త సూత్రం కాలుష్యకారుడే పరిహారం చెల్లించాలి అనే సూత్రం అత్యంత కీలకమైనవని న్యాయస్థానం గుర్తించింది. తమిళనాడులోని తోళ్ల పరిశ్రమల ప్రాంతంలో సుమారు 35,000 హెక్టార్ల వ్యవసాయ భూమి పాక్షికంగా లేదా పూర్తిగా సాగుకు పనికిరాకుండా మారిందనే ఆధారాల నేపథ్యంలో ఈ తీర్పు వెలువడింది. ఇండియన్ కౌన్సిల్ ఫర్ ఎన్విరో-లీగల్ యాక్షన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (1996) లేదా బిచ్రీ కేసులో, విషపూరిత వ్యర్థాలను తొలగించడం, పర్యావరణానికి జరిగిన నష్టాన్ని పునరుద్ధరించడం కోసం అయ్యే ఖర్చులను కాలుష్యానికి కారణమైన పరిశ్రమలే భరించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అదేవిధంగా, తాజ్ ట్రాపెజియం కేసు (1996)లో, తాజ్‌మహల్ చుట్టుపక్కల ఉన్న పరిశ్రమలు వాయు కాలుష్యాన్ని నియంత్రించి, చారిత్రక కట్టడాన్ని పరిరక్షించేందుకు బొగ్గు మరియు కోక్కు బదులుగా స్వచ్ఛమైన సహజ వాయువును వినియోగించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

పర్యావరణ కాలుష్యాన్ని నివారించడం, సహజ వనరులను పరిరక్షించడం భారతదేశంలో సుస్థిర అభివృద్ధిని ప్రోత్సహించడం కోసం చట్టపరమైన వ్యవస్థను అందించడం ద్వారా పర్యావరణ (రక్షణ) చట్టం, 1986 ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (ఎస్.డి.జి.) సాధనలో ముఖ్యమైన పాత్ర పోషిస్తోంది. పారిశ్రామిక వ్యర్థ జలాల విడుదలను నియంత్రించడం నీటి శుద్ధిని ప్రోత్సహించడం ద్వారా ఈ చట్టం ఎస్.డి.జి 6 (స్వచ్ఛమైన నీరు మరియు పారిశుధ్యం) సాధనకు తోడ్పడుతోంది. నీతి ఆయోగ్ విడుదల చేసిన ఎస్.డి.జి ఇండియా ఇండెక్స్ 2023-24 ప్రకారం, భారతదేశ ఎస్.డి.జి 6 స్కోరు 2018లో 63 ఉండగా, 2023-24 నాటికి 89కి పెరిగింది. అదే సమయంలో, గ్రామీణ కుటుంబాలలో 99.29 శాతం మందికి మెరుగైన తాగునీటి వనరులు అందుబాటులో ఉన్నాయి. కాలుష్య నియంత్రణ, వ్యర్థ పదార్థాల నిర్వహణ ద్వారా ఈ చట్టం ఎస్.డి.జి 11 (సుస్థిర నగరాలు మరియు సమాజాలు) సాధనకు దోహదపడుతోంది. 2024 నాటికి పురపాలక ఘన వ్యర్థాల శుద్ధి, ప్రాసెసింగ్ స్థాయి 78.46 శాతానికి చేరుకుంది. ప్రమాదకర వ్యర్థాల నిర్వహణ, పునర్వినియోగం, రీసైక్లింగ్ను ప్రోత్సహించడం ద్వారా ఎస్.డి.జి 12 (బాధ్యతాయుతమైన వినియోగం మరియు ఉత్పత్తి) లక్ష్య సాధనకు తోడ్పడుతోంది. 2022-23లో ప్రమాదకర వ్యర్థాల రీసైక్లింగ్ స్థాయి 54.99 శాతానికి చేరుకుంది. స్వచ్ఛమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించడం, కాలుష్యాన్ని తగ్గించడం ద్వారా ఎస్.డి.జి 13 (వాతావరణ మార్పులపై చర్యలు) సాధనకు సహకరిస్తోంది. 2023-24లో ఈ లక్ష్యానికి సంబంధించి భారతదేశ స్కోరు 67గా నమోదైంది. అదేవిధంగా, జీవవైవిధ్యం, అడవులు, పర్యావరణ వ్యవస్థల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ఎస్.డి.జి 15 (భూమిపై జీవరాశుల పరిరక్షణ) సాధనకు దోహదపడుతోంది. 2023-24లో ఈ లక్ష్యానికి సంబంధించి భారతదేశ స్కోరు 75గా నమోదైంది. ఈ విధంగా, పర్యావరణ (రక్షణ) చట్టం, 1986 స్వచ్ఛమైన గాలి, సురక్షితమైన నీరు, ఆరోగ్యకరమైన జీవన వాతావరణం, సహజ వనరుల పరిరక్షణకు చట్టపరమైన పునాదిని అందిస్తూ భారత పౌరుల పర్యావరణ హక్కులను కాపాడటంలోనూ, భవిష్యత్ తరాలకు సుస్థిరమైన పర్యావరణాన్ని అందించడంలోనూ కీలక పాత్ర పోషిస్తోంది.

ప్రమాణాలను కఠినంగా అమలు చేయడం, క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించడం, కేంద్ర, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండళ్ల ద్వారా పరిశ్రమల కార్యకలాపాలను నిరంతరం పర్యవేక్షించడం అవసరం. ఈ మండళ్లకు తగిన ఆర్థిక వనరులు, ఆధునిక ప్రయోగశాలలు, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, శిక్షణ పొందిన సిబ్బందిని ప్రభుత్వం సమకూర్చాలి. పరిశ్రమలు పర్యావరణ హిత సాంకేతిక పరిజ్ఞానం, పునరుత్పాదక ఇంధనం, వ్యర్థ పదార్థాల పునర్వినియోగం, సుస్థిర ఉత్పత్తి విధానాలను అవలంబించాలి. పర్యావరణ నిబంధనలను ఉల్లంఘించే పరిశ్రమలపై కఠినమైన జరిమానాలు, పర్యావరణ నష్టపరిహారం విధించడంతో పాటు, పదేపదే కాలుష్యానికి కారణమయ్యే పరిశ్రమలను మూసివేయడం ద్వారా చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలి. పర్యావరణ అవగాహన కార్యక్రమాలు, పౌరుల ఫిర్యాదులు, ప్రజాభిప్రాయ సేకరణ సమావేశాల ద్వారా ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలి. పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేసే ముందు పర్యావరణ ప్రభావ అంచనా ప్రక్రియను శాస్త్రీయంగా, పారదర్శకంగా నిర్వహించి, అన్ని నిబంధనల అమలును నిర్ధారించాలి. నీటి మరియు వాయు కాలుష్యాన్ని నియంత్రించడానికి ఈ చట్టం ఒక సమగ్ర ప్రాథమిక చట్టంగా పనిచేస్తూ, నీటి (కాలుష్య నివారణ మరియు నియంత్రణ) చట్టం, 1974, వాయు (కాలుష్య నివారణ మరియు నియంత్రణ) చట్టం, 1981తో సమన్వయంతో అమలు కావాలి. అడవులు, వన్యప్రాణులు, జీవవైవిధ్య పరిరక్షణ కోసం వన్యప్రాణుల (రక్షణ) చట్టం, 1972, అటవీ (సంరక్షణ) చట్టం, 1980, జీవవైవిధ్య చట్టం, 2002తో కలిసి పనిచేయాలి. ప్రమాదకర పారిశ్రామిక ప్రమాదాల్లో బాధితులకు తక్షణ సహాయం, పరిహారం అందించడానికి ప్రజా బాధ్యత బీమా చట్టం, 1991తో సమన్వయం అవసరం. అదేవిధంగా, పర్యావరణ సంబంధిత కేసులపై త్వరితగతిన న్యాయం అందించడానికి, పర్యావరణ నష్టానికి పరిహారం కల్పించడానికి జాతీయ హరిత ట్రిబ్యునల్ చట్టం, 2010 సమర్థవంతంగా పనిచేయాలి. చివరగా, సమగ్ర చట్ట అమలు, శాస్త్రీయ పర్యవేక్షణ, పర్యావరణ విద్య, ప్రజలు, పరిశ్రమలు, ప్రభుత్వ అధికారుల మధ్య పరస్పర సహకారం భారతదేశంలో దీర్ఘకాలిక పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధికి అత్యంత అవసరం.

- డా.పి.కిరణ్ శ్రీ
8125695799

మాటలు మారితేనే సమాజంలో మార్పు

సమాజ అభివృద్ధి అనేది కేవలం రహదారులు వేయడం, భవనాలు నిర్మించడం, సంక్షేమ పథకాలు అమలు చేయడం, నిధులు కేటాయించడం వంటి పనులతోనే పూర్తికాదు. ప్రజల మధ్య పరస్పర విశ్వాసం, సామాజిక బాధ్యత, నైతిక విలువలు, ప్రశాంతమైన వాతావరణం కూడా అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయి. ఒక గ్రామం బాగుండాలన్నా, మండలం అభివృద్ధి చెందాలన్నా, పట్టణం ప్రగతి సాధించాలన్నా, రాష్ట్రం ముందుకు సాగాలన్నా, దేశం ప్రపంచంలో గౌరవప్రదమైన స్థానాన్ని సంపాదించాలన్నా రాజకీయ నాయకుల మాటలు, ఆలోచనలు, ప్రవర్తన, కార్యాచరణలో బాధ్యతాయుతమైన మార్పు రావాలి. ముఖ్యంగా ఆరోపణలు, ప్రత్యారోపణల రాజకీయ సంస్కృతికి స్వస్తి పలకాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికీ ఉంది. ప్రజాప్రతినిధుల పనితీరును విమర్శించడం, ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించడం, అవినీతి లేదా అక్రమాలు జరిగితే వాటిని ప్రజల దృష్టికి తీసుకురావడం ప్రజాస్వామ్య వ్యవస్థలో భాగమే. అయితే విమర్శకు, నిరాధారమైన ఆరోపణకు మధ్య స్పష్టమైన తేడా ఉంటుంది. ఆధారాలతో ప్రశ్నించడం ప్రజాస్వామ్య బాధ్యత అయితే, ఆధారాలు లేకుండా వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా ఆరోపణలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. నేటి రాజకీయ వాతావరణంలో ఒక నాయకుడు మరొక నాయకుడిపై ఆరోపణ చేయడం, దానికి ప్రతిగా ఇంకొకరు ప్రత్యారోపణలు చేయడం, ఆ తర్వాత అదే అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం పదేపదే ప్రస్తావించడం సాధారణంగా మారుతోంది. ఆరోపణ చేసిన తర్వాత దానిని నిరూపించడానికి అవసరమైన ఆధారాలు సేకరించడం, సంబంధిత వ్యవస్థలకు ఫిర్యాదు చేయడం, విచారణ జరిగేలా చూడడం వంటి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉంటుంది. కానీ కొన్ని సందర్భాల్లో ఆరోపణలతోనే రాజకీయ ప్రచారం ముగుస్తోంది. ఫలితంగా ప్రజలకు వాస్తవాలు తెలియకుండానే అనుమానాలు, అపోహలు, అపనమ్మకాలు వ్యాప్తి చెందుతున్నాయి. ఒక ఆరోపణ చేయడానికి కొన్ని క్షణాలు సరిపోవచ్చు. కానీ ఆ ఆరోపణ వల్ల ఒక వ్యక్తి ప్రతిష్ఠకు, ఒక కుటుంబ గౌరవానికి, ఒక సంస్థ విశ్వసనీయతకు కలిగిన నష్టాన్ని సరిచేయడానికి సంవత్సరాలు పట్టవచ్చు. అందుకే ఆరోపణ చేసే ముందు దాని నిజానిజాలను పరిశీలించడం, ఆరోపణ చేసిన తర్వాత దానికి సంబంధించిన ఆధారాలను ప్రజల ముందు ఉంచడం నాయకుల నైతిక బాధ్యతగా గుర్తించాలి. రాజకీయ నాయకులు కేవలం ఎన్నికల్లో పోటీ చేసే వ్యక్తులు మాత్రమే కాదు. వారి మాటలను లక్షలాది మంది ప్రజలు వింటారు, వారి ప్రవర్తనను గమనిస్తారు, కొన్నిసార్లు వారినే ఆదర్శంగా తీసుకుంటారు. అందువల్ల నాయకుల మాటలకు సాధారణ వ్యక్తుల మాటల కంటే ఎక్కువ ప్రభావం ఉంటుంది. నాయకులు పరస్పరం గౌరవించుకుంటూ, విధానపరమైన అంశాలపై చర్చిస్తూ, ప్రజా సమస్యలకు పరిష్కారాలు సూచిస్తే సమాజంలోనూ ఆరోగ్యకరమైన చర్చా సంస్కృతి పెరుగుతుంది. కానీ వ్యక్తిగత దూషణలు, కక్ష సాధింపు వ్యాఖ్యలు, నిరాధార ఆరోపణలు ప్రధానంగా మారితే అదే ధోరణి క్రమంగా ప్రజల్లోకి కూడా చేరుతుంది. ఒక పార్టీకి చెందిన వ్యక్తి మరో పార్టీ నాయకుడిని శత్రువుగా చూడటం ప్రారంభిస్తే, ఆ రాజకీయ విభేదాలు కుటుంబాలు, స్నేహితులు, గ్రామాలు, కాలనీల మధ్య కూడా విభేదాలకు కారణమవుతాయి.కానీ ఆ వివాదం కారణంగా సమస్య పరిష్కారం ఆలస్యం కావడం మాత్రం ప్రజలకు అన్యాయం చేయడమే. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల కొరత, ఆసుపత్రుల్లో వైద్య సేవల లోపాలు, నిరుద్యోగ సమస్యలు వంటి అంశాలపై రాజకీయ పార్టీలు పరస్పరం నిందించుకోవడం కంటే, సమస్య పరిష్కారానికి ఉమ్మడి కార్యాచరణ రూపొందించడం సమాజానికి మేలు చేస్తుంది. ఆరోపణలకు ఆధారాలు లేనప్పుడు ప్రజల్లో గందరగోళం పెరుగుతుంది. ఒక వర్గం ఒక నాయకుడి మాటలను నమ్ముతుంది. మరో వర్గం ప్రత్యర్థి నాయకుడి మాటలను నమ్ముతుంది. వాస్తవాలను తెలుసుకునే ప్రయత్నం చేయకుండా, తమకు నచ్చిన వ్యక్తి చెప్పిందే నిజమని భావించే ధోరణి పెరుగుతుంది. సామాజిక మాధ్యమాల ద్వారా నిర్ధారణ కాని సమాచారాన్ని వేగంగా పంచుకోవడం ఈ సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది. ఒకసారి తప్పుడు సమాచారం ప్రజల్లోకి వెళ్లిన తర్వాత, వాస్తవాలు బయటపడినా అందరూ వాటిని అంగీకరించకపోవచ్చు. ఎందుకంటే ప్రజలు కొన్నిసార్లు వాస్తవాల కంటే తమ రాజకీయ అభిప్రాయాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. ఈ పరిస్థితి సమాజంలో నమ్మకాన్ని బలహీనపరుస్తుంది. అయితే ఆరోపణ చేసిన ప్రతి వ్యక్తినీ తప్పుబట్టడం కూడా సరైన విధానం కాదు. నిజమైన అవినీతి, అధికార దుర్వినియోగం, ప్రజాధన దుర్వినియోగం వంటి అంశాలను వెలుగులోకి తీసుకురావడం అవసరం. అందుకు స్వతంత్ర విచారణ, పారదర్శకమైన ప్రక్రియ, చట్టబద్ధమైన చర్యలు ముఖ్యం. ఆరోపణ చేసిన వ్యక్తి రాజకీయ ప్రత్యర్థి అయినంత మాత్రాన ఆ ఆరోపణ అసత్యమని చెప్పలేం. అదే విధంగా ఆరోపణలు వినిపించాయనే కారణంతో ఎవరినీ దోషిగా నిర్ధారించలేం. ఆరోపణ, ఆధారం, విచారణ, నిర్ధారణ.. ఈ నాలుగు అంశాల మధ్య తేడాను సమాజం అర్థం చేసుకోవాలి. రాజకీయ నాయకులు గెలవడం మాత్రమే ప్రజాస్వామ్య విజయానికి కొలమానం కాదు. ప్రజలు ప్రశాంతంగా జీవించడం, వారి సమస్యలు పరిష్కారం కావడం, సమాజంలో న్యాయం నిలవడం, అభివృద్ధి అందరికీ చేరడం నిజమైన విజయానికి గుర్తులు. నాయకుల మాటలు సమాజంలో చైతన్యాన్ని నింపాలి కానీ చీలికలను సృష్టించకూడదు. వారి ఆలోచనలు అభివృద్ధికి మార్గం చూపాలి కానీ విద్వేషాలకు వేదిక కాకూడదు. వారి చర్యలు ప్రజలకు నమ్మకాన్ని కలిగించాలి కానీ అనుమానాలను పెంచకూడదు. ఎందుకంటే సమాజాన్ని నిర్మించడానికి సంవత్సరాలు పడతాయి. కానీ బాధ్యతారహితమైన మాటలతో సమాజంలో చీలికలు సృష్టించడానికి కొన్ని క్షణాలే సరిపోతాయి. ఆరోపణల కంటే ఆధారాలకు, ప్రత్యారోపణల కంటే పరిష్కారాలకు, రాజకీయ ప్రయోజనాల కంటే ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇచ్చినప్పుడే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది. రాజకీయాలు ప్రజలను విడదీయడానికి కాదు, ప్రజలను కలిపి అభివృద్ధి వైపు నడిపించడానికి ఉండాలి.

- వై. సంజీవ కుమార్
9393613555

రక్తపు మరకలు

నాలుగు మాటల్ని
కన్నీళ్లుగా కురిసి
చేతులు దులిపేసుకుందాం

మూడు ఎమోజీలు
ఆరు టెక్స్ట్‌లుగా
ఓదార్పులై చేతులు
కడిగేసుకుందాం


మళ్లీ మరో జింకపిల్ల
తరగతి గది అనే కీకారణ్యంలో
గాయపడి తప్పిపోతుంది
మరో మల్లెమొగ్గ
రంపపు కోతకు గురవుతుంది

ఇప్పుడు కావాల్సింది
మాటలుకాదు దొరా
తూటాలతో చీడ పురుగుల్ని
పేల్చేసే తెగువ కావాలి

తరగతి గదిలో
పుస్తకాలకు అంటిన
రక్తపు మరకలు
కడిగేయటం సులువే
రక్తం పారకుండా చూడాల్సిన
కంచెలు నిర్మించాలి
రక్తపింజరులు కుండేళ్లను
మింగేసే కుట్రలు ఛేదించే
యుద్ధం మొదలవ్వాలి!

- చిత్తలూరి
9133832246

అమూల్య భారత రత్నం అమర్త్య సేన్



భారత దేశం గర్వించదగిన శాస్త్ర వేత్తలలో ప్రముఖులు అమర్త్యసేన్. ఆయన భారతీయ తత్వ్త శాస్త్రవేత్త, ఆర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతి స్వీకరించిన తొలి భారతదేశపు ఆర్థిక శాస్త్రవేత్త. 1998లో కరువు, మానవ అభివృద్ధి సిద్ధాంతము, సంక్షేమ ఆర్థిక శాస్త్రము, పేదరికమునకు కారణములు, పొలిటికల్ లిబరలిజం లలో చేసిన విశేష కృషికి 1999 లో నోబెల్ బహుమతి లభించింది.

1933 నవంబర్ 3న బెంగాల్లోని శాంతినికేతన్‌లో జన్మించిన అమర్త్య సేన్ 1941లో ఉన్నత పాఠశాల విద్య ఢాకాలో పూర్తి చేసుకొన్నారు. 1947లో దేశ విభజన తర్వాత భారత దేశానికి తిరిగివచ్చి విశ్వభారతి, ప్రెసిడెన్సీ కళాశాలలలో అభ్యసించారు. కేంబ్రిడ్జిలోని ట్రినిటి కళాశాలలో 1956 గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్నారు. 1959లో పి.హెచ్.డి పట్టా పుచ్చుకున్నారు. సేన్ మాతామహుడు క్షితిమోహన్ సేన్ మధ్య యుగ చరిత్రలో పండితుడు. ఆయన రవీంద్రనాథ్ టాగూర్ కు సన్నిహితుడు. సేన్ తల్లి అమితా సేన్, తండ్రి అశుతోష్ సేన్. తండ్రి ఢాకా విశ్వ విద్యాలయంలో రసాయన శాస్త్రము బోధించేవారు.

1971 లో ఆయన లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో ఎకనామిక్స్ ప్రొఫెసర్‌గా చేరారు. అక్కడ 1977 వరకు బోధించాడు. 1977 నుండి 1988 వరకు, ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయంలో బోధించారు. అక్కడ మొదట ఎకనామిక్స్ ప్రొఫెసర్, నఫిల్ కాలేజీ ఫెలో , తరువాత పొలిటికల్ ఎకానమీ ప్రొఫెసర్, ఫెలో ఆల్ సోల్స్ కళాశాల, ఆక్స్‌ఫర్డ్ 1980 నుండి 1987లో, సేన్ థామస్ డబ్ల్యూ. లామోంట్ యూనివర్శిటీ ఎకనామిక్స్ ప్రొఫెసర్‌గా హార్వర్డ్‌లో చేరారు.

సంక్షేమ ఆర్థిక శాస్త్రం, సామాజిక ఎంపిక సిద్ధాంతం , ఆర్థిక మరియు సామాజిక న్యాయం, కరువు యొక్క ఆర్థిక సిద్ధాంతాలు , నిర్ణయ సిద్ధాంతం, అభివృద్ధి ఆర్థిక శాస్త్రం, ప్రజారోగ్యం మరియు దేశాల శ్రేయస్సు యొక్క చర్యలకు సేన్ కృషి చేశారు. సంక్షేమం వైపు, పేదరికం, నిరుద్యోగం వైపు అమర్త్య సేన్ కృషి అమోఘమైనది. సంక్షేమ అర్థశాస్త్రం వైపు దృష్టి సారించి ప్రజలకు కనీస అవసరాలు ఎలాగో ప్రజాస్వామిక హక్కులు కూడా అంతే ముఖ్యమని ఉద్ఘాటించాడు. ప్రపంచంలోని అన్ని దేశాలు తమతమ రక్షణ బడ్జెట్ ను తగ్గించాలని హితవు పలికారు. పేదరిక స్థాయిని నిర్ధారించడానికి అమర్త్య సేన్ సోషల్ ఛాయిస్ అనే నూతన సూత్రీకరణను ప్రవేశపెట్టారు. పేదరికానికి, కరువుకు ప్రధాన కారణం ఆహార ధాన్యాల కొరత కాదని, ఉపాధి లేక పోవడంతో ప్రజల వద్ద కొనుగోలు శక్తి లేక పోవడమే ప్రధాన కారణమని తమ అధ్యయనాల ద్వారా నిరూపించారు. ప్రాథమిక విద్య, ఆరోగ్యం ఏ దేశ అభివృద్ధిలో నైనా కీలక పాత్ర వహిస్తాయని ఉద్ఘాటించారు. నీతిశాస్త్రం, తత్వశాస్త్రాల వెలుగులో అభివృద్ధి అర్థశాస్త్రానికి కొత్త రూపం చేర్చారు. 1943లో బెంగాల్ లో కరువు సంభవించి నప్పుడు అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం నియమించిన ఎంక్వైరీ కమిషన్... సకాలంలో వర్షాలు లేక పోవడం, బర్మా నుండి ధాన్యం దిగుబటి కాకపోవడం వంటి కారణాలను చూపించగా, అమర్త్యసేన్ దానికి పూర్తిగా విరుద్ధమైన కారణాలను అర్థశాస్త్ర పరంగా విశ్లేషించారు. కరువు అనేది ఆహారం లేకపోవడం వల్లనే కాదు, ఆహారాన్ని పంపిణీ చేసే యంత్రాంగాల్లో నిర్మించిన అసమానతల నుండి అని వాదించారు. ఆహార ధరలను పెంచిన పట్టణ ఆర్థిక వృద్ధి కారణంగా బెంగాల్ కరువు ఏర్పడిందని, తద్వారా వేతనాలు అందనపుడు లక్షలాది మంది గ్రామీణ కార్మికులు ఆకలితో చనిపోతారని సేన్ వాదించారు.

రక్షణ భద్రత అనేది సామాజిక భద్రత వలల వ్యవస్థ, ఇది పేదరికంతో బాధపడుతున్న సమూహాన్ని భయంకరమైన దు:ఖానికి గురిచేస్తుంది. అని నిర్దిష్ట స్వేచ్ఛలను సేన్ వివరించారు. పేదవారికి ఆర్థిక పరిస్థితులను మెరుగు పర్చడానికి ఉపయోగ కరమైన సమాచారాన్ని అందించే పేదరికాన్ని కొలిచే పద్ధతులను సేన్ రూపొందించారు.

ప్రేమ పునాదిగా పంచబడే న్యాయం ఒడంబడిక ద్వారా పంచబడే న్యాయం కంటే విలువైనదని, అశోకుడు బుద్ధిస్టు సూత్రాలపై ఏర్పరచిన రాజ్యంలో ప్రజాసంక్షేమం బలంగా అంతర్లీనమై ఉంటుందని, అక్బర్ సెక్యులర్ న్యాయ పునాదులు వేసిన చక్రవర్తి అని, సర్వమత సమానత్వ సూత్రీకరణను రూపొందించిన తాత్వికుడని, ఇటలీలో 1600 సంవత్సరంలో బ్రూనోను మత విశ్వాసాలను ధిక్కరిస్తూ హేతుబద్ధ ఆలోచనలను ప్రకటించి నందుకు సజీవంగా కాల్చి చంపుతున్న కాలంలోనే... అక్బరు అద్భుత లౌకిక జాతీయ వాదానికి పునాదులు వేసాడని, భగవద్గీత లోని కృష్ణుని యుద్ధ నీతి పాజిటివ్ న్యాయ సిద్ధాంతం కాగా. గాంధీ అహింసలోనే హింసావాదం దాగి ఉందని అమర్త్య సేన్ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. 1998లో అత్యున్నతమైన నోబెల్ బహుమతి స్వీకరించారు.

1999లో భారత ప్రభుత్వపు భారత రత్న అవార్డుకు ఎంపికైనారు. 2000లో లియోంటీప్ ప్రైజ్, 2000లో అమెరికా దేశపు ఐసెన్ హోవర్ మెడల్ పొందారు.

- రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

క్రీడా ప్రతిభకు పట్టాభిషేకం



- యువతే మన భవిష్యత్తు
- విద్యా, క్రీడా హబ్‌గా హుస్నాబాద్
- మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో అభివృద్ధి ఫలాలు

చిగురుమామిడి నవంబర్ 3 (మనం న్యూస్): యువతే దేశానికి భవిష్యత్తు అనే నినాదాన్ని ఆచరణలో చూపిస్తున్నారు రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న హుస్నాబాద్ నియోజకవర్గాన్ని విద్యా, క్రీడా, ఉపాధి కేంద్రంగా మార్చేందుకు వరుస కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

గత రెండేళ్లలోనే హుస్నాబాద్ రూపురేఖలు మారుతున్నాయని, ముఖ్యంగా యువతకు ఉజ్వల భవిష్యత్తును అందించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కబడ్డీ అకాడమీతో క్రీడా ప్రతిభకు పట్టాభిషేకం

గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు హుస్నాబాద్ లో నూతన కబడ్డీ అకాడమీ ఏర్పాటుకు ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ అకాడమీ ద్వారా 40 మంది యువ క్రీడాకారులకు వసతితో కూడిన శిక్షణ అందించనున్నారు. ఇందులో 20 మంది బాలురు, 20 మంది బాలికలకు సమాన అవకాశాలు కల్పించడం విశేషం. బాలికల క్రీడా ప్రోత్సాహానికి ఇది పెద్ద ముందడుగు. కోచ్ లు, వార్డెన్లు, గ్రౌండ్ సిబ్బంది నియామకానికి కూడా అనుమతి లభించింది.

విద్యా హబ్ గా హుస్నాబాద్

ఉమ్మాపూర్ లో శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల భవనాలు, రూ. 14.56 కోట్లతో బాలుర, బాలికల హాస్టళ్ల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు ల్యాప్ టాప్ లు, సైకిళ్లు అందజేయడంతో పాటు, కళాశాలకు రెండు కొత్త బస్సులు, మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త కోర్సులను తీసుకురానున్నారు.

అంతేకాకుండా నియోజకవర్గంలో నవోదయ పాఠశాల, తెలంగాణ పబ్లిక్ స్కూల్, తంగళ్లపల్లి మరియు కోహెడలో రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు, ఎల్కతుర్తిలో బాసర ట్రిపుల్ ఐటీ బ్రాంచి ఏర్పాటుకు చర్యలు వేగంగా జరుగుతున్నాయి.

ఉపాధికి పారిశ్రామిక కారిడార్

హుస్నాబాద్ లో పారిశ్రామిక కారిడార్, మినీ స్టేడియం ఆధునికీకరణ, అర్బన్ ఫారెస్ట్ పార్క్, ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనుల ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత, ర్యాంకులు సాధించడం విద్యార్థుల బాధ్యత. మీకు ఏ సమస్య వచ్చినా స్థానిక ఎమ్మెల్యేగా కాకుండా మీకు సంరక్షకుడిగా అండగా ఉంటానని యువతకు భరోసా ఇచ్చారు.

ఇది కేవలం అభివృద్ధి కాదు, యువత ఆత్మవిశ్వాసానికి పెట్టుబడి అని హుస్నాబాద్ యువత అభిప్రాయపడుతున్నారు.

రెండు మండలాలను కరువు మండలాలుగా గుర్తించాలి

- సీఎంకు మంత్రి పొన్నం విజ్ఞప్తి



చిగురుమామిడి నవంబర్ 3 (మనం న్యూస్): ఎల్ నినో ప్రభావంతో కరీంనగర్ జిల్లా పరిధిలోని హుస్నాబాద్ నియోజకవర్గంలో ఉన్న చిగురుమామిడి, సైదాపూర్ మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, కరువు పరిస్థితుల కారణంగా ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ నేపథ్యంలో చిగురుమామిడి, సైదాపూర్ మండలాలను కూడా కరువు మండలాలుగా గుర్తించాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి లేఖ రాశారు. ఎల్ నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో ఆయా మండలాల్లో వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం పడిందని, రానున్న రోజుల్లో తాగునీటి సమస్యలు సైతం ఎదురయ్యే పరిస్థితులు ఉన్నాయని మంత్రి తన లేఖలో పేర్కొన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో ఇప్పటికే రెండు మండలాలను మాత్రమే కరువు మండలాలుగా గుర్తించారని, మిగిలిన ఐదు మండలాల్లోనూ తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. చిగురుమామిడి, సైదాపూర్ మండలాల్లోని ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని ఈ రెండు మండలాలను కూడా కరువు మండలాలుగా ప్రకటించాలని కోరారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తమ మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని కోరుతూ ఆయా మండలాలు, గ్రామాల్లో ప్రజలు ఏకగ్రీవ తీర్మానాలు చేస్తున్నారని తెలిపారు. ప్రజలు, రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కరీంనగర్ జిల్లా పరిధిలోని చిగురుమామిడి, సైదాపూర్ మండలాలను కరువు మండలాలుగా గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.

శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో పాఠశాలల సందర్శన



- 200 స్టీల్ గ్లాసుల పంపిణీ

జగిత్యాల , నవంబర్ 03(మనం న్యూస్): శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం పాఠశాల సందర్శన దినోత్సవం సందర్భంగా ట్రస్ట్ బృందం టి.ఆర్. నగర్ లోని ప్రభుత్వ ఎంపీపీఎస్,జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులకు ఉదయం పూట అందించే పోషకాహార పానీయం రాగి జావ తాగడానికి అవసరం ఉండటంతో 200 స్టీల్ గ్లాసులను పాఠశాలలకు పంపిణీ చేశారు. ఈ గ్లాసులను అందించిన దాత సీతారామరాజుకి ట్రస్ట్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓడబ్ల్యూఓఎఫ్ ట్రస్ట్ యొక్క మూడు ప్రధాన విభాగాలైన పోషణ, విద్య ఆరోగ్యం గురించి విద్యార్థులకు, సిబ్బందికి వివరించారు. అలాగే సద్గురు మధుసూదన్ సాయి గ్లోబల్ హ్యూమానిటేరియన్ మిషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను తెలియజేశారు. రాజారాం, టి.ఆర్. నగర్ రోడ్‌లో ఉన్న ఉచిత ఆసుపత్రి సేవలను గ్రామ ప్రజలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంతీయ అధిపతి వూటూరి శ్రీకాంత్, రెండు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది, ప్రజలు జె. రవీందర్ పాల్గొన్నారు.

ఐదు రకాల పంటల సాగుతో ఆదర్శంగా రైతు



- రైతు తూము గంగాధర్ను అభినందించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్

సిరిసిల్ల, నవంబర్ 03 (మనం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లాలో నీటిని సద్వినియోగం చేసుకుంటూ ఐదు రకాల పంటలు సాగు చేస్తున్న రైతు తూము గంగాధర్ ఆదర్శంగా నిలుస్తున్నారని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అభినందించారు. మంగళవారం రుద్రంగి మండలం మానాల గ్రామంలో రైతు సాగు చేస్తున్న పంటలను ఆమె పరిశీలించారు. ఎకరం 20 గుంటల విస్తీర్ణంలో పసుపు, వెల్లుల్లి, ఉల్లిగడ్డ, మిర్చి, కొత్తిమీర పంటలను సాగు చేస్తున్న విధానాన్ని తెలుసుకున్నారు. పంటల దిగుబడి, మార్కెటింగ్, ఆదాయ వివరాలను అడిగి తెలుసు కున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్ బాబుపై చౌకబారు ప్రకటనలు చేస్తే తస్మాత్ జాగ్రత్త

- ఖబర్దార్ ఎంపీ గడ్డం వంశీ
- పెద్దపెల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సెగ్గెం రాజేష్



మంథని, నవంబర్ 3 (మనంన్యూస్): తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి యే ధ్యేయంగా పనిచేస్తున్న మంత్రి శ్రీధర్ బాబు పైన పెద్దపల్లి ఎంపీ వంశీ అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోమని పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సెగ్గెం రాజేష్,పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జనగామ నర్సింగరావులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మంగళవారం మంథని ప్రెస్ క్లబ్ లో కాంగ్రెస్ నాయకులు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి సెగ్గెం రాజేష్,ప్రధాన కార్యదర్శి జనగామ నర్సింగరావులు మాట్లాడుతూ రాష్ట్రనియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో సస్యశ్యామలంగా ఉండాలని సదుద్దేశంతో సొంత ఖర్చులతో మంత్రి శ్రీధర్ బాబు మైసూర్ పీఠాధిపతి శ్రీ సచ్చిదానంద స్వామీజీని తీసుకు వస్తే మంత్రి శ్రీధర్ బాబు పైన ఒర్వలేక ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు.ఆధ్యాత్మికంగా అందరూ సోదర భావంతో మెలగాలని ఉద్దేశంతోనే స్వామీజీని తీసుకురావడం జరిగిందని,ప్రజల సొమ్ముతో ఖర్చు పెట్టలేదని,మంత్రి శ్రీధర్ బాబు సొంత ఖర్చుతో సమావేశం ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని తలపెట్టిన దీక్షకు హాజరు కాకపోతే వ్యంగంగా విమర్శించడం మానుకోవాలని హితవు పలికారు.రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేసే తపనతో మంత్రి శ్రీధర్ బాబు పని చేస్తున్నారని గుర్తు చేశారు.కర్ణాటక,తెలంగాణ, చుట్టుపక్క రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి మంత్రి శ్రీధర్ బాబు కృషి చేశారని తెలిపారు.పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ నిలకడ లేకుండా పార్టీలు మారే మీ కుటుంబం,మంత్రి శ్రీధర్ బాబు పైన విమర్శ వ్యాఖ్యలు చేయడం కరెక్ట్ కాదని ప్రశ్నించారు.

పెద్దపల్లి నియోజకవర్గం నుండి ఎంపీగా వంశీకృష్ణ గెలవడానికి మంథని నుండి భారీ మెజార్టీతో గెలిపించామని,ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కష్టపడ్డారని గుర్తుపెట్టుకోవాలని అన్నారు.మంథని ప్రాంతం ఇంత భారీ మెజార్టీ ఇస్తే,ఈ ప్రాంతానికి ఏమిచ్చారని ప్రశ్నించారు? విద్యార్థులకు రెండు మూడు బ్యాగులు ఇవ్వడం కాదని, యువతకు కంపెనీలు తేవాలనిసూచించారు.రెండు మూడు బ్యాగులను పంచితే కాంగ్రెస్ వారిని వెంట పెట్టుకోవాలి తప్ప, బీఆర్ఎస్ నాయకులను వెంటపెట్టుకొని తిరగడం మానుకోవాలని అన్నారు.మంథని ప్రాంతానికి పర్యటిస్తే ఎవరికి సమాచారం ఇచ్చారని ప్రశ్నించారు.మంథని మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, మండల పార్టీ నాయకులకు ఏ ఒక్కరికి తెలియకుండా సందర్శించడం తగదని వివరించారు.ఇప్పటికైనా అనుచిత వాక్యాలు మానుకొని మెలగాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెరవేని లింగయ్యయాదవ్,వేల్పుల రాజు,ఐలి శ్రీనివాస్,ఎల్లంకివంశీ, బెల్లంకొండ సత్యనారాయణరెడ్డి, మంథనిరాకేష్, ఇందారపు అనిల్, అక్కపాకసంపత్, దొరగొర్ల శ్రీనివాస్ యాదవ్, పెట్టెంరామస్వామి, తిరుమల్, పంచికదేవేందర్, తదితరులుపాల్గొన్నారు

అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ (సివిల్స్) పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి

- జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్



జగిత్యాల, నవంబర్ 3(మనం ప్రతినిధి): టిజిపిఎస్సి ఆధ్వర్యంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ (సివిల్స్) పరీక్షను నవంబర్ 6, 7 తేదీల్లో జేఎన్టీయూహెచ్ లో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ తెలిపారు. ఈ పరీక్ష కంప్యూటర్ ఆధారిత విధానంలో (ఇఆఖీ) ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు మధ్యాహ్నం 2:30 గంటల నుండి 5:00 గంటల వరకు రెండు షిఫ్టులలో నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. జగిత్యాల జిల్లాలోని జేఎన్టీయూహెచ్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, నాచుపల్లి, కొండగట్టు, కొడిమ్యాల మండలంలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. పరీక్ష కేంద్రం వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతోపాటు, సైబర్ పోలీసుల ద్వారా సామాజిక మాధ్యమాల్లో తప్పుడు లేదా తప్పుదోవ పట్టించే సమాచార వ్యాప్తిని పర్యవేక్షించాలని సూచించారు. పరీక్ష సమయంలో నిరంతర విద్యుత్ సరఫరాతోపాటు అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ విద్యుత్ ఏర్పాట్లను సిద్ధంగా ఉంచాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రంలో ప్రథమ చికిత్స, అత్యవసర వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని వైద్యారోగ్య శాఖకు సూచించారు. పరీక్ష కేంద్రం పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్ష సమయంలో అంతరాయం లేని ఇంటర్నెట్ సదుపాయం కల్పించడంతోపాటు సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సంబంధిత శాఖల అధికారులు పరీక్ష ఏర్పాట్లను వ్యక్తిగతంగా పరిశీలించి, ఏవైనా లోపాలు ఉంటే పరీక్ష ప్రారంభానికి ముందే సరిచేయాలని ఆదేశించారు. అభ్యర్థులు తమ హాల్‌టికెట్లో పేర్కొన్న సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ, నిర్ణీత సమయానికి గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. పరీక్ష నిర్వహణకు అభ్యర్థులు, సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు.

అంగన్వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

పిల్లలకు పోషకాహారం అందించాలి

ప్రతిరోజూ కేంద్రాలకు పంపించాలి

తల్లిదండ్రులకు సూచించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



సిరిసిల్ల, నవంబర్ 03 (మనం ప్రతినిధి): చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు అంగన్వాడీ కేంద్రాలు అందిస్తున్న సేవలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. పిల్లలకు పౌష్టికాహారం అందిస్తూ, ఆరేళ్లలోపు చిన్నారులను ప్రతిరోజూ అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని పిలుపునిచ్చారు. మంగళవారం రుద్రంగి మండలం మానాల గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన 'మంగళవారం 10 నిమిషాల కార్యక్రమం'లో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల ఎత్తు, బరువు, పోషకాహార స్థితిని పరిశీలించి, కేంద్రంలోని తాగునీటి సౌకర్యం, ఫ్యాన్లు, లైట్ల పనితీరును తనిఖీ చేశారు. చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పిల్లల మొదటి వెయ్యి రోజుల ఎదుగుదల అత్యంత కీలకమని, ఈ దశలో సరైన పోషకాహారం అందిస్తే ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు పునాది పడుతుందని తెలిపారు. బాలామృతంతో పిల్లలకు ఇష్టమైన కేకులు, లడ్డూలు, బిస్కెట్లు వంటి పోషకాహార పదార్థాలు తయారుచేసి అందించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, మహిళలు కూడా పోషకాహారం తీసుకుంటూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, రక్తహీనత నివారణకు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని పేర్కొన్నారు. ఎదుగుదల లోపాలు, వినికిడి, మాట, ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్న చిన్నారులను గుర్తించి వేములవాడ డీఈఐసీ, కరీంనగర్ ఎన్ఆర్సీ కేంద్రాల ద్వారా అవసరమైన వైద్య సేవలు అందించాలని అధికారులకు సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల వివరాలను ఆన్లైన్లో నమోదు చేయడంతో పాటు ఆరోగ్య కార్డుల్లోనూ నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, జిల్లా ప్రణాళిక శాఖ అధికారి సంపత్ కుమార్, తహసీల్దార్ పుష్పలత, సర్పంచ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్ బాబుపై బీఆర్ఎస్ విమర్శలు సరికావు

- కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షుడు మంథని సత్యం



మంథని,నవంబర్03(మనం న్యూస్): మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,పీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీను బాబు నాయకత్వంపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న విమర్శలను స్థానిక దళిత,కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. మంథని ప్రెస్ క్లబ్ లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షుడు మంథని సత్యం మాట్లాడుతూ దళితులకు,పేదలకు దుద్దిళ్ల కుటుంబం ఎప్పుడూ అండగా నిలుస్తోందని అన్నారు.అభివృద్ధి, సంక్షేమకార్యక్రమాలపై అవగాహన లేకుండా విమర్శలు చేయడం సరికాదని హితవుపలికారు. మంథనిలో శ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాలకు రాజకీయ రంగు పులమడం తగదని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలను విమర్శించడం భక్తుల మనోభావాలను దెబ్బతీస్తుం దన్నార. జేఎన్టీయూహెచ్లో ఉద్యోగాలు కోల్పోయిన దళితులకు తిరిగి ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో మంత్రి శ్రీధర్ బాబు చొరవ చూపారని, మంథని మధుకర్ కుటుంబానికి అండగా నిలిచి ఇద్దరికి ఉద్యోగాలు కల్పించారని గుర్తు చేశారు.నిరుద్యోగులకు ఉచిత కోచింగ్, పేదలకు వైద్య సహాయం,ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సంక్షేమ కార్యక్రమాలు కొనసాగు తున్నాయని తెలిపారు.రాజకీయ విమర్శలు ప్రజాస్వామ్యంలో సహజమేనని, అయితే వ్యక్తిగత విమర్శలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలపై అనవసర వ్యాఖ్యలు చేయవద్దని సూచించారు. అభివృద్ధి, ప్రజా సమస్యలపై చర్చకు తాము సిద్ధమని స్పష్టం చేశారు.అతి త్వరలో మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో మంథనినియోజకవర్గంలోని దళితులకు పెద్ద నామినేటెడ్ పోస్ట్ రాబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ విలేకరుల సమావేశంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మంథని రాజేష్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జనగామనర్సింగరావు, ఐలిశ్రీనివాస్, దొరగొర శ్రీనివాస్, అక్కపాక సంపత్ కుమార్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు ముప్పుగా హిందూ-యూదు కూటమి

- టెహ్రాన్ మీటింగ్‌లో అసిమ్ మునీర్ వ్యాఖ్యలు
- మునీర్ వ్యాఖ్యలు చేసినట్లు చెప్పిన ఇరాన్ అధికారి

లాహోర్, నవంబర్ 3: పాకిస్తాన్‌కు కొత్త భయాలు మొదలయ్యాయి. భారత్-ఇజ్రాయిల్ సంబంధాలపై పాకిస్తాన్ ఆర్మీ చీఫ్, ఫీల్ మార్షల్ అసిమ్ మునీర్ ఆందోళన వ్యక్తం చేసినట్లు ఇరాన్ భద్రతా అధికారి మొహ్సేన్ రెజాయి వెల్లడించారు. హిందువులు, యూదుల మధ్య పెరుగుతున్న సంబంధాలు ముస్లింలకు, పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా మారుతున్నాయని మునీర్ హెచ్చరించినట్లు ఆయన అన్నారు. అక్టోబర్ 26న ఇరాన్ రాజధాని టెహ్రాన్ వేదికగా జరిగిన నాలుగు దేశాల భద్రతా సమావేశంలో మునీర్ ఈ వ్యాఖ్యలు చేశారని రెజాయి వెల్లడించినట్లు పాకిస్తాన్ మీడియా వెల్లడించింది.

టెహ్రాన్ వేదికగా 4 ముస్లిం దేశాల సమావేశం

ఇజ్రాయిల్, అమెరికాతో ప్రాంతీయ ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో అక్టోబర్ 26న టెహ్రాన్లో ఇరాన్, పాకిస్తాన్, సౌదీ అరేబియా, టర్కీ ప్రతినిధులు సమావేశమయ్యారు. పాకిస్తాన్ తరుపున అసిమ్ మునీర్, టర్కీ తరపున ఇంటెలిజెన్స్ చీఫ్ ఇబ్రహీం కలిన్ హాజరయ్యారు. సౌదీ అరేబియా తరపున రక్షణ మంత్రి ప్రిన్స్ ఖలీద్ బిన్ సల్మాన్, ఇరాన్ తరపున భద్రతా అధికారి మొహ్సేన్ రెజాయి పాల్గొన్నారు.

అక్టోబర్ 31న రెజాయి ఈ సమావేశం గురించి మాట్లాడారు. పాకిస్తాన్, టర్కీ, సౌదీలు ఇజ్రాయిల్ నుంచి ఎదురవుతున్న ముప్పుపై ఆందోళన వ్యక్తం చేశాయి. ''ముస్లింలకు, పాకిస్తాన్కు వ్యతిరేకంగా హిందువులు-యూదుల మధ్య ఏర్పడుతున్న సంబంధాల గురించి అసిమ్ మునీర్ మాట్లాడారు'' అని రెజాయి చెప్పారు. పాకిస్థానీ జర్నలిస్ట్ నజామ్ సేథీ కూడా రెజాయి వెల్లడించిన విషయాలపై తన యూట్యూబ్ కార్యక్రమంలో చర్చించారు.

భూములు రీ సర్వేలో భూముల వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలి

- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్



సిరిసిల్ల, నవంబర్ 03 (మనం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల వేములవాడ లో భూముల రీ సర్వేలో భాగంగా ప్రభుత్వ, పట్టా భూముల సరిహద్దులు, విస్తీర్ణం, సర్వే నంబర్ల వివరాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి ఖచ్చితంగా నమోదు చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం చందుర్తి మండలం ఎన్నల్ గ్రామంలో కొనసాగుతున్న రీ సర్వే ప్రక్రియను ఆయన పరిశీలించారు. సర్వేలో పారదర్శకత పాటించాలని, రైతులకు ప్రక్రియపై అవగాహన కల్పించి వారి సహకారంతో పనులు సజావుగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీ సర్వే శ్రీనివాస్, తహసీల్దార్ భూపతి, సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కోంటు అప్రమత్తంగా ఉండాలి

- మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్



మంథని, నవంబర్ 3(మనం న్యూస్): ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయని,రైతులు అప్రమత్తంగా ఉండాలని మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు.మంథని మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో మండల పరిషత్ ప్రత్యేక అధికారి పూర్ణ చందర్ అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించగా, ఎంపీడీవో శ్రీజారెడ్డి,ఏఎంసీ చైర్మన్ కుడుదుల వెంకన్న,సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్,టీజీఈఆర్సీ సలహాదారు శశిభూషణ్ కాచే, తదితర అధికారులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులు,ప్రజా సమస్యలు, ఎల్నినో ప్రభావం తదితర అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ ఎల్నినో పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని,రైతులకు అవసరమైన సూచనలు, వ్యవసాయ సలహాలు అందించాలని కోరారు.వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ రైతులకు తగిన సూచనలు అందించాల్సిన అవసరం ఉందన్నారు.అలాగే పశువులకు తాగు నీటి సమస్య రాకుండా చెరువులు,కుంటల్లో నీరు ఉండేలా చూడాలని సర్పంచులకు సూచించారు. ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అనేక గ్రామాల్లో గ్రామ పంచాయతీలు,అంగన్వాడీ కేంద్రాలకు శాశ్వత భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాబోయే పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని సుమారు రూ.500 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రహదారులు, తాగునీరు, పారిశుధ్యం, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ యాత్ర చేస్తున్న బిఆర్ఎస్ శ్రేణులకు ఘన స్వాగతం

గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి



గజ్వేల్, నవంబర్ 3(మనంన్యూస్): తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని గోదావరిఖనికి చెందిన బిజెపి నాయకులు సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సైకిల్ యాత్ర నిర్వహిస్తున్న వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు రేవంత్ రెడ్డి పీడ వదలాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో ఎడారిగా మారిన తెలంగాణ రాష్ట్రం మళ్ళీ కేసీఆర్ పాలనలో పచ్చని పంటలుగా మారాలని, రైతులు బాగుండాలని, తెలంగాణ రాష్ట్ర ప్రజలు బాగుండాలని గోదావరిఖని కి చెందిన బొడ్డు రవీందర్ మాజీ కార్పొరేటర్ ఆధ్వర్యంలో 15 మంది ఉప్పు రాజ్ కుమార్, లక్ష్మణ్ గౌడ్, కాసుపాక వాసు,సర్వేష్, అనిల్, కుమార్, నవీన్, శ్రీను, రాకేష్ లు మేడిగడ్డ నుండి మహా సైకిల్ యాత్ర చేస్తూ దాదాపు 380 కిలోమీటర్లు మహా సైకిల్ యాత్ర నిర్వహించడం జరిగిందన్నారు. మంగళవారం నాడు గజ్వేల్ కు చేరుకోవడం జరిగింది, గజ్వేల్ కు చేరుకున్న సందర్భంగా గజ్వేల్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బొడ్డు రవీందర్ మహా సైకిల్ యాత్ర చేస్తున్న బృందానికి వంటేరు ప్రతాప్ రెడ్డి స్వాగతం పలకడం జరిగింది. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో తెలంగాణ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు విసుగు చెందారని, తెలంగాణ రాష్ట్రం కరువు రాష్ట్రంగా మారిందని, కరెంటు లేక, సాగునీరు లేక పంటలు పండకుండా ఎడారిని తలపిస్తుందని, రైతులు పంటల కోసం పెట్టిన పెట్టుబడులు రాక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణ రాష్ట్రం ఆర్థికంగా దివాలా చేసిందని, వ్యాపారస్తులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, మహిళలు, విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఏ పల్లె కు వెళ్లిన, ఏ వీధికి వెళ్ళిన, ఏ వ్యక్తిని కదిలించిన కెసిఆర్ ను గుర్తు చేసుకుంటున్నారని, కెసిఆర్ అందించిన అభివృద్ధి సంక్షేమ ఫలాలను గుర్తు చేసుకుంటున్నారని అన్నారు, కెసిఆర్ 10 సంవత్సరాల కాలంలో కాళేశ్వరం మల్లన్న సాగర్ కొండపోచమ్మ సాగర్ రంగనాయక సాగర్ లాంటి అనేక ప్రాజెక్టుల మరియు కాలువల నిర్మాణం చేసి మండుటెండల్లో సైతం రైతుల పంట పొలాలకు సాగునీ అందించారన్నారు, 24 గంటల కరెంటు, రైతుబంధు రైతు బీమా కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లాంటి ఎన్నో రకాల అభివృద్ధి సంక్షేమాలను నేరుగా గడపగడప కందించి తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి సంక్షేమంలో భారత దేశంలోనే నెంబర్ వన్ గా నిల్పారని అన్నారు. కెసిఆర్ మళ్ళీ ముఖ్యమంత్రి కావాలని యావత్ తెలంగాణ రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారన్నారు. మూడు సంవత్సరాల కాలంలో రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టారని మండిపడ్డారు. కాంగ్రెస్ రేవంత్ రెడ్డి పాలనలో ముఖ్యమంత్రి నుండి మొదలుకొని ఎమ్మెల్యేలు మంత్రులు నాయకుల వరకు దోచుకోవడం దాచుకోవడం కబ్జాలు చేయడం ఒకరిపై ఒకరు విమర్శించుకోవడం చేస్తున్నారే తప్ప తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను ఎక్కడ కూడా అమలు చేయడం లేదని మండిపడ్డారు. ఈ మహా సైకిల్ యాత్ర బుధవారం 12 గంటలకు కేసీఆర్ గారి నివాసానికి చేరుకొని 400 కిలోమీటర్ల ప్రయాణంలో ప్రజలు విద్యార్థులు యువకులు, వ్యాపారస్తులు రైతులు ఎదుర్కొన్న అనుభవాలను కేసీఆర్ గారితో పంచుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ చైర్పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్ పర్సన్ పద్మాబాయి నర్సింగ్ రావు పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, కౌన్సిలర్లు బొగ్గుల స్వప్న సురేష్ మన్నె రూపా వెంకటేష్, మరికంటి భాగ్యలక్ష్మి కనక సేన, నాయకులు అహ్మద్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే వరి ధాన్యం విక్రయించాలి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- చిన్న కంచర్ల లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



పటాన్‌చెరు, నవంబర్ 3 (మనం న్యూస్): ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోని రైతులు వరి ధాన్యం విక్రయించాలని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి (జిఎంఆర్) రైతులకు సూచించారు. ఇంద్రేశం మున్సిపల్ పరిధిలోని చిన్నకంజర్ల గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వర్షాకాలం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో రైతులకు కల్పిస్తున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. తుఫాన్ ప్రభావం నేపథ్యంలో రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన టార్పాలిన్లు ఏర్పాటు చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే గోదాములకు తరలించాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారికి ఫోన్ ద్వారా సూచించారు. రైతులు తమ ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యానికి నిర్ణీత గడువులోగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని కోరారు. అదేవిధంగా రైతులకు బకాయి ఉన్న ధాన్యం బోనస్ చెల్లింపుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ప్రమీల, డీసీసీబీ డైరెక్టర్ రాఘవేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి, అంతిరెడ్డి, శ్రీనివాస్, రామచందర్, వెంకటేష్, పీఏసీఎస్ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.


విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత



- గజ్వేల్ విద్యుత్ శాఖ డి ఈ ఏ స్వామి

గజ్వేల్ నవంబర్ 3 మనం న్యూస్: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని గజ్వేల్ విద్యుత్ శాఖ డిఈ ఏ స్వామి అన్నారు. గజ్వేల్ డివిజన్ కార్యాలయం తో పాటు, గజ్వేల్ సబ్ డివిజన్, ములుగు సబ్ డివిజన్, తుక్కాపూర్ సబ్ డివిజన్ కార్యాలయాలలో విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయా సమస్యలపై వినియోగదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్ డివిజన్ పరిధిలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. వినియోదారులకు ఏ సమస్య లేకుండా చూసుకోవడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ డిఈ ఏ స్వామి, గజ్వేల్ ఏడీఈ జగదీశ్ ఆర్య, ములుగు ఏడీఈ జి శ్రీనివాస్, తుక్కాపూర్ ఏడీఈ కె మధుసూదన్, డివిజన్ పరిధిలోని ఆయా మండలాల ఏఈలు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న వంటేరు ప్రతాప్ రెడ్డి దంపతులు



గజ్వేల్, నవంబర్ 3 మనం న్యూస్: జగదేవ్‌పూర్ మండలం ఇటిక్యాల గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో కళ్యాణ మహోత్సవంలో పాల్గొని అమ్మవారి దివ్య ఆశీర్వాదాలు స్వీకరించారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, గజ్వేల్ నియోజక వర్గంతో పాటు తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు.సర్పంచ్ దీన రాజలింగం ఇటిక్యాల మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ గుప్తా,ఉపసర్పంచ్ ఎర్రోళ్ల నరేష్,నాయకులు జానకి రాములు, మల్లేష్,స్వామి, భాస్కర్, ఆంజనేయులు,సాయిలు,ఇటిక్యాల గౌడ సంఘం కుటుంబ సభ్యులు గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

సోనాలికా ఆల్‌టైమ్ రికార్డు

- ఏప్రిల్-అక్టోబర్ 2026లో 1,21,148 ట్రాక్టర్ల విక్రయాలు
- దేశీయ మార్కెట్లో అత్యంత వేగంగా 1 లక్ష ట్రాక్టర్ల విక్రయాల మైలురాయిని సాధించిన సోనాలికా




హైదరాబాద్ , నవంబర్ 3(మనంన్యూస్): భారతదేశంలో నంబర్ 1 ట్రాక్టర్ ఎగుమతి బ్రాండ్ అయిన సోనాలికా ట్రాక్టర్స్, 2026 ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు మొత్తం 1,21,148 ట్రాక్టర్లను విక్రయించి ఇప్పటివరకు ఎన్నడూ లేని అత్యుత్తమ వైటీఎం విక్రయాల రికార్డును సృష్టించింది.

దేశీయ మార్కెట్లో కంపెనీ సాధించిన అసాధారణ వృద్ధి ఈ విజయానికి ప్రధాన కారణం. ఈ ఏడాది అత్యంత తక్కువ సమయంలోనే 1 లక్ష ట్రాక్టర్ల విక్రయాల మైలురాయిని సోనాలికా చేరుకుంది. సంస్థ తన 30వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న ఈ ప్రత్యేక సంవత్సరంలో సాధించిన ఈ ఘనత, వ్యవసాయ రంగ భవిష్యత్తుపై కంపెనీకి ఉన్న దూరదృష్టిని, వృద్ధి పట్ల ఉన్న నిబద్ధతను ప్రతిబింబిస్తోంది.ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ ట్రాక్టర్స్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ రామన్ మిట్టల్ మాట్లాడుతూ ఏప్రిల్-అక్టోబర్ 2026 మధ్య 1,21,148 ట్రాక్టర్ల అత్యధిక విక్రయాలను నమోదు చేయడం మా 30 ఏళ్ల ప్రయాణంలో ఒక అద్భుతమైన మైలురాయి. వివిధ మార్కెట్లలో మేము నిర్మించుకున్న బలమైన వ్యాపార సామర్థ్యానికి ఇది నిదర్శనం. ఈ ఏడాది దేశీయ మార్కెట్లో అత్యంత వేగంగా 1 లక్ష ట్రాక్టర్ల విక్రయాలను సాధించడం మా విజయానికి ప్రధాన చోదకశక్తిగా నిలిచింది. ఈ పురోగతికి సోనాలికా అనుసరిస్తున్న వ్యూహాత్మక దూరదృష్టి, ప్రపంచస్థాయి తయారీ సామర్థ్యం, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా స్పందించే విధానం, సంస్థ అంతటా నెలకొన్న నాణ్యత పట్ల నిబద్ధత ప్రధాన బలాలు. అధునాతన వ్యవసాయ సాంకేతికతలు, నిర్దిష్ట వ్యవసాయ అవసరాలకు అనుగుణంగా రూపొందించిన ఇంజినీరింగ్ పరిజ్ఞానం, పారదర్శక వ్యాపార విధానాల ద్వారా రైతులకు సరైన సమయంలో సరైన వ్యవసాయ పరిష్కారాలను అందిస్తున్నాం. పంజాబ్లోని హోషియార్పూర్లో ఉన్న ప్రపంచంలోనే అతిపెద్ద సమీకృత ట్రాక్టర్ తయారీ కేంద్రం మా సామర్థ్యానికి మరింత బలాన్నిస్తోంది. ఈ తాజా మైలురాయి, రైతులకు మరింత విలువను అందించాలనే నిరంతర లక్ష్యంతో ముందుకు సాగుతున్న ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన భారతీయ ట్రాక్టర్ తయారీ సంస్థగా సోనాలికా స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుంది. భారత గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో రైతుల ఆశయాలు, పట్టుదల, భవిష్యత్తు కోసం పెట్టుబడులు పెట్టాలనే ఆసక్తి రోజురోజుకూ పెరుగుతున్నాయి. మా అధునాతన ట్రాక్టర్ శ్రేణితో పాటు కొత్త గోల్ సిరీస్ను కూడా రైతుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. భారతీయ రైతుల ఆశయాలు పెరుగుతున్న కొద్దీ, వారికి మరింత మెరుగైన ఉత్పత్తులను అందించడం, వేగంగా ఆవిష్కరణలు చేయడం, మరింత దృఢ సంకల్పంతో ముందుండి నడిపించడం మా బాధ్యతగా భావిస్తున్నాం అని తెలిపారు.

బొప్పలి వెంకటేష్ యాదవ్‌కు ఘనంగా 'సేవరత్న అవార్డు' ప్రదానం



హైదరాబాద్, నవంబర్ 3(మనంన్యూస్): జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీ బొప్పలి వెంకటేష్ యాదవ్ ప్రతిష్టాత్మకమైన 'సేవరత్న అవార్డు'ను అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి మెయిన్ హాల్లో శ్రీ వాగ్దేవి వాద్య సంగీత కళా నృత్య సంస్కృతి సంస్థ మరియు శ్రీ నటరాజ నృత్య సంగీత అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో 'స్వర సప్త సంగీత వాద్య నృత్య సమ్మేళనం' కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ వేడుకలో సమాజంలో ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి నిర్వాహకులు బొప్పలి వెంకటేష్ యాదవ్‌ని 'సేవరత్న అవార్డు'తో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కళాకారులు, ప్రముఖులు, సాంస్కృతిక దిగ్గజాలు పాల్గొని ఆయనకు అభినందనలు తెలిపారు. కార్యక్రమ నిర్వాహకులు, ఫౌండర్ బి. నాగేంద్ర యాదవ్ బొప్పలి వెంకటేష్ యాదవ్ సేవలను కొనియాడుతూ, భవిష్యత్తులోనూ ఆయన మరిన్ని శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.



- తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీకి సిరిసిల్ల వేదిక!
- ఘనంగా ఆవిర్భావ సభ
- నిర్వాహకులు, అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులకు సభ్యుల ప్రత్యేక కృతజ్ఞతలు
- ఆటపాటలతో కళాకారుల సందడి.. పలువురికి ఘన సన్మానాలు

సిరిసిల్ల, నవంబర్ 03 (మనం ప్రతినిధి): తెలంగాణ జానపద కళాకారుల ఐక్యతకు, కళా వైభవానికి రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం వేదికగా నిలిచింది. తెలుగు ఫోక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సిరిసిల్ల కాలేజ్ గ్రౌండ్ లో అంగరంగ వైభవంగా నిర్వహించిన తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆవిర్భావ సభ నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన కవులు, కళాకారులు, గాయకులు, సినీ రంగానికి చెందిన పలువురు ప్రతినిధులతో సభా ప్రాంగణం సందడిగా మారింది. ఈ సందర్భంగా సిరిసిల్ల మున్సిపల్ చైర్మన్, ఫోక్ సింగర్స్ ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కళాకారులు తమ తమ ప్రత్యేకతలను చాటుకుంటూ జానపద గీతాలు ఆలపించారు. ఆటపాటలతో సభకు హాజరైన వారిని అలరించారు. కళారంగానికి విశేష సేవలు అందిస్తున్న కళాకారులను గుర్తించి ఘనంగా సన్మానించి గౌరవించారు.

నిర్వాహకులకు సభ్యుల ప్రత్యేక ధన్యవాదాలు

తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆవిర్భావ సభను ఇంతటి ఘనంగా, విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేసిన వేదిక నిర్వాహకులకు, అధ్యక్షులకు, ప్రధాన కార్యదర్శులకు, కార్యవర్గ సభ్యులకు, ప్రతి ఒక్క సభ్యునికి తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ కళాకారులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

సభ ఏర్పాట్ల నుంచి కార్యక్రమం విజయవంతమయ్యే వరకు ప్రతి ఒక్కరూ చూపిన సహకారం, సమన్వయం, కృషి అభినందనీయమని కొనియాడారు. దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో వివిధ రంగాలకు చెందిన ఫోక్ కళాకారులంతా ఒకే వేదికపైకి వచ్చి ఐక్యంగా ముందుకు సాగడం ఎంతో ఆనందంగా ఉందని సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. కళాకారులందరినీ ఒకే కుటుంబంలా కలిపిన ఈ వేదిక భవిష్యత్తులో మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.


కళాకారుల ఐక్యతే ప్రధాన బలం

ఐక్యమత్యమే మహాబలం అనే నినాదంతో కళాకారులంతా ఇదే ఐక్యతను కొనసాగించాలని, భవిష్యత్తులో మరిన్ని సభలు, సమావేశాలు నిర్వహించుకోవాలని అభిప్రాయపడ్డారు. కళాకారుల హక్కులు, సంక్షేమం, గౌరవం కోసం అందరూ కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. తెలంగాణ జానపద కళారంగానికి తగిన గుర్తింపు, కళాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం లభించేలా ఐక్యంగా కృషి చేయాలని పేర్కొన్నారు.

సిరిసిల్ల వేదికగా జరిగిన ఈ ఆవిర్భావ సభ కళాకారుల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ మరోసారి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ సభ్యులు తెలిపారు.

ఐక్యమత్యమే మహాబలం..

ఆసియా కుబేరుడు ముకేశ్ అంబానీ




ఢిల్లీ, నవంబర్3: ముకేశ్ అంబానీ మళ్లీ ఆసియాలోనే అత్యంత ధనవంతుడిగా తన అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత అయిన అంబానీ సంపద ఒక్కసారిగా 8 బిలియన్ డాలర్లు (దాదాపు 10.02 శాతం) పెరగడంతో ఆయన మొత్తం నికర ఆస్తి విలువ 88.3 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఫోర్బ్స్ రియల్ టైమ్ బిలియనీర్ల జాబితా ప్రకారం ఈ వివరాలు వెల్లడయ్యాయి. జియో ప్లాట్ఫామ్స్ లిస్టింగ్ తర్వాత రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు భారీగా లాభపడ్డాయి. 2020 సంవత్సరం తర్వాత ఒకే రోజులో రిలయన్స్ షేర్లు సాధించిన అతిపెద్ద సింగిల్ డే గెయిన్ ఇదే కావడం విశేషం. ఈ అద్భుతమైన ర్యాలీతో అంబానీ ఒక్క రోజులోనే ప్రపంచంలోనే అత్యధికంగా సంపద పెంచుకున్న రెండో వ్యక్తిగా నిలిచారు.

ఇక, ప్రస్తుతం అంబానీ కంటే వెనుకబడిన బైట్డాన్స్ వ్యవస్థాపకుడు జంగ్ యిమింగ్ 84 బిలియన్ డాలర్ల ఆస్తితో తదుపరి స్థానంలో ఉండగా, అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ 79.1 బిలియన్ డాలర్ల సంపదతో ఆసియాలో మూడో స్థానంలో కొనసాగుతున్నారు. తాజా ర్యాంకింగ్స్ ప్రకారం జంగ్ యిమింగ్ కంటే అంబానీ 4.3 బిలియన్ డాలర్లు, అదానీ కంటే 9.2 బిలియన్ డాలర్ల ఆధిక్యంలో ఉన్నారు. మరోవైపు, ప్రపంచ స్థాయి బిలియనీర్ల విషయానికి వస్తే.. టెస్లా, స్పేస్ ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ ఏకంగా 878.5 బిలియన్ డాలర్ల అంచనా ఆస్తితో ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నారు. అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ 366 బిలియన్ డాలర్లతో రెండో స్థానంలో నిలవగా, గూగుల్ లారీ పేజ్ 232.3 బిలియన్ డాలర్లతో మూడో స్థానంలో ఉన్నారు. డెల్ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు మైఖేల్ డెల్ 218.5 బిలియన్ డాలర్లతో నాలుగో స్థానంలో, గూగుల్ సెర్గీ బ్రిన్ 213.9 బిలియన్ డాలర్లతో ఐదో స్థానంలో కొనసాగుతున్నారు. అలాగే మెటా సీఈఓ మార్క్ జుకర్బర్గ్ 208.6 బిలియన్ డాలర్లతో ఆరో స్థానం, ఎన్విడియా అధినేత జెన్సన్ హువాంగ్ 175.3 బిలియన్ డాలర్లతో ఏడో స్థానం, ఒరాకిల్ సహ వ్యవస్థాపకుడు లారీ ఎల్లిసన్ 159.7 బిలియన్ డాలర్ల సంపదతో ఎనిమిదో స్థానంలో నిలిచారు. ఒక్క రోజులోనే అత్యధిక సంపద పెంచుకున్న వారి జాబితాలో ఎలాన్ మస్క్ మొదటి స్థానంలో నిలిచారు. ఆయన సంపద 10 బిలియన్ డాలర్లు (1.15 శాతం) పెరిగింది. ఆ తర్వాత స్థానంలో ముకేశ్ అంబానీ 8 బిలియన్ డాలర్లు పెంచుకుని నిలవగా, జెఫ్ బెజోస్ 4.7 బిలియన్ డాలర్లు (1.29 శాతం) జోడించి మూడో స్థానంలో నిలిచారు. రోబ్ వాల్టన్, ఫ్యామిలీ, జిమ్ వాల్టన్, ఫ్యామిలీ కూడా చెరో 3.8 బిలియన్ డాలర్ల సంపదను పెంచుకుని ఈ జాబితాలో నిలిచారు. వీరి ఆస్తులు వరుసగా 2.58 శాతం మరియు 2.63 శాతం మేర పెరిగాయి.

ఒకవైపు అంబానీ సహా కొందరు బిలియనీర్లు లాభాల్లో దూసుకుపోతే, ఒరాకిల్ సహ వ్యవస్థాపకుడు లారీ ఎల్లిసన్ తీవ్ర నష్టాన్ని చవిచూశారు. ఒక్క రోజులోనే ఆయన ఆస్తి 11.9 బిలియన్ డాలర్లు (6.91 శాతం) పడిపోవడంతో ఆ రోజు అత్యధికంగా సంపద కోల్పోయిన వారిలో మొదటి స్థానంలో నిలిచారు. మైఖేల్ డెల్ నికర ఆస్తి 9.9 బిలియన్ డాలర్లు (4.34 శాతం) తగ్గి రెండో అతిపెద్ద నష్టపోయిన వ్యక్తిగా మారారు. మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు స్టీవ్ బాల్మర్ 3.7 బిలియన్ డాలర్లు (2.31 శాతం), చెన్ తియాన్షి 2.9 బిలియన్ డాలర్లు (12.15 శాతం) నష్టపోగా, మార్క్ జుకర్బర్గ్ సంపద 2.8 బిలియన్ డాలర్లు (1.32 శాతం) తగ్గింది. స్టాక్ మార్కెట్లలో వచ్చే హెచ్చుతగ్గులు బిలియనీర్ల ఆస్తులపై ఎంతటి తీవ్ర ప్రభావాన్ని చూపుతాయో ఈ తాజా మార్పులు స్పష్టంగా తెలియజేస్తున్నాయి.

దద్దరిల్లిన ఖేష్మ్ ద్వీపం



ఇరాన్, నవంబర్3: ఇరాన్‌పై మళ్లీ దాడులు జరగొచ్చన్న సంకేతాలు.. ఇరాన్-అమెరికా మధ్య చర్చల్లో పురోగతి అంటూ వార్తలు.. అమెరికాలో మధ్యంతర ఎన్నికలు.. ఇలాంటి పరిస్థితుల్లో ఇరాన్లోని ఖేష్మ్ ఐలాండ్ మళ్లీ పేలుళ్లతో దద్దరిల్లింది. ఐదు చోట్ల బాంబుల వర్షం కురిసిందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. కొన్ని వారాల విరామం తర్వాత మళ్లీ పశ్చిమాసియాలో ఘర్షణ వాతావరణం కనిపించింది.

ఖేష్మ్ పాటు హర్ముజ్ జలసంధి సమీపంలోని బందర్ లెంగే నగరంలో కూడా పేలుళ్లు జరిగాయి. ఖేష్మ్ ద్వీపం మీదుగా రెండు విమానాలు ఎగురుతుండటాన్ని స్థానికులు చూసినట్లు ఇరాన్ మీడియా వెల్లడించింది.

హర్ముజ్ సమీపంలో ఎంక్యూ-9 సహా మరో రెండు డ్రోన్లను ఐఆర్జీసీ కూల్చేసింది. అలాగే జలసంధిలో రాకపోకలు సాగిస్తున్న నౌకలపై ఇరాన్ దాడులు చేస్తోంది. ఈ నేపథ్యంలో అమెరికా స్పందించినట్లు తెలుస్తోంది. ఆత్మరక్షణ కోసమే ఇర్నా ఈ దాడులు చేసినట్లు అమెరికా ప్రకటించింది.

సామాన్య కుటుంబాలకు అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే జారె



దమ్మపేట, నవంబర్ 03 (మనం న్యూస్): అశ్వారావుపేట నియోజకవర్గంలో పలు గ్రామాలకు చెందిన సామాన్య ప్రజలు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతూ వివిధ ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన నేపథ్యంలో వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందించేందుకు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ,ప్రత్యేక చొరవ తీసుకున్నారు.ఈ క్రమంలో ముఖ్యమంత్రి సహాయనిధి కోసం సంప్రదించిన 156 మంది బాధితులకు సంబంధించిన మెడికల్ బిల్లులు హైదరాబాద్ తెలంగాణ సచివాలయంలోని ముఖ్యమంత్రి సహాయనిధి విభాగంలో సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ,అందజేశారు.ఈ సందర్భంగా పేద మధ్యతరగతి కుటుంబాలకు అనారోగ్య సమయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే వివరించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య చికిత్స పొందలేకపోతున్న పేద ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న ఈ సహాయం ఎంతో ఉపయోగక రంగా ఉంటుందని తెలిపారు. అర్హులైన ప్రతి బాధితుడికి ప్రభుత్వ సహాయం అందేలా తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

పేద ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక ఇందిరమ్మ ఇళ్లు

రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్ , సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

దమ్మాయిగూడెం గ్రామంలో లబ్ధిదారులకు 2వ విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, కళ్యాణలక్ష్మి షాదీముబారక్ చెక్కుల పంపిణీ చేసిన మంత్రి



తిరుమలాయపాలెం, నవంబర్ 3 (మనం న్యూస్): పేద ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక ఇందిరమ్మ ఇళ్ళని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం మంత్రి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెం గ్రామంలోని శ్రీ సాయి గణేష్ ఫంక్షన్ హాల్లో 2 వ విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ, కళ్యాణలక్ష్మి/షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తిరుమలాయపాలెం మండలంలో రెండో విడత క్రింద 187 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన నిరుపేదలందరికీ కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లను అందజేస్తామన్నారు. ప్రజా ప్రభుత్వంలో పేదవారి ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకు ప్రతి నిరుపేద కుటుంబానికి ఉచితంగా రూ.5 లక్షల ఆర్థిక సాయంతో ఇల్లు కట్టించి ఇవ్వడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. తిరుమలాయపాలెం మండలంలో మొదటి విడతలో 810 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా, ఇప్పటివరకు దాదాపు 700 ఇళ్లు పూర్తయ్యాయని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. రెండో విడత కింద ఇళ్లను అందజేస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్ల పథకం అనేది విడతలతో ముగిసేది కాదని, అర్హులైన ప్రతి పేదవానికి ఇల్లు అందేవరకు నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కుల, మత, రాజకీయ పార్టీల వ్యత్యాసాలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను అందజేస్తామన్నారు. సొంతింటి కల నెరవేర్చుకోవాలనే నిరుపేద ఆడబిడ్డల చిరకాల కోరికను నెరవేర్చడానికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈ ఇందిరమ్మ ప్రభుత్వం వేగంగా నిర్ణయాలు తీసుకుంటోందని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ, మద్దతు ధరతో పాటు సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ అందించామన్నారు. డ్వాక్రా మహిళలకు 73 వేల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలను అందించామన్నారు. 74 వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేశామని, 14 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చామని మంత్రి అన్నారు.

ఏది ఏమైనా రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం ముందు, నేటి ప్రతిపక్ష నాయకుడు రెండు సంవత్సరాలలో ఈ దేశానికి ప్రధానమంత్రిగా రాబోతున్నారన్నారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయిన తర్వాత, ఇందిరమ్మ రాజ్యం ఈనాడు తెలంగాణ రాష్ట్రంలో ఎలా ఉందో, దేశవ్యాప్తంగా కూడా ఇందిరమ్మ రాజ్యం అలాగే ఉంటుందని, ఏవైతే ఈనాడు తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామో, కేంద్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం వచ్చిన తర్వాత దేశవ్యాప్తంగా ఇదే తరహాలో ఇందిరమ్మ ఇండ్లు ఇస్తుందని మంత్రి అన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, తిరుమలాయపాలెం మండలంలో మొదటి విడతలో భాగంగా దాదాపు 810 ఇళ్లు మంజూరు చేయబడ్డాయని, ఇందులో 600 ఇళ్లు పూర్తిగా పూర్తయి లబ్ధిదారులు గృహప్రవేశాలు కూడా పూర్తి చేసుకున్నారన్నారు. మరో 100 ఇళ్లు వివిధ నిర్మాణ దశలలో ఉన్నాయని, వీటిలో స్లాబ్ వేసిన ఇళ్లు 60 వరకు ఉండగా, ఇటీవల కొత్తగా సాంక్షన్ రావడం వలన త్వరలో పనులు ప్రారంభించనున్న మరో 90 ఇళ్లు ఉన్నాయని తెలిపారు.

రెండవ విడతలో భాగంగా అదనంగా మరో 185 ఇళ్లను లబ్ధిదారులకు అందజేయడం జరుగుతోందని కలెక్టర్ అన్నారు. ఈ పథకం కింద పూర్తిగా అర్హత ఉన్న నిజమైన పేదలను మాత్రమే పారదర్శకంగా ఎంపిక చేస్తున్నట్లు, లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా, వారు ఇళ్లు కట్టుకుంటున్న దశలను బట్టి ఫోటో తీస్తే చాలు, నిధులు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా పారదర్శకమైన విధానం అమలవుతోందని అన్నారు. దీనివల్ల ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో నమ్మకం, డిమాండ్ మరింత పెరిగిందని తెలిపారు. కొత్తగా మంజూరైన ఇళ్ల లబ్ధిదారులు కూడా త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అన్నారు. అనంతరం మంత్రి తిరుమలాయపాలెం మండలం ఏలువారిగూడెం గ్రామంలో ఎన్. నగేష్ - మంగమ్మ లు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి ప్రారంభోత్సవం చేసి, లబ్ధిదారులతో గృహప్రవేశం చేయించారు. ఏలువారిగూడెం గ్రామంలో తెట్టెంపాడు-బీరోలు రోడ్డు నుండి ఏలువారిగూడెం వరకు రూ. 2 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, బీరోలు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో రూ. 48 లక్షలతో నిర్మిస్తున్న ఓహెచ్ఎస్ఆర్ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ శేఖర్ రెడ్డి, పిఆర్ ఎస్ఈ జి. వెంకట్ రెడ్డి, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, మండల ఎంపీడీవో సిలార్ సాహెబ్, తహసీల్దార్ విల్సన్, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్ లు వినోద, గుగులోతు తులసి నర్సింహ, గుమ్మడి దేవభిక్షం, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

రిపట్టభద్రుల ఓటుతో కాంగ్రెస్కు బుద్ధి చెప్పాలి

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి పిలుపు



వైరా, నవంబర్ 3 (మనం న్యూస్): ఖమ్మం-వరంగల్-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం వైరాలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ఐదు లక్షల మంది పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా జాబ్ క్యాలెండర్ అమలు కాలేదని, మెగా డీఎస్సీ హామీ నెరవేరలేదని విమర్శించారు. తెలంగాణకు రావాల్సిన గూగుల్ ఏఐ క్యాంపస్ పక్క రాష్ట్రానికి తరలిపోయిందని ఆరోపించారు. కేసీఆర్ పాలనలో కేటీఆర్ ఐటీ శాఖ మంత్రిగా అనేక కంపెనీలను రాష్ట్రానికి తీసుకొచ్చారని పేర్కొన్నారు.

కేసీఆర్ పదేళ్ల పాలనలో విద్య, ఐటీ రంగాలకు ప్రాధాన్యత ఇచ్చామని, రాష్ట్రవ్యాప్తంగా వెయ్యి పాఠశాలలను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో గురుకుల పాఠశాలల్లో ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు, విద్యార్థుల సమస్యలు పెరుగుతున్నాయని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు డీఏలు, పీఆర్సీ అమలులో జాప్యం జరుగుతోందని విమర్శించారు. సర్వర్ సమస్యల కారణంగా పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ సమస్యను పరిష్కరించాలని ఎన్నికల అధికారులను కోరినట్లు తెలిపారు. ఓటరు నమోదు గడువు మరో రెండు రోజులు మాత్రమే ఉన్నందున అర్హులైన పట్టభద్రులు వెంటనే తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని రాకేష్ రెడ్డి కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చంద్రావతి, లకావత్ గిరిబాబు, కట్టా కృష్ణార్జునరావు, వనమా విశ్వేశ్వరరావు, బాణాల వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ దొంతేబోయిన వెంకటేశ్వర్లు, సిరిపురం సర్పంచ్ శెట్టిపల్లి శ్రీనివాసరావు, మద్దెల రవి, బాణోత్ రామ్మూర్తి, వాసిరెడ్డి రవి, మిట్టపల్లి కిరణ్ కుమార్, ఏదునూరి శ్రీను, సింగవరపు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదల వైద్యం, విద్యకు రాష్ట్ర ప్రభుత్వ పెద్దపీట

100 పడకల ఆసుపత్రి పనులను తనిఖీ చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



కూసుమంచి, నవంబర్ 3(మనం న్యూస్): సంక్షేమ కార్యక్రమాలతో పాటు వైద్య, విద్య రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్ , సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం మంత్రి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి, పాలేరు నియోజకవర్గం కూసుమంచి మండలం గంగబండ తాండా వద్ద రూ. 45.50 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఒకటో బ్లాక్ స్లాబ్ సెంట్రింగ్, స్టీల్ ఫ్యాబ్రికేషన్ పనులు జరుపుతున్నట్లు, రెండో బ్లాక్ స్లాబ్ వేసినట్లు అధికారులు తెలిపారు. రెండో బ్లాక్ కాలం కాంక్రీట్ పనులు జరుగుతున్నట్లు మంత్రికి వివరించారు. నాణ్యతతో, నిర్దీత గడువులోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేదవాళ్ల పిల్లలకు కూడా ఉన్నతమైన విద్యను అందించడంతో పాటు, పేదవాడికి రోగమొస్తే నయం చేసుకునే ఆర్థిక స్థోమత లేని పరిస్థితుల్లో రోడ్డున పడకుండా ఉండేందుకు రాష్ట్ర వ్యాప్తంగా వైద్య రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో అవసరమైన ప్రతిచోటా 100 పడకల ఆసుపత్రులతో పాటు మౌళిక వసతులను ఏర్పాటు చేస్తూ, ఆసుపత్రుల రిక్రూట్మెంట్ బట్టి డాక్టర్లను కూడా కేటాయిస్తున్నామని తెలిపారు. గతంలో పేదవాడికి జబ్బు చేస్తే 'అయ్యో.. ఇంత పెద్ద జబ్బు చేసింది, వైద్యం చేయించుకోవడానికి నా దగ్గర డబ్బు ఏముంది, నాకు చావే గతి' అనే రోజులు ఉండేవని, కానీ ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత వారికి పూర్తి భద్రత, భరోసా కల్పిస్తున్నామని మంత్రి అన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం తీసుకునే వారికి కూడా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. ధనికులకు ఏ రకమైన వసతులు అందుబాటులో ఉన్నాయో, అదే విధంగా పేదవాళ్లకు కూడా వైద్య, విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని అన్నారు. భవిష్యత్తులో రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లోని నియోజకవర్గాల్లో సైతం వైద్య రంగానికి కావలసిన పూర్తి మౌళిక వసతులను ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. మంత్రి పర్యటన సందర్భంగా డీసీహెచ్ఎస్ డా. రాజేఖర్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, వైద్య శాఖ ఈఈ టీ. ఉమామహేశ్వర రావు, కూసుమంచి తహసీల్దార్ సైదులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

వృత్తి విద్య కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

జిఎం(పర్సనల్) వెల్ఫేర్ అజయ్ కుమార్



కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 3(మనం న్యూస్): మహిళలు ఆర్థికంగా ఎదగడంతో పాటుగా వృత్తి విద్య కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని సింగరేణి జిఎం పర్సనల్ వెల్ఫేర్ అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. సింగరేణి కార్పొరేట్ ఏరియాలోని సింగరేణి సేవా సమితి అధ్వర్యంలో మూడు నెలల పాటు పాత కొత్తగూడెం మహిళలకు ఉచిత టైలరింగ్, బ్లడ్పిట్ మహిళలకు ఉచిత మగ్గం వర్క్స్, గాజులరాజం బస్తి మహిళలకు ఉచిత ఫ్యాబ్రిక్ పెయింటింగ్ తరగతులను జిఎం(పర్సనల్) వెల్ఫేర్ అజయ్ కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సేవా సమితి ముఖ్య ఉద్దేశం ఉద్యోగుల కుటుంబ మహిళలు ప్రాజెక్టు ప్రభావిత పరిసర ప్రాంత మహిళలు ఆర్థికంగా ఎదిగి ఉపాధి పొందాలని సూచించారు. సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో వృత్తి విద్యా కోర్సులను నిర్వహిస్తున్నామని దీనిని సక్రమంగా ఉపయోగించుకొని క్రమం తప్పకుండా హాజరై కోర్సు పూర్తి చేసి మంచి శిక్షణ పొంది వృద్ధిలోకి రావాలని కోరారు. ఇందులో భాగంగా పాతకొత్తగూడెం మహిళలకు ఉచిత టైలరింగ్, బ్లడ్పిట్ మహిళలకు ఉచిత మగ్గం వర్క్స్, గాజులరాజం బస్తి మహిళలకు ఉచిత ఫ్యాబ్రిక్ పెయింటింగ్ శిక్షణా తరగతులను ప్రారంభించుకుంటున్నామని పేర్కొన్నారు. మూడు నెలల పాటు నిర్వహించే ఈ ఉచిత వృత్తి శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ముఖ్యంగా ఈ వృత్తి విద్యా కోర్సులు శ్రద్ధగా నేర్చుకోవాలని కోరారు. ఈ వృత్తి శిక్షణ అనంతరం నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఖాదీ గ్రామోద్యోగ మహా విద్యాలయ- హైదరాబాద్ వారిచే సర్టిఫికెట్లు కూడా అందచేయబడునని ఈ వృత్తి శిక్షణా కోర్సులు నేర్చుకున్న మహిళలు తాము నేర్చుకున్న వృత్తి శిక్షణ ద్వారా యూనిట్లను నెలకొల్పుకొని తమతో పాటు మరికొందరికి జీవనోపాధి కల్పించాలని అదేవిధంగా తాము తయారు చేసిన వాటిని హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ నందు స్టాల్స్ ఏర్పాటుచేసుకొని విక్రయించేందుకు కూడా సింగరేణి సంస్థ సహాయం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిఎం(పర్సనల్) వెల్ఫేర్ సిఎస్ఆర్ అండ్ సెక్యూరిటీ కే.అజయ్ కుమార్ తో పాటు డిజిఎం(పర్సనల్) బి.శివ కేశవ రావు, డివైపిఎం కే.శివ కుమార్, వెల్ఫేర్ పిఏ కే.వరప్రసాద రావు, సేవా కో ఆర్డినేటర్ ఇజాజ్ షరీఫ్, సేవాసెక్రెటరీ మాధవీ స్వర్ణ లత, సేవా కో-ఆర్డినేటర్లు రమాదేవి, మీనాక్షి, అరుణ, పద్మావతి, దీప, శిక్షకులు ఇతర సేవా సభ్యులు అభ్యర్థులు పాల్గొన్నారు.

కరువు రాష్ట్రంగా ప్రకటించాలి



తక్షణం కరువు నివారణ నిధులు విడుదల చేయాలి

రుణాలను రీ షెడ్యూల్ చేయాలి

ఉపాధి పనులు చేపట్టాలి

నిత్యావసరాల బ్లాక్ మార్కెట్ను అరికట్టాలి

కూనంనేని డిమాండ్

కరువు ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన సిపిఐ బృందం

కొణిజర్ల , నవంబర్ 3 (మనం న్యూస్): తెలంగాణను కరువు రాష్ట్రంగా ప్రకటించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. కేవలం ప్రకటనతో సరిపుచ్చుకోకుండా తక్షణం కరువు నివారణ చర్యలకు నిధులు -విడుదల చేయాలని ఆయన కోరారు. మంగళవారం ఖమ్మం జిల్లాలోని కొణిజర్ల మండలంలో తనికెళ్ల, కొణిజర్ల తదితర కరువు ప్రభావిత మండలాల్లో సిపిఐ బృందం పర్యటించింది. సాగు చేయని పొలాలు, నీటికి నోచుకోని చెరువులను, అధిక ఉష్ణోగ్రతల కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. పలు చోట్ల అడుగంటిన భూగర్భ జలాల స్థితిని తెలుసుకోవడంతో పాటు -రైతులను కరువు పరిస్థితిపై పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తనికెళ్లలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సాంబశివరావు మాట్లాడుతూ తక్షణం రూ.25వేల కోట్లను కేంద్రం నిధులు విడుదల చేయాలని అప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం కరువు పనులు కొనసాగించేందుకు తన వంతు నిధులు విడుదల చేయాలని ఆయన కోరారు. కరువుకు -సంబంధించి పరస్పర ఆరోపణలు చేయకుండా సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టాలన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రకృతి విపత్తు కారణంగా ఏర్పడిన ఈ పరిస్థితిని అధిగమించేందుకు అన్ని పార్టీలు కృషి చేయాలని ఆయన సూచించారు. రాష్ట్రంలో ఎల్నినో కారణంగా లోటు వర్షపాతం నమోదైందని చెరువులు, కుంటలకు నీరు చేరలేదని రైతులు వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు వేయకపోవడంతో సాగు విస్తీర్ణం తగ్గిందని కూనంనేని తెలిపారు. రాష్ట్రంలో గతేడాది ఖరీఫ్ 69.19 లక్షల ఎకరాలలో వరి సాగు చేస్తే ఈఏడాది 57.04 లక్షల ఎకరాలలో మాత్రమే వరి సాగు చేశారని అది కూడా దిగుబడి -పలు చోట్ల తగ్గుతుందన్నారు. ఒక వరి విస్తీర్ణమే 12.15 లక్షల ఎకరాలు తగ్గిందని ఈ దశలో పంటలు సాగు చేయని రైతులను కూడా ఆదుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కరువుపీడిత గ్రామల్లో పరిశీలన చేయాలని, పరిహారానికి తక్షణం చర్యలు చేపట్టాలని సాంబశివరావు డిమాండ్ చేశారు. రుణాలను రీ షెడ్యూల్ చేయాలని రెండు లక్షల -రుణమాఫీ కానీ రైతుల రుణాలను ఇప్పుడు మాఫీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుత పరిస్థితుల రీత్యా తాగునీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉందని దీనిని దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేయాలన్నారు. పంచాయతీలకు ప్రత్యేక కరువు నిధులను కేటాయించాలని విబి జీ రాంజీ పథకం ద్వారా పనులు చేపట్టడంతో పాటు పని దినాల సంఖ్యను పెంచాలన్నారు. కూలీ కూడా గిట్టుబాటు అయ్యేవిధంగా చూడాలన్నారు. పశుగ్రాసం కొరత రాకుండా చూడడంతో పాటు చిన్న, సన్నకారు రైతులకు -ఉపయోగపడేవిధంగా ఉపాధి పనులు చేపట్టాలన్నారు. ప్రత్యేకించి కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రత్యేక ప్రణాళిక -రూపొందించాలని, వరికి రూ. 30వేలు, వాణిజ్య పంటలకు రూ.50వేలు పరిహారంగా అందించాలని ఆయన కోరారు. నిత్యావసర వస్తువులను బ్లాక్ మార్కెట్కు తరలించి ప్రజలపై భారాలు మోపుతున్నారని తక్షణం బ్లాక్ మార్కెట్ దారులపై చర్యలు తీసుకోవాలని, 14 రకాల నిత్యావసర వస్తువులను చౌక దుకాణాల ద్వారా సరఫరా చేయాలన్నారు. ప్రస్తుత పంటలను కాపాడేందుకు నిరంతరాయంగా విద్యుత్ను అందించాలని ఆయన కోరారు. మీడియా సమావేశంలో రాష్ట్ర రైతు సంఘం -అధ్యక్షులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు దొండపాటి రమేష్, రైతు సంఘం నాయకులు రవీంద్రబాబు, మిడికంటి వెంకటరెడ్డి, తోట రామాంజనేయులు, మండల కార్యదర్శి గడల భాస్కర్ పాల్గొన్నారు.

పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత

- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు
- చాతకొండ 6వ బెటాలియన్లో మెన్ బ్యారెక్స్ నిర్మాణానికి భూమి పూజ



భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 3 (మనంప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చాతకొండలోని 6వ బెటాలియన్ను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా బెటాలియన్ కమాండెంట్ పి.సి.వి. రమణ పుష్పగుచ్ఛం అందించి ఎస్పీకి స్వాగతం పలికారు. అనంతరం బెటాలియన్ సిబ్బంది నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు.

సిబ్బంది సంక్షేమం, సౌకర్యాల కల్పనలో భాగంగా నూతనంగా నిర్మించనున్న మెన్ బ్యారెక్స్ నిర్మాణానికి ఎస్పీ భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా బెటాలియన్ సిబ్బందికి కల్పిస్తున్న వసతులు, చేపట్టనున్న నూతన నిర్మాణాల గురించి కమాండెంట్తో చర్చించారు. సిబ్బందికి అవసరమైన మౌలిక వసతులు కల్పించడం ద్వారా పోలీసు శాఖ పనితీరును మరింత బలోపేతం చేయవచ్చని జిల్లా ఎస్పీ తెలిపారు.

ఈ కార్యక్రమంలో కమాండెంట్ పి.సి.వి. రమణ, అదనపు కమాండెంట్ ఎస్. శ్రీధర్ రాజా, అసిస్టెంట్ కమాండెంట్లు ఎ.వి. రమణయ్య, రామకృష్ణ రెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్పీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్ఐలు జె. లెనిన్ బాబు, సి.హెచ్.వి. శ్రీనివాసరెడ్డి, జి.వి. రామారావు, బి. జానయ్య, బెటాలియన్ పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మనం Manam Mahabubnagar
మహబూబ్ నగర్

కేంద్ర ప్రాయోజిత పథకాల లక్ష్యాలు నెరవేరాలి



ప్రజలకు ఆశించిన ప్రయోజనాలు అందాలి
కేంద్ర శాఖలతో నిరంతర సమన్వయం చేసుకోవాలి
ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్, నవంబర్ 3(మనంన్యూస్): తెలంగాణలో కేంద్ర ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలుపై మరింత దృష్టి సారించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. కేంద్ర పథకాల కింద కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడంతో పాటు, ఆయా పథకాల ద్వారా ఆశించిన ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో కేంద్ర ప్రభుత్వ సెక్టార్, సెంట్రల్ స్పాన్సర్డ్ స్కీమ్స్ అమలు, నిధుల కేటాయింపులు, ఖర్చులు, పెండింగ్ బిల్లులు, కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం నుంచి నిధులు పొందేందుకు ఉన్న అన్ని అవకాశాలను శాఖలవారీగా గుర్తించి, అవసరమైన ప్రతిపాదనలను సకాలంలో సమర్పించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల మార్గదర్శకాలను పరిశీలించి, అర్హతలకు అనుగుణంగా ప్రతిపాదనలు రూపొందించాలని, కేంద్ర శాఖలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ నిధుల సాధనకు కృషి చేయాలని అధికారులకు దిశ నిర్దేశం చేశారు.

కేంద్ర ప్రాయోజిత పథకాల (సీఎస్ఎస్) ద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి గరిష్ఠ స్థాయిలో నిధులు రాబట్టుకోవాల్సిన అవసరాన్ని ఆయన ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. వివిధ శాఖల పరిధిలో అమలవుతున్న కేంద్ర ప్రాయోజిత పథకాల నిధుల వినియోగం, పురోగతిని సమీక్షించిన ఉప ముఖ్యమంత్రి.. కేంద్రం కేటాయించిన నిధులను సమర్థవంతంగా ఖర్చు చేయడంతో పాటు, వాటి ద్వారా ప్రజలకు అందాల్సిన ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా పర్యవేక్షించాలని సూచించారు. ఈ పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం కూడా 40 శాతం నిధులను సమకూరుస్తున్నందున, నిధుల ఖర్చుపైనే కాకుండా వాటి ద్వారా సాధిస్తున్న ఫలితాలు, ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలపైనా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రాష్ట్రానికి, ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూర్చే పథకాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం కోసం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్లో పనిచేస్తున్న లైజన్ అధికారుల సేవలను అన్ని శాఖల అధికారులు సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. పెండింగ్లో ఉన్న అనేక సమస్యలను కూడా పరిష్కరించామని చెప్పారు. అన్ని బిల్లులను క్రమశిక్షణతో క్లియర్ చేస్తున్నామని వివరించారు. వివిధ శాఖల పరిధిలో అమలవుతున్న కేంద్ర ప్రాయోజిత పథకాల ప్రస్తుత పరిస్థితి, పురోగతి, నిధుల వినియోగంపై ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రణాళికా శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ ఉప ముఖ్యమంత్రికి వివరించారు.

సారూ... జరా మమ్మల్ని ఆదుకోరు?

కేజీ లైవ్ చికెన్ ధర రూ.110 మాత్రమే ఉండాలి
కోళ్ల పెంపకందారులకు ఊరట కల్పించండి
కేంద్రానికి పౌల్ట్రీ సంఘాల విజ్ఞప్తి

హైదరాబాద్, నవంబర్ 3, మనం ప్రతినిధి : దేశవ్యాప్తంగా లైవ్ చికెన్ ధరల్లో ఏకరూపత తీసుకురావాలని పౌల్ట్రీ పరిశ్రమకు చెందిన జాతీయ సంఘాలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరాయి. కిలో లైవ్ చికెన్ ధర రూ.110 ఉండేలా ఒకే విధమైన ధరల విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశాయి. కోళ్ల దాణా ధరలు తగ్గించడంతో పాటు ఎల్నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు పౌల్ట్రీ రంగానికి సహకారం అందించాలని, తాజాగా హైదరాబాద్లో జరిగిన సమావేశంలో ఈ మేరకు తీర్మానాలు చేశారు. పండగల సమయంలో వినియోగం తగ్గడంతోనే చికెన్ ధరలు పడిపోయాయని, ఇది తాత్కాలికమని ప్రతినిధులు పేర్కొన్నారు. వచ్చే వారం చివర్లో ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులను కలిసి వినతిపత్రం సమర్పించనున్నారు.

దేశంలోని అన్ని ప్రాంతాల్లో కిలో లైవ్ చికెన్ ధర రూ.110 ఉండేలా ఒకే విధమైన ధరల విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశాయి. అదే సమయంలో కోళ్ల దాణా ధరలను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని, ఎల్నినో ప్రభావంతో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేలా పౌల్ట్రీ రంగానికి ప్రత్యేక సహకారం అందించాలని కోరాయి. హైదరాబాద్లో సోమవారం ఆల్ ఇండియా పౌల్ట్రీ బ్రీడర్స్ అసోసియేషన్, పాన్ ఇండియా బ్రీడర్స్ అసోసియేషన్, తెలంగాణ పౌల్ట్రీ బ్రీడర్స్ అసోసియేషన్లతో పాటు వివిధ సంఘాల ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలు, భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. ఇటీవల పండగల సమయంలో చికెన్ వినియోగం తగ్గడంతో మార్కెట్లో ధరలు పడిపోయాయని పౌల్ట్రీ సంఘాల ప్రతినిధులు తెలిపారు. అయితే ఈ తగ్గుదల తాత్కాలికమేనని, దీనిపై రైతులు, వ్యాపారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. పౌల్ట్రీ పరిశ్రమలో ధరల స్థిరత్వం, ఉత్పత్తి వ్యయాల నియంత్రణకు సమన్వయంతో చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా పౌల్ట్రీ బ్రీడర్స్ అసోసియేషన్, పాన్ ఇండియా బ్రీడర్స్ అసోసియేషన్, తెలంగాణ పౌల్ట్రీ బ్రీడర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో పాటు పరిశ్రమ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కేంద్ర ప్రభుత్వానికి వివరించేందుకు వచ్చే వారం చివర్లో ఢిల్లీకి వెళ్లాలని ప్రతినిధులు నిర్ణయించారు. అక్కడ కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు, సంబంధిత విధాన నిర్ణేతలను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించనున్నారు. కేంద్రం స్పందనపై దేశవ్యాప్తంగా పౌల్ట్రీ రైతులు, వ్యాపార వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

వచ్చే బోనాల నాటికి ఇందిరమ్మ టవర్స్ పూర్తి



- **ఇందిరమ్మ ఇండ్లకు మరిన్ని భూములను గుర్తిస్తున్నాం**
- **హైదరాబాద్ ఇంఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్**
- **ఈ-లాటరీ ద్వారా నాలుగు నియోజకవర్గాల్లో 1920 ఇండ్లకు లబ్ధిదారుల ఎంపిక**
- **14 నియోజకవర్గాల్లో ఖాళీల భర్తీకి నేడు మరోసారి లాటరీ**

హైదరాబాద్, నవంబర్ 3, మనం ప్రతినిధి : హైదరాబాద్లో సొంతంగా ఇండ్లు నిర్మించుకోడానికి భూములు కలిగి ఉండి అర్హులైన వారికి కూడా త్వరలోనే ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని జిల్లా ఇన్ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు.

పేదల సొంత ఇంటికలను నిజం చేయడానికి ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి 5500 ఇండ్లను మంజూరు చేసిందని, అయితే హైదరాబాద్ వంటి మహానగరంలో స్థలాల లభ్యత తక్కువగా ఉన్నందున, ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు వందల కోట్ల రూపాయల విలువ చేసే భూములను పేదల నివాసాల కోసం వినియోగిస్తూ ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ నిర్మాణాలను చేపడుతున్నామన్నారు.

గోషామహల్, ముషీరాబాద్, ఎల్బీనగర్, చంద్రాయణగుట్ట అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ కేటాయింపు లాటరీని మంగళవారంనాడు శాసనభ్యులు రాజాసింగ్తో కలిసి ఆయన ప్రారంభించారు. పూర్తి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ ఈ-లాటరీ విధానంలో ఈ నియోజకవర్గాల్లో నిర్మించనున్న 1920 ఇండ్లకు లబ్దిదారులను ఎంపిక చేశారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. లాటరీ తీసిన ప్రాంతాల్లో ఇండ్లనిర్మాణ పనులకు త్వరలోనే భూమి పూజ నిర్వహిస్తామన్నారు. పేద ప్రజల సొంత ఇంటి కలను నిజం చేసే ప్రతిష్టాత్మకమైన కార్యక్రమానికి ఆర్టీసీ భూములను కూడా ఇచ్చామని అలాగే పోలీసు శాఖకు చెందిన భూములను సైతం వినియోగిస్తున్నామన్నారు. మొత్తం లక్ష ఇండ్ల నిర్మాణాలను చేపట్టేందుకు అనువైన భూములన్నిటినీ కూడా సేకరిస్తున్నామని ఇది ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. వచ్చే బోనాల నాటికల్లా గృహ ప్రవేశాలు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రంది పడకండి.. ఉద్యోగంలోకి మళ్లీ తీసుకుంటాం

- **సింగరేణిలో తొలగించబడ్డ మాజీ ఉద్యోగుల కేసుల పునఃపరిశీలనకు హైపవర్ కమిటి**
- **సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు జారీ**

హైదరాబాద్, నవంబర్ 3, మనం ప్రతినిధి : సింగరేణి సంస్థలో 2023 నుంచి 2025 మధ్య కాలంలో విధులకు గైర్హాజరు కారణంగా తొలగించబడిన మాజీ ఉద్యోగుల కేసులను పునఃపరిశీలించాలని యాజమాన్యం నిర్ణయించింది. మళ్లీ ఉద్యోగంలోకి తీసుకునేందుకు హైపవర్ కమిటీని ఏర్పాటు చేసింది. 01.01.2023 నుంచి 31.12.2025 మధ్య కాలంలో గైర్హాజరు కారణంగా తొలగించబడిన వారు దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేసింది. 01.04.2026 నాటికి 46 సంవత్సరాలు లేదా అంతకంటే తక్కువ వయస్సు కలిగి ఉండాలని పేర్కొంది. ఈ నేపథ్యంలో 2023 నుంచి 2025 మధ్య కాలంలో గైర్హాజరు కారణంగా డిస్మిస్డ్ అయి న ఉద్యోగులకు అవకాశం కల్పిస్తూ యాజమాన్యం మంగళవారం ఉత్తర్వులు విడుదల చేసింది.

ఉండాల్సిన అర్హతలు ఇవే..

తొలగించబడిన కాలానికి ముందున్న గత 05 క్యాలెండర్ సంవత్సరాలలో ఏదైనా 2 సంవత్సరాలలో కనీసం 100 మస్టర్లు పూర్తి చేసి ఉండాలి. జనరల్ అసిస్టెంట్ ట్రైనీ, కేటగిరీ-ఐ పోస్టులో పునఃనియామకం కోసం వైద్యపరంగా ఫిట్గా ఉండాలన్నారు. అర్హత కలిగి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనుకునే డిస్మిస్డ్ ఉద్యోగులు తగిన ప్రొఫార్మాలో దరఖాస్తును పూర్తి చేసి, తాము చివరగా పనిచేసిన గని/డిపార్ట్మెంట్ అధిపతికి సమర్పించాలి. దరఖాస్తు సమర్పించడానికి చివరి తేదీ 14.11.2026గా సింగరేణి యాజమాన్యం నిర్ణయించింది. ఏరియా జనరల్ మేనేజర్లు అర్హత కలిగిన అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించి, తదుపరి చర్యల నిమిత్తం నిర్ణీత తేదీలోగా సంబంధిత అధికారులకు పంపించాలని కోరింది. పూర్తి వివరాల కోసం సంబంధిత గనులు లేదా శాఖల అధికారులను సంప్రదించాలని చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఈ సందర్భంగా ఒక ప్రకటనలో తెలిపారు.

తెలంగాణలో ఆయిల్పామ్ సాగుకు పెద్దపీట: మంత్రి తుమ్మల

- **ఈ నెల 30న ఇండియన్ వెజిటేబుల్ ఆయిల్ ప్రొడ్యూసర్స్ సమావేశం**
- **మంత్రి తుమ్మలను ఆహ్వానించిన అసోసియేషన్ ప్రతినిధులు**



హైదరాబాద్, నవంబర్ 3, మనం ప్రతినిధి : తెలంగాణ సచివాలయంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును.. ఇండియన్ వెజిటేబుల్ ఆయిల్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, ఈ నెల 30న హైదరాబాద్లో నిర్వహించనున్న సమావేశానికి మంత్రిని ఆహ్వానించారు. ఈ సమావేశంలో తెలంగాణలో ఆయిల్ పామ్ సాగు భవిష్యత్తు, రైతుల అభ్యున్నతి, పంట ఉత్పాదకత పెంపు, పరిశ్రమల భాగస్వామ్యం తదితర అంశాలపై ప్రసంగించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగు విస్తరణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగును చేపడుతున్న అన్ని కంపెనీలకు ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తోందని స్పష్టం చేశారు. గోద్రెజ్, పతంజలి, హిందుస్థాన్ యూనిలీవర్ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు తెలంగాణలో ఆయిల్ పామ్ సాగు అభివృద్ధిలో భాగస్వాములుగా ఉన్నాయని, ఆయా కంపెనీల కార్యకలాపాలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందని పేర్కొన్నారు.

ఇటీవల గోద్రెజ్ కంపెనీ దేశంలోనే తొలిసారిగా ఆరవ తరం హైబ్రిడ్ ఆయిల్ పామ్ విత్తనాల అభివృద్ధి కోసం సీడ్ గార్డెన్ ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిందని, ఇందుకు అవసరమైన సహకారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందని మంత్రి వివరించారు. తెలంగాణలో ఆయిల్ పామ్ రంగం అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, కల్పిస్తున్న ప్రోత్సాహకాలు ఇతర ప్రముఖ కంపెనీలు సైతం తెలంగాణలో ఆయిల్పామ్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నాయని అన్నారు.

ప్రస్తుతం ఎల్ నినో వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో నీటి లభ్యత, పంటల సాగు ప్రణాళికలను దృష్టిలో ఉంచుకుని నూనెగింజల పంటల సాగు ఎంతో శ్రేయస్కరమని మంత్రి అభిప్రాయపడ్డారు.

దేశీయంగా వంట నూనెల అవసరాలను తీర్చుకోవడంతో పాటు దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు ఆయిల్ పామ్ సహా నూనెగింజల సాగు విస్తరణ ఎంతో అవసరమని పేర్కొన్నారు. రైతులకు మెరుగైన ఆదాయం కల్పించడంతో పాటు వ్యవసాయ ఆధారిత పరిశ్రమల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

తెలంగాణ కవులు, కళాకారులు మళ్లీ గళమెత్తాలి



హైదరాబాద్, నవంబర్ 3(మనంన్యూస్): కేటీఆర్సమాజాన్ని చైతన్యం చేయాల్సిన బాధ్యత తెలంగాణ కవులు, కళాకారులదేననీ, వారంతా ఐక్యమై మళ్లీ గళమెత్తాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణ వికాససమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని ఖైరతాబాద్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజనీర్స్ భవన్ లో మంగళవారం జరిగిన ప్రజాకవి, గోదావరి గొంతుక మల్లావఝుల సదాశివుడు అవార్డు ప్రదానోత్సవ సభలో కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇవాళ రాష్ట్రంలో వచ్చింది ఎల్ నినో కరువు కాదని, ఈ పాలకులు తెచ్చిన కరువు అని, కేసీఆర్ మీద కోపంతో కాళేశ్వరం నీళ్లు ఆపకుండా, రిజర్వాయర్లలో, చెరువుల్లో నింపకుండా తెలంగాణను ఎండబెడుతున్నారని కేటీఆర్ అన్నారు. సమైక్య రాష్ట్రం నాటి కరువుతో.. మల్లావఝుల పాట అవసరం మళ్లీ వచ్చింది'తలాపునా పారుతుంది గోదారీ.. నా చేను, నా చెలకా ఎడారీ' అని మల్లావఝుల సదాశివుడు దశాబ్దాల క్రితం సమైక్య రాష్ట్రం నాటి పరిస్థితులకు అనుగుణంగా రాసిన పాట అవసరం మళ్లీ వచ్చిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక కేసీఆర్ గారి ముందుచూపుతో మిషన్ కాకతీయతో చెరువుల పూడికతీత, పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి, కొత్త ప్రాజెక్టుల నిర్మాణంతో పదేళ్లపాటు రైతుల పంటలకు పుష్కలంగా నీళ్లు అంది ఏ రంధిలేకుండా వ్యవసాయం చేసుకున్నారని కేటీఆర్ గుర్తు చేశారు. ఏడాదికి రెండు పంటలు కలిపి మూడుకోట్ల టన్నుల వరిధాన్యం పంట పండి, తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఇవాళ ఈ పాలకుల ముందుచూపు లేక కరువు పరిస్థితులు నెలకొన్నాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరం నీళ్లు రైతులకు వరంగా మారితే, ఇపుడు ఈ పాలకులు నదుల్లో నీళ్లు వృథాగా పోతున్నా, ఆ నీళ్లను ఆపి, రిజర్వాయర్లు నింపి, చెరువులను నింపకపోవడంతో రాష్ట్రం కరువుపాలైందన్నారు. అందుకే తెలంగాణ కవులు, కళాకారులు ఇవాళ రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై సాహిత్య ఉద్యమం చేయాలని కేటీఆర్ కోరారు. మల్లావఝుల సదాశివుడు స్మారక పురస్కారాన్ని 2024-25 సంవత్సరానికి ప్రముఖ కవి, కథారచయిత డాక్టర్ చమన్ కు, 2025-26 సంవత్సరానికి సామాజిక విమర్శకులు, పరిశోధకులు డాక్టర్. సంగిశెట్టి శ్రీనివాస్ కు అవార్డును, నగదు పురస్కారాన్ని కేటీఆర్ అందజేశారు. రచయిత్రి తిరునగరి దేవకీదేవి, ప్రజా గాయకుడు కవ్వంపల్లి స్వామిలకు కేటీఆర్ చేతుల మీదుగా ప్రత్యేక సత్కారం చేసి, నగదును అందజేశారు. తెలంగాణ వికాస సమితి గౌరవ అధ్యక్షులు, కవి, గాయకులు ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, సమితి అధ్యక్షులు వనపట్ల సుబ్బయ్య, తెలంగాణ వాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, టీఎన్జీఓల జేఏసీ మాజీ ఛైర్మన్ దేవీ ప్రసాద్, రాష్ట్ర గ్రంథాలయాల సంస్థ మాజీ ఛైర్మన్ ఆయాచితం శ్రీధర్, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షులు విరాహత్ అలీలతోపాటు, కీ.శే. మల్లావఝుల కుమారులు విజయానంద్, వంశీ, కుమార్తె కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణకు మురసు తుపాను ఎఫెక్ట్

- **పలు జిల్లాలకు ఎల్లో వార్నింగ్**
- **నేటి నుంచి హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం బుడమేరుకు మళ్లీ వరద వస్తుందని ప్రజల్లో భయాందోళనలు**



హైదరాబాద్, నవంబర్ 3, మనం ప్రతినిధి : మురసు తుపాను ప్రభావంతో పల్నాడు, గుంటూరు జిల్లాల్లో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. మంగళవారం కురిసిన కుండపోత వర్షాలకు అనేక లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. ముఖ్యంగా పల్నాడు జిల్లా చిలకలూరిపేట వద్ద చెన్నై-కోల్కత్తా జాతీయ రహదారిపైకి భారీగా వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చిలకలూరిపేట పట్టణంలో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. జాతీయ రహదారిని వరద ముంచెత్తడంతో పాటు, పలుచోట్ల విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. అయితే, అధికారులు ముందుజాగ్రత్త చర్యగా విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు, విజయవాడ నగరాన్ని కూడా వర్షం ముంచెత్తింది. గత 10 గంటలుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానతో నగరంలోని అనేక కాలనీలు, బస్తీలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారులపై నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. గత అనుభవాల నేపథ్యంలో, బుడమేరు వాగుకు మళ్లీ వరద పోటెత్తుతుందేమోనని స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికార యంత్రాంగం సహాయక చర్యలపై దృష్టి సారించింది.

తెలంగాణలో పలు జిల్లాలకు మురాసు తుఫాన్..

ఇదిలాఉంటే, అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో రానున్న 3 రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. నేటి నుంచి నవంబర్ 6వ తేదీ వరకు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో వార్నింగ్ జారీ చేసింది. వాతావరణ శాఖ తెలిపిన నివేదిక ప్రకారం... మరాసు తుఫాను కారణంగా, అల్పపీడనం వాయుగుండంగా బలపడి ఆంధ్రప్రదేశ్ తీరం వైపు కదులుతోంది. దీని ప్రభావంతో నేటి నుంచి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలతో పాటు యాదాద్రి భువనగిరి, సిద్దిపేట జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. నేడు, రేపు కూడా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు పడతాయని అంచనా వేసింది. ముఖ్యంగా నవంబర్ 4, 5 తేదీల్లో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. నవంబర్ 2న ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల్లో, నవంబర్ 4న నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్ నగర్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు పడతాయని పేర్కొంది. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉరుములు మెరుపుల సమయంలో సురక్షిత ప్రాంతాల్లో ఆశ్రయం పొందాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.

ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం

- **అరాచకవాదాన్ని అంతం చేద్దాం...**
- **పాకిస్తాన్లో కుట్రదారులకు, ఢిల్లీలో గుంట నక్కలకు వినిపించేలా**
- **వందేమాతరం నినాదాలు మార్మోగాలె**
- **వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో ఎగిరేది కాషాయ జెండానే**
- **నిర్మల్ మహా పాదయాత్రలో బీజేఎల్పీ నేత ఏలేటి గర్జన**



హైదరాబాద్, నవంబర్ 03, (మనం బ్యూరో) : రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిద్దాం...అరాచకవాదాన్ని అంతం చేద్దామని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. పాకిస్తాన్లో కుట్రదారులకు, ఢిల్లీలో గుంట నక్కలకు వినిపించేలా వందేమాతరం నినాదాలు మార్మోగాలని పిలుపునిచ్చారు.వర్షం పడుతుంటే శుభసూచకమని, తెలంగాణలో రాబోయేది కాషాయ జెండా అనీ, సునీల్ బన్సల్ ఇక్కడికి రావడమే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు.

ఒడిశా, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్లో కాషాయ జెండా ఎగురవేసిన సునీల్ బన్సల్ గారికి స్వాగతం పలుకుతూ, 3 కిలోమీటర్ల పాదయాత్రలో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పాల్గొన్న ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు.నిర్మల్లో నిర్వహించిన మహా పాదయాత్ర సందర్భంగా బీజేఎల్పీ నేత ఏలేటి మాట్లాడుతూ ఢిల్లీలో నలుగురిని పోగేసుకొని కాంగ్రెస్ పార్టీ అరాచకాలు సృష్టిస్తున్న తీరును దేశ ప్రజలు గమనిస్తున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీ ఓటు చోరీ అంటూ ఆరోపణలు చేస్తున్నారని, కానీ ఆయన చేస్తున్నది పేరు చోరీ రాజకీయాలని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ కుటుంబ చరిత్రను ప్రస్తావిస్తూ, ఫిరంగి జహంగీర్ నుంచి రాజీవ్ గాంధీ, అక్కడి నుంచి రాహుల్ గాంధీ వరకు వచ్చిన కుటుంబ రాజకీయాలపై ప్రశ్నలు సంధించారు. విదేశీ కుట్రలతో నేపాల్, శ్రీలంక, బంగ్లాదేశ్లో జరిగిన పరిణామాలను భారత్లోనూ సృష్టించాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అయితే కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం అలాంటి కుట్రలను అనుమతించబోదని, యువత దేశం వైపే నిలుస్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలపై ప్రశ్నిస్తూ, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రూ.4,000 పెన్షన్ ఇవ్వలేదు, యువతకు ఉద్యోగాలు కల్పించలేదు, విద్యార్థులకు రీయింబర్స్మెంట్ చెల్లించలేదు, రైతులకు రైతు భరోసా అందించలేదు....ఇలా అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం చేస్తూ, వారి సమస్యలను పక్కనపెట్టి ఢిల్లీలో రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.రేవంత్ రెడ్డి తనను తాను మురా మేస్త్రీగా చెప్పుకుంటారని, కానీ వాస్తవానికి ఆయన మూటల మేస్త్రీ అని విమర్శించారు. రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసిన రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేస్తూ, ఢిల్లీలో మూటలు మోస్తున్నారని మండిపడ్డారు.రాహుల్ గాంధీ ఓటు చోరీ అంటూ ఆరోపణలు చేస్తున్నారని, కానీ ఆయన చేస్తున్నది పేరు చోరీ రాజకీయాలని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ కుటుంబ చరిత్రను ప్రస్తావిస్తూ, ఫిరంగి జహంగీర్ నుంచి రాజీవ్ గాంధీ, అక్కడి నుంచి రాహుల్ గాంధీ వరకు వచ్చిన కుటుంబ రాజకీయాలపై ప్రశ్నలు సంధించారు. విదేశీ కుట్రలతో నేపాల్, శ్రీలంక, బంగ్లాదేశ్లో జరిగిన పరిణామాలను భారత్లోనూ సృష్టించాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. నరేంద్ర మోదీ గారు కోట్లాది ప్రజల గుండెల్లోంచి పుట్టిన నాయకుడని, పది బొద్దింకలు ఆయనను ఏమీ చేయలేవని ధీమా వ్యక్తం చేశారు.ఓటు చోరీ అంటూ ఆరోపణలు చేస్తున్న రాహుల్ గాంధీ, ఇప్పటివరకు ఎన్ని ఓట్లు తొలగించబడ్డాయో ఆధారాలతో చెప్పగలరా అని ప్రశ్నించారు. బంగ్లాదేశ్ చొరబాటుదారులు, రోహింగ్యాల పేరుతో 3 కోట్ల ఓట్ల కోసం కాంగ్రెస్ చేస్తున్న తపన, తాపత్రయం ఏమిటని నిలదీశారు.ఓట్లతోనే గెలిచామని చెప్పుకుంటున్న కాంగ్రెస్ నేతలు, తమ గ్రామాల్లో ఒక్క ఓటైనా తొలగించబడిందా అని ప్రజలను అడగాలని అన్నారు.కేరళలో, తమిళనాడులో కాంగ్రెస్, ఇతర పార్టీలు ఎలా గెలిచాయి? రేవంత్ రెడ్డి ఎలా గెలిచారు? అని ప్రశ్నించారు.ఎన్నికల సంఘంపై నమ్మకం లేదని చెప్పే రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి మళ్లీ ఎన్నికలకు రావాలని సవాల్ విసిరారు.ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు, కాంగ్రెస్ అరాచకవాదాన్ని అంతం చేసేందుకు బీజేపీ పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఈ సందర్భంగా ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు.

పేకాట నిర్మూలనకు ప్రత్యేక పోలీసు బృందాల ఏర్పాటు

- నిరంతరం నిఘా.. సమాచారం అందిన వెంటనే దాడులు
- పేకాట నిర్మూలనే లక్ష్యం, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యం
- జూదం కేసులు నమోదైతే భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలపై ప్రభావం
- జూదం ఆడినా.. నిర్వహించినా చట్టపరమైన చర్యలు
- జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర



కామారెడ్డి, నవంబర్ 3 (మనం బ్యూరో): జిల్లాలో జూదం, పేకాట కార్యకలాపాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగా నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర వెల్లడించారు. ఈ బృందాలు 24 గంటల పాటు అప్రమత్తంగా ఉంటూ జిల్లావ్యాప్తంగా పేకాట స్థావరాలపై నిరంతర నిఘా జాడ కారణంగా కుటుంబాల్లో కలహాలు, ఆర్థిక ఇబ్బందులు పెరిగి కుటుంబాలు విచ్ఛిన్నమయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. జూదం సంపాదనకు మార్గం కాదని, జీవితాలను చిన్నాభిన్నం చేసే వ్యసనమని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు.

యువత బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దు...

యువత క్షణిక ఆనందాలకు, అత్యాశకు లోనై పేకాటకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును పాడుచేసుకోవద్దని ఎస్పీ సూచించారు. జూదం కేసుల్లో పట్టుబడి కేసులు నమోదైతే పోలీసు రికార్డుల్లో వివరాలు నమోదవుతాయని తెలిపారు. భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నప్పుడు జరిగే పోలీసు వెరిఫికేషన్లో గత కేసుల వివరాలు పరిశీలనకు వచ్చే అవకాశం ఉందని, తద్వారా ఉద్యోగ అవకాశాలపై ప్రభావం పడవచ్చని హెచ్చరించారు. కేసుల దర్యాప్తులో చట్టప్రకారం వేలిముద్రలు సేకరించి పోలీసు రికార్డుల్లో భద్రపరిచే అవకాశం ఉంటుందని వివరించారు. క్షణికమైన ఆనందం కోసం జీవితకాల భవిష్యత్తును ఇబ్బందుల్లోకి నెట్టుకోవద్దని హితవు పలికారు. జిల్లాలో ఎక్కడైనా పేకాట ఆడుతున్నా, నిర్వహిస్తున్నా ఉపేక్షించేది లేదని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో జూద కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తించినా, విశ్వసనీయ సమాచారం తెలిసినా వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్కు లేదా జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్ 8712686133 నంబరుకు తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు.

జూదానికి దూరంగా ఉండండి..

జూదం, పేకాట నిర్మూలనలో ప్రజలు కూడా భాగస్వాములై పోలీసులకు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ తమ కుటుంబాలకు, సమాజానికి మంచి భవిష్యత్తును అందించాలని సూచించారు. జూదానికి దూరంగా ఉండండి.. కుటుంబాలను కాపాడుకోండి.. యువత భవిష్యత్తును పదిలంగా ఉంచుకోండి అని పిలుపునిచ్చారు.

గోవింద్ పేట్ సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం పెంపు

- 3.15 ఎంవీఏ నుంచి 5 ఎంవీఏకు పెరిగిన సామర్థ్యం
- ట్రాన్స్‌ఫార్మర్‌ను విజయవంతంగా ఛార్జింగ్ చేసిన విద్యుత్ శాఖ అధికారులు




ఆర్మూర్, నవంబర్ 3 (మనం న్యూస్): ఆర్మూర్ మండలం గోవింద్ పేట్ లో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లో విద్యుత్ సరఫరా సామర్థ్యాన్ని పెంచే దిశగా కీలక చర్య చేపట్టారు. సబ్‌స్టేషన్‌లో గతంలో 3.15 ఎంవీఏ సామర్థ్యం కలిగిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 5 ఎంవీఏ సామర్థ్యం గల పవర్ ట్రాన్స్ఫార్మర్ను ఏర్పాటు చేసి మంగళవారం విజయవంతంగా ఛార్జ్ చేశారు.దీంతో గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడటానికి, పెరుగుతున్న విద్యుత్ అవసరాలను తీర్చడానికి అవకాశం కలగనుంది. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ డివిజనల్ ఇంజనీర్ బి. రఘు, పెర్కిట్ సబ్డివిజన్ ఏడీఈ ఎస్. శ్రీనివాస్, పెర్కిట్ ఏఈ సభావత్ కిషన్, పెర్కిట్ ఎల్ఐ గూడూ మియా, గోవింద్‌పేట్ లైన్మన్ నయీమ్, గ్రామ ఉప సర్పంచ్ సుశీన్, మాజీ సర్పంచ్ ప్రభాకర్, సబ్ స్టేషన్ ఆపరేటర్లు గ్రామ ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

క్రిప్టో చోరీలో మా పాత్ర లేదు

సోయిల్, నవంబర్3: ఉత్తర కొరియా హ్యాకర్లు బినాన్స్ క్రిప్టోకరెన్సీ ఎక్స్ఛేంజ్‌లో భారీ చోరీకి పాల్పడ్డారన్న అమెరికా ఆరోపణలను ఉత్తర కొరియా మంగళవారం తోసిపుచ్చింది. ఈ ఆరోపణలను 'అర్థంలేని రెచ్చగొట్టే చర్య'గా అభివర్ణించింది. అమెరికా ప్రకటనను ఖండిస్తూ ఉత్తర కొరియా నాయకుడు కిమ్ జోంగ్ ఉన్ సోదరి కిమ్ యో జోంగ్ ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు.ప్రపంచంలోనే అతిపెద్ద క్రిప్టోకరెన్సీ ఎక్స్ఛేంజ్ అయిన బినాన్స్ శుక్రవారం భారీ చోరీ జరిగిందని సంస్థ వెల్లడించింది. హ్యాకర్లు 6 బిలియన్ డాలర్లకు పైగా విలువైన క్రిప్టోకరెన్సీని దొంగిలించారని తెలిపింది. ఇప్పటివరకు నమోదైన క్రిప్టో చోరీల్లో ఇదే అతిపెద్దదిగా భావిస్తున్నారు.ఈ చోరీకి ఉత్తర కొరియా హ్యాకర్లే పాల్పడ్డారని అమెరికా ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ తర్వాత ప్రకటించింది. గతేడాది బైబిట్ ఎక్స్ఛేంజ్‌లో 1.5 బిలియన్ డాలర్ల చోరీకి పాల్పడిన ట్రేడర్‌టెయిటర్ అనే హ్యాకింగ్ బృందమే బినాన్స్ దాడి వెనుక ఉందని పేర్కొంది. అమెరికా తీరుపై కిమ్ యో జోంగ్ ఆగ్రహం... అంతర్జాతీయ స్థాయిలో సైబర్ నేరాలు జరిగిన ప్రతిసారీ ఉత్తర కొరియాను వాటితో ముడిపెట్టి, ప్రపంచ దేశాల్లో తమపై అపోహలు వ్యాపింపజేసేందుకు అమెరికా ప్రయత్నిస్తోందని కిమ్ యో జోంగ్ ఆరోపించారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో ఆమె అమెరికా ఎఫ్బీఐ ప్రకటనను 'అర్థంలేని రెచ్చగొట్టే చర్య', 'అసంబద్ధమైన మాటలు'గా అభివర్ణించారు.''మా దేశంపై అమెరికాకు ఉన్న శత్రుత్వ వైఖరిని ఈ ఘటన మరోసారి బయటపెట్టింది. మా దేశానికి వ్యతిరేకంగా అమెరికా చేస్తున్న నిరంతర రెచ్చగొట్టే చర్యలను నిశితంగా గమనిస్తున్నాం'' అని ఆమె పేర్కొన్నారు.అమెరికా వైఖరిపై తాము వివిధ కోణాల్లో మరోసారి ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడిందని కిమ్ యో జోంగ్ చెప్పారు.

మాజీల పరేషాన్

- గులాబీలో సొంత నేతలకే చుక్కలు
- కొందరికి భవిష్యత్ అంధకారమేనా?



హైదరాబాద్, మనంబ్యూరో: బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు కొందరికి గులాబీ ముళ్ళు గట్టిగానే గుచ్చుకుంటున్నాయా? ఆ ఉమ్మడి జిల్లాలో సొంత పార్టీ వాళ్ళే నిద్ర లేకుండా చేస్తున్నారా? మాకేం కాదనుకుని ఇన్నాళ్ళు కాళ్ళు ఆరజాపి కూర్చున్న వాళ్ళ సీట్ల కింద ఇప్పుడు సెగలు పుడుతున్నాయా? ఏ జిల్లాలో ఉందా పరిస్థితి? అసలేం జరుగుతోంది?

ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలకు కొన్ని నియోజకవర్గాలలో సొంత పార్టీ నేతలే చుక్కలు చూపిస్తున్నారట. పక్కలో బల్లెంలా తయారై వాళ్లు కత్తులు నూరుతుంటే. మరికొన్ని నియోజకవర్గాలలో కొత్త నేతల దూకుడు మాజీ ఎమ్మెల్యేలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోందంటున్నారు. దీంతో ఇక్కడి గులాబీ మాజీల్లో కొందరికి భవిష్యత్ అంధకారంగా కనిపిస్తుంటే. మరికొందరికి ఫ్యూచర్ ఏంటో అర్థంకాక తలలు పట్టుకుంటున్నట్టు చెబుతున్నారు. తమకు ఎదురుగా కనిపిస్తున్న, డ్యామేజ్ చేస్తున్న శత్రువుతో ఏ ఆయుధంతో పోరాడాలో తెలియక మాజీ ఎమ్మెల్యేలు తలలు పట్టుకుంటున్నట్టు సమాచారం.వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను కూడా బరిలో దిగబోతున్నానని, బీఆర్ఎస్ తరపున పోటీ చేసేది నేనే పార్టీ ముఖ్యుల ఆశీస్సులు నాకే ఉన్నాయంటూ సదరు ద్వితీయ శ్రేణి నాయకులు చేసుకుంటున్న ప్రచారం మాజీ ఎమ్మెల్యేలకు అస్సలు మింగుడు పడ్డం లేదట. ఇంకొందరైతేకీలక నేతల దగ్గర ఆ విషయాన్ని ఓపెన్గానే మాట్లాడుతున్నట్టు తెలిసింది. కేవలం మాటలతో ఆపకుండా అదే ఎమోషన్ను కంటిన్యూ చేస్తూ సోషల్ మీడియాలో కూడా వరస పోస్టులు పెట్టి క్యాడర్ను సైతం అయోమయానికి గురి చేస్తున్నారట. దీంతో ఈ ముళ్ళు మాజీ ఎమ్మెల్యేలకు గట్టిగానే గుచ్చుకుంటున్నాయని అంటున్నారు.

సదరు నేతల సోషల్ మీడియా పోస్టులపై ఎలా నిలదీయాలి. ఎవర్ని అడగాలి, ఇంకెవరిని కడిగిపారేయాలో అర్థం కాక తలలు బాదుకుంటున్నారట సీనియర్స్. ఓ మాజీ మంత్రి పీఏ.. తన సొంత నియోజకవర్గంతో పాటు పక్కన ఉన్న మరో నియోజకవర్గంలో కూడా కర్ఫీఫ్ వేసి అందుకు అనుగుణంగా క్యాడర్ను కలుపుకుని కార్యక్రమాలు చేయడం పార్టీలో చర్చనీయాంశంగా మారింది.

నియోజకవర్గాల పునర్విభజన జరిగితే తనకు ఫ్యూచర్ ఉంటుందన్నట్టు సదరు పీఏ పొలిటికల్ స్టెప్స్ వేస్తుండటం ఓ మాజీ ఎమ్మెల్యేను పరేషాన్ చేస్తోందట. ఈ మొత్తం ఎపిసోడ్లో తనకు తన బాస్ అయిన మాజీ మంత్రి ఆశీస్సులు ఉన్నాయని ఆ పీఏ గులాబీ వర్గాలకు చెబుతుండటం ఇంకా మంట పుట్టిస్తోందట. ఇక ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గం దేవరకొండలో ప్రజారాజ్యం నుండి గతంలో ఎమ్మెల్యేగా పోటీ చేసిన నేత బీఆర్ఎస్ నేతలతో కలిసి తిరుగుతూ పెద్ద ఎత్తున క్యాడర్ కోసం, జనం కోసం ఖర్చు చేస్తున్నారట మరొకాయన. తనకు కేటీఆర్ ఆశీస్సులు ఉన్నాయని చెప్పుకుంటూ తిరుగుతున్నట్టు తెలుస్తోంది. మరోవైపు మునుగోడు నియోజకవర్గానికి చెందిన రియల్టర్ ఒకరు బెంగళూరులో బాగా సంపాదించి స్థానికంగా తన తల్లిపేరిట ఫౌండేష్ ఏర్పాటు చేసిగుడికి, బడికి, అభివృద్ధికి నిధులు ఇస్తూనే ఉన్నారు. ఆయన తాజాగా సాగునీటి సాధన పోరాటానికి సిద్ధం కావడం, ప్రభుత్వ ఆసుపత్రుల కోసం ప్రజలతో కలిసి రోడ్డెక్కి పోరాటం చేస్తుండటం.. అందుకు గులాబీనేతలను కలుపుకుని వెళ్ళడం నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది.

సదరు సామాజిక సేవకుడు ఇక గులాబీ తీర్థం పుచ్చుకోవడమే తరువాయి అన్నట్లుగా యాక్టీవిటీ ఉండం స్థానిక మాజీ ఎమ్మెల్యేకి కంటిమీద కునుకు లేకుండా చేస్తోందట. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో కూడా ఓ రియల్టర్ తమ ఫౌండేషన్ కార్యకలాపాల స్పీడ్ మళ్లీ పెంచినట్టు చెబుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో టికెట్ ఆశించినప్పటికీ.. సిట్టింగ్లకే ఇవ్వడంతో వెనక్కి తగ్గిన వ్యాపారి కాంగ్రెస్కు మద్దతిచ్చారు. తాజాగా మనసుమార్చుకుని బీఆర్ఎస్ కీలక నేతలతో సఖ్యతగా తిరుగుతూ నియోజకర్గంలో తన ఫౌండేషన్ యాక్టీవిటిని పెంచారట. ఫౌండేషన్ పేరుతో యువత, నిరుద్యోగులకు దగ్గర అవుతున్నారట.

వచ్చే ఎన్నికలను బేస్ చేసుకుని ప్రజలకు దగ్గరయ్యేందుకు ప్రయత్నాలు చేస్తున్నారట. ఇప్పటికే ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుండగా గులాబీ పార్టీలో చురుకుకైన పాత్ర పోషించేందుకు సదరు రియల్టర్ తెర వెనుక ప్రయత్నాలు చేస్తుండటం మాజీ ఎమ్మెల్యే గుండెల్లో గుబులు రేపుతోందట.. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేల్లో ఒకరిద్దరు మినహా మిగతా వాళ్ళు ప్రజాక్షేత్రంలో, క్యాడర్ కోసం తిరగడం ఎప్పుడో మానేశారని, క్షేత్ర స్థాయిలో కార్యకర్తలకు కూడా దూరంగా ఉంటున్నారనే అభిప్రాయం గులాబీ దళంలో చాలా కాలంగా ఉంది. అందుకే సొంత పార్టీ నేతలు కొందరు, కొత్తవాళ్ళు మరికొందరు గులాబీ గూటికి ఎంట్రీ ఇచ్చేందుకు అడుగులువేస్తున్నారని చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే లాభం లేదంటూ గుర్తు చేస్తున్నారు పొలిటికల్ పరిశీలకులు.

సమర్థవంత పాలనే సర్కార్ లక్ష్యం : మంత్రి పొంగులేటి

పెండింగ్ సమస్యల పరిష్కారం.. ప్రజలకు మరింత ప్రభుత్వ సేవలు

9 ఉమ్మడి జిల్లాల్లో సమీక్షలు పూర్తి.. నేడు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సమావేశం



హైదరాబాద్, నవంబర్ 3, మనం ప్రతినిధి : సమర్థవంత పాలనే సర్కార్ లక్ష్యం అని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. పెండింగ్ సమస్యల పరిష్కారంతో పాటు ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింతగా అందిచేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు. 9 ఉమ్మడి జిల్లాల్లో సమీక్షలు పూర్తయ్యాయని, దీంతో దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపడం, క్షేత్రస్థాయి పాలనను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. రెవెన్యూ, హౌసింగ్, భూ సర్వే శాఖలకు సంబంధించిన అంశాలకు క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటి పరిష్కారానికి సమన్వయంతో చర్యలు తీసుకునే ఉద్దేశంతో జిల్లా స్థాయి సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో సమీక్షలు పూర్తి చేసినట్లు తెలిపారు.

ఇందులో భాగంగా బుధవారం నాడు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని షామీర్ పేటలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశానికి సంబంధిత శాఖల అధికారులు, జిల్లా మంత్రులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, ఇన్చార్జి మంత్రులు పాల్గొననున్నారు. రెవెన్యూ సమస్యలు, గృహ నిర్మాణ పథకాల అమలు, భూ సర్వే పురోగతితోపాటు ప్రజలకు అందుతున్న సేవలపై సమగ్రంగా సమీక్షించనున్నారు. గత ఏప్రిల్, మే నెలల్లో రాజధాని వేదికగా రాష్ట్రస్థాయిలో నిర్వహించిన సమావేశాల్లో ఉమ్మడి జిల్లాల వారీగా శాఖల పనితీరు, సమస్యల పరిష్కారంపై చర్చించినట్లు మంత్రి తెలిపారు. ఆయా సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలు, క్షేత్రస్థాయిలో సాధించిన పురోగతి, ఇంకా పరిష్కారం కావాల్సిన సమస్యలపై ప్రస్తుత సమీక్షల్లో ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. సమీక్షల లక్ష్యం సమస్యలను గుర్తించడమే కాదు.. వాటికి పరిష్కారం చూపడం. అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండేలా, శాఖల మధ్య సమన్వయంతో పనులు వేగవంతమయ్యేలా ఈ సమావేశాలు దోహదపడతాయని మంత్రి తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

అషాబరిలో బీఎస్ఎఫ్ సిబ్బందిపై దాడి

- తొమ్మిది మంది అరెస్టు



అగర్తలా , నవంబర్ 3: త్రిపురలోని ఆశాబరి ప్రాంతంలో ముగ్గురు బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ సిబ్బందిపై జరిగిన దాడికి సంబంధించి తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బిజోయ్ దెబ్బర్మ మంగళవారం తెలిపారు. పరారీలో ఉన్న మిగిలిన నిందితులను కూడా పట్టుకుని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. భద్రతా సిబ్బందిపై జరిగిన దాడిని దెబ్బర్మ తీవ్రంగా ఖండించారు. రాత్రంతా నిర్వహించిన ఆపరేషన్లో తొమ్మిది మందిని అరెస్టు చేశామని, వీరిని మంగళవారం కోర్టులో హాజరుపరుస్తామని ఆయన చెప్పారు. 'దేశ భద్రతను కాపాడే వారిపై కొందరు గ్రామస్థులు చేసిన దాడి అత్యంత సిగ్గుచేటు, దీనిని మేము ఖండిస్తున్నాము. ఇప్పటికే కేసు నమోదు చేశాం. రాత్రంతా చేపట్టిన ఆపరేషన్లో మొత్తం తొమ్మిది మందిని అరెస్టు చేశాము. వీరిని ఈరోజు కోర్టులో హాజరుపరుస్తాం. ఈ ఘటనలో ప్రమేయం ఉన్న మరెవరినీ వదిలిపెట్టబోం; వారందరినీ చట్టం ముందు నిలబెట్టి, శిక్ష పడేలా చూస్తాం' అని ఎస్పీ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి మరియు హోం శాఖ కఠిన చర్యలు తీసుకోవాలని కఠిన ఆదేశాలు జారీ చేశారని, అలాగే డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (స్వయంగా దర్యాప్తును పర్యవేక్షిస్తున్నారని ఆయన తెలిపారు. 'మా ముఖ్యమంత్రి మరియు హోం శాఖ అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాయి. మా డీజీపీ కూడా తగిన సూచనలు ఇవ్వడమే కాకుండా, దర్యాప్తును స్వయంగా పర్యవేక్షిస్తున్నారు' అని ఆయన పేర్కొన్నారు. బీఎస్ఎఫ్ ఇన్స్పెక్టర్ జనరల్ ఆ ప్రాంతానికి చేరుకుని, పోలీసు అధికారులతో సమావేశమయ్యారని దెబ్బర్మ తెలిపారు. పరారీలో ఉన్న నిందితులను పట్టుకుని, వారిని కోర్టు ముందు హాజరుపరిచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన చెప్పారు. 'బీఎస్ఎఫ్ ఐజీ కూడా ఇక్కడికి చేరుకుని మాతో సమావేశమయ్యారు. ప్రస్తుతం పరారీలో ఉన్న నిందితులను వీలైనంత త్వరగా పట్టుకుని, కోర్టు ముందు హాజరుపరచాల్సి ఉంది' అని ఆయన అన్నారు. త్రిపురలోని బాక్సానగర్ పరిధిలో ఉన్న ఆశాబరి ప్రాంతంలో, సోమవారం ఉదయం దుండగుల బృందం ముగ్గురు బీఎస్ఎఫ్ సిబ్బందిపై దాడి చేయడంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. దాడి చేసిన వారు, గాయపడిన సిబ్బంది వద్ద ఉన్న ఆయుధాలను లాక్కోవడానికి ప్రయత్నించడమే కాకుండా, ప్రభుత్వ వాహనాన్ని కూడా ధ్వంసం చేశారు. దీనికి ముందు, ఈ దాడికి సంబంధించి ఎనిమిది మంది నిందితులను అరెస్టు చేసినట్లు ముఖ్యమంత్రి మాణిక్ సాహా తెలిపారు. 'ఎక్స్ వేదికగా స్పందించిన ఆయన, ఈ ఘటనలో ప్రమేయం ఉన్న వారందరినీ చట్టం ముందు నిలబెడతామని, కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. 'బాక్సానగర్లోని ఆశాబరి ప్రాంతంలో బీఎస్ఎఫ్ సిబ్బందిపై జరిగిన దాడికి సంబంధించి ఎనిమిది మందిని అరెస్టు చేశాం. ఇందులో ప్రమేయం ఉన్న వారందరినీ చట్టం ముందు నిలబెట్టి, కఠిన చర్యలు తీసుకుంటాం. మన భద్రతా సిబ్బందిపై హింసను ఏమాత్రం సహించేది లేదు' అని సాహా పేర్కొన్నారు. ఈ దాడిని ముఖ్యమంత్రి తీవ్రంగా ఖండించారు. బాధ్యులపై త్వరితగతిన కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు.

రాహుల్ పై అస్సాం సీఎం వ్యంగ్యాస్త్రాలు



గౌహతి, నవంబర్ 3: ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమ్మా భారత కూటమి ప్రవేశపెట్టిన ప్రతీకాత్మక అభిశంసన తీర్మానంపై అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ మంగళవారం లోక్సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై వ్యంగ్యంగా విమర్శించారు. గాంధీ ఒక బూటకపు పార్లమెంటులో ప్రధానమంత్రి కాగలరని, కానీ అసలైన పార్లమెంటులో నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా కొనసాగుతారని ఆయన అన్నారు. ప్రతిపక్షం చేపట్టిన ప్రతీకాత్మక బహిరంగ అభిశంసన కార్యక్రమం, ఆ తర్వాత ఓటర్ల జాబితాలలో జరిగిన అవకతవకలకు వ్యతిరేకంగా వారు నిర్వహించిన ర్యాలీపై స్పందిస్తూ, రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడానికి కాంగ్రెస్ నాయకులు అనేకసార్లు ప్రయత్నించారని, కానీ ఆ లక్ష్యాన్ని సాధించడంలో విఫలమయ్యారని శర్మ అన్నారు. 'సోనియాజీ రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయాలనుకున్నారు, అందుకు ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. కానీ ఏ ప్రయత్నాలూ ఫలించకపోవడంతో, ఖర్గేజీ నివాసం ఆవరణలో ఒక నమూనా పార్లమెంటును నిర్వహించి, అందులో ఆయన (రాహుల్ గాంధీ) ప్రధానమంత్రి అయ్యారు. వాస్తవం ఏమిటంటే - నమూనా పార్లమెంటులో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారు, పార్లమెంటులో మోదీజీ ప్రధానమంత్రిగా ఉంటారు,' అని శర్మ అన్నారు. ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ, నిజమైన ఓటర్ల పేర్లను తొలగించారన్న ఆరోపణలపై బీజేపీ, ఇండియా కూటమి మధ్య రాజకీయ ఘర్షణల నడుమ అస్సాం ముఖ్యమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు.


ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వనున్న భారత్?

ఢిల్లీ, మనంబ్యూరో: 2036 ఒలింపిక్స్ పోటీలకు ఆతిథ్యం ఇవ్వాలని ఆశపడుతున్న భారత్ కల నెరవేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2024 ఒలింపిక్స్ను పారిస్ ఆతిథ్యం ఇవ్వగా 2028 సమ్మర్ ఒలింపిక్స్ పోటీలు లాస్ ఏంజెల్స్లో జరగబోతున్నాయి. 2032 ఒలింపిక్స్ను ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్ నగరం ఆతిథ్యం ఇవ్వనుంది. 2036 ఒలింపిక్స్ ఆతిథ్య హక్కుల కోసం ఏడు దేశాలు పోటీలో ఉన్నాయి. 2036 ఒలింపిక్స్ క్రీడా సంబరాలకు ఆతిథ్యమిచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్న 7 దేశాల్లో భారత్ కూడా ఉందని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐవోసీ) ధృవీకరించింది.

భారత్తో పాటు పోటీలో మరో 6 దేశాలు...

'2036 ఒలింపిక్స్ పోటీల నిర్వహణ కోసం భారత్తో పాటు ఖతార్, దక్షిణాఫ్రికా, జర్మనీ, హంగేరీ, టర్కీ, దక్షిణ కొరియా దేశాలు పోటీలో ఉన్నాయి. అక్టోబర్ 6న ఒలింపిక్స్ నిర్వహణకు ఆసక్తి కనబరిచిన దేశాల పేర్లను బహిరంగంగా ప్రకటించాం. 2036 ఒలింపిక్స్ నిర్వహణకు సంబంధించిన చర్చల్లో పాల్గొనేందుకు ఇతర జాతీయ ఒలింపిక్ కమిటీలు కూడా ఆసక్తి వ్యక్తం చేయడానికి గడువు విధించింది. కొత్తగా ఏ దేశం కూడా ఒలింపిక్స్ నిర్వహణ కోసం ముందుకు రాలేదు.' అంటూ తాజా ప్రకటనలో తెలియచేసింది ఐవోసీ. 2027 మార్చిలో పోటీలో నిలిచిన దేశాల్లో ఒలింపిక్స్ నిర్వహణపై సాధ్యాసాధ్యాలను అంచనా వేస్తారు. ఐవోసీ ఎగ్జిక్యూటివ్ బోర్డు, 2036 ఒలింపిక్స్ కోసం వ్యూహాత్మక చర్చలను ప్రారంభిస్తుంది. 2028 డిసెంబర్లో ఎగ్జిక్యూటివ్ బోర్డు ఎంపిక చేసిన కొంతమంది ప్రాధాన్య ఆతిథ్య దేశాలతో తదుపరి దశ చర్చలను ప్రారంభిస్తారు.

వణుకుతున్న ఏపీ



విజయవాడ, మనంప్రత్యేక ప్రతినిధి: తీవ్ర తుఫాన్ 'మురసు' మంగళవారం ఉదయం తీరం దాటింది. దక్షిణ కోస్తాంధ్రలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. గంటకు 100 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. గడిచిన ఆరు గంటల్లో దక్షిణ కోస్తాంధ్రపై కేంద్రీకృతమై ఉన్న ఈ తీవ్ర తుఫాన్. గంటకు 8 కిలోమీటర్ల వేగంతో ఉత్తర-ఉత్తర పశ్చిమ దిశగా పయనించింది. మంగళవారం ఉదయం అదే ప్రాంతంలో స్థిరపడి ఉంది. ఈ తీవ్ర తుఫాన్ మరింతగా ఉత్తర - ఉత్తర పశ్చిమ దిశగా కదులుతూ మంగళవారం మధ్యాహ్నానికి క్రమంగా బలహీనపడి సాధారణ తుపానుగా మారే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. ఆ సమయంలో తీరం వెంట గంటకు 90 కిలోమీటర్ల నుంచి గరిష్టంగా 100 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఆ తర్వాత మంగళవారం అర్ధరాత్రి నాటికి ఇది మరింత బలహీనపడి 'తీవ్ర వాయుగుండం'గా మారనుందని. ఆ సమయంలో గంటకు 75 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని అధికారులు అంచనా వేశారు.

యాసంగిలో వరికి ప్రత్యామ్నాయంగా

ఆరుతడి పంటలు సాగు చేయాలి

- నీటి లభ్యతను బట్టి పంటల ఎంపికపై రైతులకు అవగాహన కల్పించాలి
- ఎల్‌నినో ప్రభావం, తగ్గుతున్న నీటి నిల్వలతో అప్రమత్తం
- గ్రామ, మండల స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు
- బిందు సేద్యం, విత్తనాలపై ప్రభుత్వ రాయితీలు రైతులకు అందించాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



కామారెడ్డి, నవంబర్ 3 (మనం బ్యూరో): రాబోయే యాసంగి (రబీ) సీజన్లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని వరి సాగును తగ్గించి, ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం, ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తగ్గడం, భూగర్భ జలమట్టాలు పడిపోతున్న నేపథ్యంలో రైతులు ముందస్తు ప్రణాళికతో పంటలను ఎంపిక చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు.

మంగళవారం కలెక్టరేట్లో వ్యవసాయ, నీటిపారుదల, ఉద్యానవన తదితర శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో యాసంగి పంటల ప్రణాళిక, నీటి లభ్యత, ప్రత్యామ్నాయ పంటల సాగుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అధిక నీరు అవసరమయ్యే వరికి బదులుగా తక్కువ నీటితో మెరుగైన దిగుబడి, ఆదాయం పొందగలిగే పంటల వైపు రైతులను మళ్లించాలని సూచించారు.

చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం.

పెసర, మినుము, కంది వంటి పప్పుధాన్యాలు, సూర్యకాంతి, వేరుశనగ, నువ్వులు వంటి నూనెగింజలు, జొన్న, సజ్జ, మొక్కజొన్న వంటి చిరుధాన్యాలతో పాటు కూరగాయల సాగును ప్రోత్సహించాలన్నారు.

గ్రామ, మండల స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి పంట మార్పిడి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని చెప్పారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, పంచాయతీ అధికారులు సమన్వయంతో పనిచేసి క్షేత్రస్థాయిలో రైతులకు మార్గదర్శనం చేయాలని ఆదేశించారు. ఆయిల్పామ్, కూరగాయల వంటి ఉద్యాన పంటల సాగుతో తక్కువ నీటిని వినియోగిస్తూ మెరుగైన ఆదాయం పొందే అవకాశాలున్నాయని తెలిపారు.

బిందు సేద్యం, విత్తనాలపై ప్రభుత్వ రాయితీలు.

బిందు సేద్య పరికరాలు, విత్తనాలపై ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను అర్హులైన రైతులకు నిబంధనల ప్రకారం అందించాలని ఉద్యానవన శాఖ అధికారులకు సూచించారు. సాగుభూముల సంరక్షణ కోసం అమలు చేస్తున్న 'భూమి బచావో అభియాన్'తో పాటు ఇతర ప్రభుత్వ పథకాలు, రాయితీల వివరాలను ప్రతి రైతుకు చేరవేయాలన్నారు. పశువులకు పశుగ్రాస కొరత ఏర్పడకుండా పశుగ్రాస పంటల సాగును ప్రోత్సహించాలని చెప్పారు. రైతు బీమా పరిహారం పొందడంలో కుటుంబ సభ్యులకు ఇబ్బందులు కలగకుండా మరణ ధ్రువీకరణ, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలను తహసీల్దార్లు జాప్యం లేకుండా మంజూరు చేయాలని ఆదేశించారు.

నీటి లభ్యతను బట్టి పంటల ఎంపిక చేసుకోవాలి.

నీటి వనరులు పరిమితంగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు పరిస్థితులను అంచనా వేసుకొని పంటల ఎంపిక చేసుకోవాలని, తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకొని ఆర్థిక నష్టాలను నివారించుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి జ్యోతి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి సౌజన్య, డీఆర్డీఓ దామోదర్‌రెడ్డి, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఏడీఏలు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్హులకుకే మోడల్ కాలనీ

ఇండ్ల మంజూరు చేయాలి

- మంత్రి ఉత్తమ్ సహకారంతో పట్టణ సమస్యలు పరిష్కారానికి కృషిచేస్తా
- మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్



హుజూర్ నగర్, నవంబర్ 3 (మనం న్యూస్): పట్టణంలో అర్హులకు మాత్రమే మోడల్ కాలనీలో ఇండ్లు మంజూరు చేయాలని హుజూర్ నగర్ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ కోరారు. మంగళవారం పట్టణంలోని ఆర్డిఓ కార్యాలయంలో ఆర్డీవో శ్రీనివాస్ కుమరియు కౌన్సిలర్లు తో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు ప్రకటించిన 1434 మంది అర్హుల జాబితాతో పాటు అర్హుల జాబితాను కూడా విడుదల చేయడంపై చర్చించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు అర్హులకు మాత్రమే ఇండ్లు మోడల్ కాలనీలో అందించాలని కోరారు. అర్హత కలిగిన వారికిమరో అవకాశం కల్పించాలని ఆర్డీవోను మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ కోరారు. ప్రభుత్వం పేదల సంక్షేమానికి పాటుపడుతున్నన్నారు. నిలువ నీడలేని పేదలకు గూడు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. మంత్రి కుమార్ రెడ్డి సహకారంతో పట్టణ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కోతి సంపత్ రెడ్డి దొంతి రెడ్డి పద్మా రెడ్డి పులిచింతల వెంకటరెడ్డి జక్కుల మల్లయ్య యాదవ్ బెల్లంకొండ అమర్ గౌడ్ వల్లపు దాస్ కృష్ణ కోడి ఉపేందర్ యాదవ్ దగ్గుపాటి బాబురావు తదితరులు ఉన్నారు.

36వ జాతీయ మహాసభలను

విజయవంతం చేయాలి

- జాతీయ మహాసభలను విజయవంతం చేయాలి
- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లు నాగార్జున రెడ్డి

తుంగతుర్తి: అక్టోబర్ 3, (మనం న్యూస్): నల్గొండలో ఈనెల 15 నుండి 18 వరకు జరిగే అఖిల భారత రైతు సంఘం 36వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లు నాగార్జున రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం తుంగతుర్తి మండల పరిధిలోని అన్నారం గ్రామంలో మహాసభల ప్రచార కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.ఈ మేరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాల పురిటిగడ్డ అయిన నల్గొండ జిల్లా కేంద్రంలో జరుగుతున్న ఈ మహాసభలు చారిత్రాత్మకమైనవని తెలిపారు. నవంబర్ 15న నిర్వహించే భారీ బహిరంగ సభకు పార్టీలకు అతీతంగా రైతులు,వ్యవసాయ కార్మికులు,అన్ని అనుబంధ సంఘాల ప్రజలు వేలాదిగా తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.రైతాంగ హక్కులు, వ్యవసాయ రంగ పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా సాగిన సమరశీల ఉద్యమాల్లో ఏఐకేఎస్ ప్రముఖ పాత్ర పోషిస్తుందని కొనియాడారు.కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగా



ఢిల్లీ సరిహద్దుల్లో 13 నెలల పాటు సాగిన చారిత్రాత్మక రైతు ఉద్యమంలో కిసాన్ సభ కీలక పాత్ర పోషించిందని గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా 1.58 కోట్లకు పైగా సభ్యత్వంతో అఖిల భారత కిసాన్ సభ ప్రపంచంలోనే అతిపెద్ద రైతాంగ ఉద్యమ సంస్థగా కొనసాగుతుందన్నారు. సామ్రాజ్యవాదం, భూస్వామ్యానికి వ్యతిరేకంగా సాగించిన చారిత్రాత్మక పోరాటాల వారసత్వాన్ని కొనసాగిస్తూ రైతాంగ హక్కుల కోసం నిరంతరం పోరాడుతుందన్నారు. వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే కుట్రలపై రైతులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.అప్పుల ఊబిలో ఉన్న రైతులకు ఏకకాలంలో పూర్తి రుణమాఫీ చేసి,నూతన రుణాలు అందించాలని కోరారు.వ్యవసాయానికి నాణ్యమైన ఉచిత విద్యుత్ తో పాటు సకాలంలో ఎరువులు,విత్తనాలను సబ్సిడీపై సరఫరా చేయాలని కోరారు.ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులకు తక్షణమే పంట భీమా నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.రైతాంగ వ్యతిరేక విధానాలపై చర్చించి,భావి ఉద్యమ కార్యచరణ రూపొందించడానికి ఈ మహాసభలు వేదిక కానున్నాయని నాగార్జున రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, సిపిఎం మండల కార్యదర్శి బుర్ర శ్రీనివాస్,రైతు సంఘం జిల్లా నాయకులు పల్లా సుదర్శన్, సిపిఎం గ్రామ కార్యదర్శి పాలబిందెల జానయ్య,పార్టీ సీనియర్ నాయకులు బంధు సోమయ్య,కందుకూరి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మురసు తుఫాన్ ఎఫెక్ట్ పేట

జిల్లాకు భారీ వర్ష సూచన

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు
- ప్రయాణాలు వాయిదా వేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యాపేట, నవంబర్ 03 (మనం ప్రతినిధి): మురసు తుఫాన్ ప్రభావంతో రాబోయే కొన్ని గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హెచ్చరించారు. సూర్యాపేట జిల్లావ్యాప్తంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా కోదాడ, హుజూర్‌నగర్ డివిజన్లలో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు.వర్షాల నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని సూచించారు. అవసరం లేని ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని కోరారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, అధికారుల సూచనలను అనుసరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజు, డిపిఓ యాదగిరి, డిఎస్ఓ మోహనబాబు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నాన్న నేను వత్తా.. అమ్మ ఇంటికి తీసుకుపో



హైదరాబాద్, నవంబర్ 3(మనంన్యూస్): 'నాన్న నేను వత్తా.. నాకు భయమేస్తుంది. అమ్మ ఇంటికి తీసుపో...' అంటూ ఓ మూడేళ్ల పసికందు తన దత్తత తండ్రి మెడను గట్టిగా చుట్టేసుకుని కన్నీరుమున్నీరైన ఘటన జగిత్యాలలో ప్రతి ఒక్కరినీ తీవ్రంగా కలచివేసింది. కన్నప్రేమ కంటే మిన్నగా చూసుకున్న పెంపుడు తల్లిదండ్రుల నుంచి మూడేళ్ల తర్వాత బిడ్డను వేరు చేయడంతో ఆ కుటుంబం తీవ్ర మానసిక వేదనను అనుభవించింది.

పేగుబంధాన్ని మించిన అనుబంధం..

జగిత్యాలకు చెందిన సరిత, శ్రీనివాస్ దంపతులకు పిల్లలు లేకపోవడంతో మూడేళ్ల కిందట ఒక పసికందును దత్తత తీసుకున్నారు. పుట్టిన ఐదు రోజులకే తల్లి చనిపోయిన ఆ పసిపాపను చేరదీసి. అహర్నిశలు కంటికి రెప్పలా చూసుకున్నారు. కన్న బిడ్డ కంటే ఎక్కువగా ప్రేమను పంచడంతో ఆ చిన్నారితో వారికి పేగుబంధానికి మించిన అనుబంధం ఏర్పడింది.అయితే, మూడేళ్లపాటు ఎంతో ముద్దుగా పెంచుకున్న ఆ చిన్నారి దత్తత చట్టబద్ధంగా జరగలేదంటూ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) అధికారులు ఇటీవల ఆ దంపతులకు షాక్ ఇచ్చారు.

నియమనిబంధనలు పాటించలేదనే కారణంతో చిన్నారిని తల్లిదండ్రుల నుంచి బలవంతంగా వేరు చేసి హైదరాబాద్లోని శిశు విహార్కు తరలించారు.అధికారుల చర్యతో తీవ్ర ఆవేదనకు గురైన సరిత, శ్రీనివాస్ దంపతులు వెంటనే న్యాయపోరాటానికి దిగారు. తమ బిడ్డను తమకే అప్పగించాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. కేసును విచారించిన హైకోర్టు.. చిన్నారిని వెంటనే ఆ పెంపుడు తల్లిదండ్రులకే అప్పగించాలని అక్టోబర్ 16న కీలక ఉత్తర్వులు జారీ చేసింది.

అమలులో జాప్యం..!

ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ. అధికారులు వాటిని అమలు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించారని బాధిత దంపతులు ఆరోపించారు. కోర్టు తీర్పు వచ్చినా బిడ్డను అప్పగించకపోవడంతో ఆవేదన చెందిన దంపతులు తమ చిన్నారిని చూసేందుకు శిశు విహార్కు వెళ్లారు.ఆ సమయంలో దత్తత తల్లిదండ్రులను చూడగానే ఆ మూడేళ్ల బాలుడు 'డాడీ నేను వత్తా.. నాకు భయమైతంది ' అని గుండెలవిసేలా రోదించాడు. తండ్రి మెడను పట్టుకుని ఏడ్చిన ఆ దృశ్యం అక్కడున్న వారందరి చేత కన్నీళ్లు పెట్టించింది. దంపతులు కూడా తమ బిడ్డను గుండెలకు హత్తుకుని భావోద్వేగానికి గురయ్యారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఆ దృశ్యాలను చూసిన ప్రతి ఒక్కరూ చలించిపోయారు.

హైకోర్టు తీర్పును అమలు చేయకుండా సీడబ్ల్యూసీ అధికారులు జాప్యం చేస్తున్నారంటూ సరిత, శ్రీనివాస్ దంపతులు సోమవారం జగిత్యాల కలెక్టరేట్లో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమానికి వచ్చారు. జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ను కలిసి తమ ఆవేదనను తెలియజేస్తూ వినతిపత్రం అందజేశారు.

ఈ ఘటనపై కలెక్టర్ ఆదేశాల నేపథ్యంలో సోమవారం రాత్రి ఆ బాలుడిని తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. దీంతో వారు కన్నీటిపర్యంతమవుతూ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

చిన్నారి తల్లిదండ్రులు మాట్లాడుతూహర్షం వ్యక్తం చేశారు. న్యాయం గెలిచింది..మానవత్వం నిలిచింది. బాబును మా దగ్గర లేకుండా చేసి 2 నెలలు అయింది. బాబు లేకుండా మేము చనిపోతామేమో అనుకున్నాం. మాకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు అని చెప్పారు.

నీటి నాణ్యత పరీక్షలు,

శుద్ధి విధానం పట్ల సంతృప్తి

- జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పెషల్ మానిటర్ అనీవేష్ భట్టాచార్య
- జిల్లా నీటి నాణ్యత ప్రయోగశాల, మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రం పరిశీలన



నల్లగొండ, నవంబర్ 3 (మనం ప్రతినిధి): నల్గొండ జిల్లాలో ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందించేందుకు చేపడుతున్న నీటి శుద్ధి ప్రక్రియలు, నీటి నాణ్యత పరీక్షల నిర్వహణ పట్ల జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పెషల్ మానిటర్ డాక్టర్ అనిమేష్ భట్టాచార్య సంతృప్తి వ్యక్తం చేశారు. మంగళ వారం ఆయన పానగల్లు ప్రాంతంలో మిషన్ భగీరథ నీట్ శుద్ధ కేంద్రాన్ని, జిల్లా నీటి నాణ్యత ప్రయోగశాల (ఎన్ఏబీఎల్ ల్యాబ్)ను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రయోగశాలలో నిర్వహిస్తున్న రసాయనిక, మైక్రోబయోలాజికల్ పరీక్షల వివరాలను సిబ్బంది ద్వారా అడిగి తెలుసుకున్నారు. పరీక్షలకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు.పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల నుంచి సేకరించిన నీటి నమూనాల పరీక్షా నివేదికలను తనిఖీ చేశారు. ప్రయోగశాలలో పరీక్షలు నిర్వహిస్తున్న విధానం, నాణ్యత ప్రమాణాల అమలుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పానగల్లోని ఉదయసముద్రం వద్ద ఉన్న మిషన్ భగీరథ ఇంటేక్ వెల్, 35 ఎంఎల్డీ నీటి శుద్ధి కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ నీటిని శుద్ధి చేస్తున్న విధానం, ప్రయోగశాలలో నిర్వహిస్తున్న పరీక్షలు, నిర్వహణ రిజిస్టర్లు, ప్రజలకు నీటిని సరఫరా చేస్తున్న విధానం గురించి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.నీటి శుద్ధి ప్రక్రియను, నాణ్యత పరీక్షలను పరిశీలించిన ఆయన ఇక్కడ అమలు చేస్తున్న విధానాలను అభినందించారు. ఇదే తరహా నీటి శుద్ధి, నాణ్యత పర్యవేక్షణ విధానాలను ఇతర రాష్ట్రాల్లో కూడా అమలు చేసేలా చర్యలు తీసుకుంటే మంచిదని అభిప్రాయపడ్డారు. మిషన్ భగీరథ ఎస్.ఈ. నాగేశ్వరరావు , ఈ ఈ శాంతకుమారి, ఎఈఈ సంతోష్, ప్రయోగశాల ఇంచార్జీ పి. వీరారెడ్డి (డబ్ల్యూక్యూఎం కెమిస్ట్), బి. సుజాత (మైక్రోబయాలజిస్ట్), ఎస్. రేణుక (కెమిస్ట్), ప్రశాంతి, సత్యనారాయణ వెంట ఉన్నారు.

తెలంగాణ ఉద్యమకారుడి బలవన్మరణం

- ఉద్యమం చేసి బతుకు ఆగం చేసుకున్నా..సెల్ఫోన్లో సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య
- జనగామ జిల్లాలో అప్పుల బాధతో దారుణానికి పాల్పడ్డరంటున్న కుటుంబ సభ్యులు
- తెలంగాణ వచ్చిన ఉద్యమకారుల బతుకులు మారలేదు?.. నోట్‌లో లక్ష్మణ్ ఆవేదన
- మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 3, మనం ప్రతినిధి : తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న.. తెలంగాణ కార్యకర్త ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన జనగామ జిల్లాలో చోటుచేసుకుంది. బచ్చన్నపేట మండలం కొన్నె గ్రామానికి చెందిన వేముల లక్ష్మణ్ గౌడ్ (40), సోమవారం ఓ వ్యవసాయ క్షేత్రంలో చెట్టుకు ఉరివేసుకుని ఈ ఉదంతానికి పాల్పడ్డాడు. ప్రస్తుతం ఆయన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) డైరెక్టర్‌గా కూడా పనిచేస్తున్నారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు, బంధువులు, పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. గత కొంత కాలంగా లక్ష్మణ్ గౌడ్ తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిలో ఉన్నారని తెలిపారు. తెలంగాణ ఉద్యమం కోసం ఆ సమయంలో చేసిన అప్పులకు తోడు, ఇటీవలి కాలంలో ఒకదాని వెనుక ఒకటి వరుసగా పంట నష్టాలు రావడంతో ఆయన అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ఆయనకు నాలుగు ఎకరాల సొంత భూమి ఉండగా, మరో ఆరు ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారు. అయితే, పంటలు నష్టపోవడంతో బంధువులు, ప్రైవేట్ ఫైనాన్షియర్ల నుంచి తీసుకున్న రుణభారం, అప్పులు తీర్చాలంటూ తీవ్రమైన మాటలు, మరోవైపు ఆయనపై కొందరు వ్యక్తులు తెచ్చిన ఒత్తిడితోనే లక్ష్మణ్ ఆత్మహత్య చేసుకున్నారని భార్య స్వప్న పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఇక, ఆత్మహత్యకు ముందు లక్ష్మణ్ గౌడ్ తన సెల్ ఫోన్‌లో ఒక నోట్ కూడా రాశారు. 'తండ్రి కష్టపడి చదివిస్తే, ఉద్యమంలో పాల్గొని జీవితాన్ని పాడుచేసుకున్నాను. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఉద్యమకారుల బతుకులు మారలేదు'?.. అని అందులో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తన భార్య, ఇద్దరు పిల్లలకు క్షమాపణలు చెప్పారు. లక్ష్మణ్ గౌడ్ విద్యార్థి దశ నుంచే టీఆర్ఎస్ (ప్రస్తుత బీఆర్ఎస్) యువజన విభాగంలో పనిచేసి, ఆ తర్వాత జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. రాష్ట్ర సాధన కోసం పోరాడిన వ్యక్తి ఇలా అర్ధాంతరంగా తనువు చాలించడంపై స్థానికులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

ఎస్సై మధుకర్‌కు ఘన సన్మానం



మంగపేట, నవంబర్ 3,మనం ప్రతినిధి: ములుగు జిల్లా మంగపేట మండలానికి నూతనంగా సబ్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన మధుకర్ను మండల సమాచార హక్కు వికాస సమితి (ఎస్హెచ్వీఎస్) ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల ఆర్టీఐ అధ్యక్షుడు యర్రంగారి వీరన్నుమార్ ఎస్సై మధూకర్కు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూనెం రాంబాబు, బట్ట సుధీర్, తక్కళ్లపల్లి సతీష్, వీరగోని అఖిల్, నన్నెబోయిన సాంబయ్య, యర్రంగారి ప్రకాశ్, బట్ట సతీష్, నూతులకంటి ఈశ్వర్చంద్, ఇండ్ల నరసింహారావు, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

మంగపేట ఎస్సైగా మధుకర్



- మంగపేట ఆదివాసి ప్రజాసంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ సన్మానం

మంగపేట, నవంబర్ 3, మనం ప్రతినిధి: మంగపేట పోలీస్టేషన్ నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన మధుకర్ను మంగపేట మండల ఆదివాసి ప్రజాసంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై మధుకర్‌కు శుభాకాంక్షలు తెలియజేసి, మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ఆదివాసి ప్రజల సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు కార్యక్రమంలో ఆదివాసి ప్రజా సంఘాల జేఏసీ అధ్యక్షులు పొలేబోయిన ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి తాటి నాగరాజు, జేఏసి నాయకులు పునెం రాములు, తోలేం సుధాకర్, కొమరం రవి, ఈసం కృష్ణ, గొప్ప చంద్రకాంత్, ఆక తిరుమల రావు, తోలేం నరేష్,పునెం సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై మధుకర్‌కు జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ ఘన సన్మానం



మంగపేట, నవంబర్ 3,మనం ప్రతినిధి: మంగపేట పోలీస్‌స్టేషన్‌కు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై మధుకర్ను జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సైకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మంగపేట ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడంలో ఆయన మరింత విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కోడెల నరేష్, ప్రధాన కార్యదర్శి బండపల్లి రవి గౌడ్, ఉపాధ్యక్షులు పుల్లం శెట్టి అజయ్, గంగుల చంటి, వై. వీరన్నుమార్, కార్యదర్శులు పున్నెం భాస్కర్, గోలి నరేష్, నిమ్మల నరేష్, కోశాధికారి నూతలకంటి ఈశ్వర్చంద్, ప్రచార కార్యదర్శులు గగ్గూరి మహేష్, మహమ్మద్ ఖాజా పాషా, మామిళ్ల నాగరాజు, గౌరవ సలహాదారులు కోలగట్ల నరేష్రెడ్డి, చాదా మల్లయ్య, సిద్ధంశెట్టి కనకారావు, లిక్కి రమేష్, కార్యవర్గ సభ్యులు సాంబశివరావు, సతీష్, అనిల్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై మధుకర్‌కు ఘన సన్మానం



మంగపేట, నవంబర్ 3,మనం ప్రతినిధి: ములుగు జిల్లా మంగపేట మండలానికి నూతనంగా సబ్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన మధూకర్ను మండల సమాచార హక్కు వికాస సమితి (ఎస్హెచ్వీఎస్) ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల ఆర్టీఐ అధ్యక్షుడు యర్రంగారి వీరన్నుమార్ ఎస్సై మధూకర్కు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూనెం రాంబాబు, బట్ట సుధీర్, తక్కళ్లపల్లి సతీష్, వీరగోని అఖిల్, నన్నెబోయిన సాంబయ్య, యర్రంగారి ప్రకాశ్, బట్ట సతీష్, నూతులకంటి ఈశ్వర్చంద్, ఇండ్ల నరసింహారావు, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై మధుకర్‌కు జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ ఘన సన్మానం

మంగపేట, నవంబర్ 3,మనం ప్రతినిధి: మంగపేట పోలీస్‌స్టేషన్‌కు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై మధుకర్ను జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సైకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మంగపేట ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడంలో ఆయన మరింత విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కోడెల నరేష్, ప్రధాన కార్యదర్శి బండపల్లి రవి గౌడ్, ఉపాధ్యక్షులు పుల్లం శెట్టి అజయ్, గంగుల చంటి, వై. వీరన్నుమార్, కార్యదర్శులు పున్నెం భాస్కర్, గోలి నరేష్, నిమ్మల నరేష్, కోశాధికారి నూతలకంటి ఈశ్వర్చంద్, ప్రచార కార్యదర్శులు గగ్గూరి మహేష్, మహమ్మద్ ఖాజా పాషా, మామిళ్ల నాగరాజు, గౌరవ సలహాదారులు కోలగట్ల నరేష్రెడ్డి, చాదా మల్లయ్య, సిద్ధంశెట్టి కనకారావు, లిక్కి రమేష్, కార్యవర్గ సభ్యులు సాంబశివరావు, సతీష్, అనిల్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డ వివాహానికి రూ.15 వేల ఆర్థిక సాయం

ఏటూర్ నాగారం, నవంబర్ 3,మనం ప్రతినిధి: ఆర్థిక ఇబ్బందులతో కుమార్తె వివాహం నిర్వహించేందుకు ఇబ్బందులు పడుతున్న కుటుంబానికి బీఆర్ఎస్ నాయకులు కాకులమర్రి లక్ష్మణ్బాబు, ఏటూరునాగారం సర్పంచ్ కాకులమర్రి శ్రీలత దంపతులు అండగా నిలిచారు. ఏటూరునాగారానికి చెందిన ఎండీ అన్వర్ పాషా మేనకోడలి వివాహానికి రూ.15 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కష్టాల్లో ఉన్న కుటుంబానికి చేయూతనిచ్చి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలవడం అభినందనీయమని స్థానికులు, బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాకులమర్రి ప్రదీప్రావు, తాడూరి రఘు, ఉపసర్పంచ్ పర్వతాల ఎల్లయ్య, ఎస్కే అమ్ములుబేగం బాబా, కుమ్మరి చంద్రబాబు, జాడి భోజరావు, పెద్దబోయిన బాలకృష్ణ, లంబడిగూడెం సర్పంచ్ పోరిక సరిత శ్రీనివాస్, ఆకునూరి యశ్వంత్, గంప కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వారసత్వ కట్టడాల పరిరక్షణలో వాలంటీర్లు ముఖ్య భూమిక పోషించాలి

రామప్ప విశిష్టతపై విస్తృత అవగాహన కల్పించాలి

జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్ రావు



ములుగు, నవంబర్ 3,మనం ప్రతినిధి: వారసత్వ సంపద విశిష్టతను ప్రపంచానికి చాటడంలో, చారిత్రక కట్టడాల పరిరక్షణపై అవగాహన కల్పించడంలో వాలంటీర్లు ముఖ్య భూమిక పోషించాలని జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్ రావు అన్నారు. మంగళవారం వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన వరల్ హెరిటేజ్ వాలంటీర్ క్యాంప్-2026 ముగింపు కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పర్యాటక శాఖ నోడల్ అధికారి ధర్మనాయక్, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ప్రతినిధులు ప్రొఫెసర్ ఎం. పాండురంగారావు, శ్రీధర్ రావులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ చరిత్ర, పురావస్తు, వారసత్వ కట్టడాల సంరక్షణపై ఆసక్తితో శిక్షణకు హాజరైన వాలంటీర్లను అభినందించారు. రామప్ప దేవాలయ విశిష్టతను, శిక్షణలో తెలుసుకున్న అంశాలను మరింత మందికి తెలియజేయాలని సూచించారు. వారసత్వ కట్టడాల పరిరక్షణలో యువత చురుకైన పాత్ర పోషించాలని అన్నారు. పర్యాటక శాఖ నోడల్ అధికారి ధర్మనాయక్ మాట్లాడుతూ ఇటువంటి శిక్షణ శిబిరాలు యువతకు కెరీర్పరంగా ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. వివిధ ప్రాంతాల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, జీవనశైలిని తెలుసుకునేందుకు ఇవి అవకాశం కల్పిస్తాయన్నారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలను ఇతరులకు తెలియజేస్తూ కాకతీయుల కీర్తిని ప్రపంచానికి చాటేలా వాలంటీర్లు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ఇమ్మడి భాస్కర్, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ సభ్యులు శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ చల్లగొండ రాజు,పర్యాటక శాఖ గైడ్లు గోరంటల విజయ్ కుమార్, వెంకటేష్, రాష్ట్ర పురావస్తు శాఖ ఫోర్మన్ బాబు, టూరిస్ట్ పోలీసులు అరుణ్, భద్రు, సంబంధిత శాఖల సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

చేతికి వచ్చిన మిరప తోట ధ్వంసం

- భూమి వివాదంలో దారుణం



దుగ్గొండి నవంబర్ 03 మనం ప్రతినిధి: అప్పుడో ఇప్పుడో చేతికి వస్తుందనుకున్న మిరప తోట కాస్త భూమి వివాదంలో ధ్వంసమైన సంఘటన దుగ్గొండి మండల పరిధిలో స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...

మండలంలోని మధిర గ్రామానికి చెందిన కునమల్ల శ్రీనివాస్ అనే వ్యక్తి, వెంకటాపురం గ్రామ శివారులోని తన ఎకరం భూమిని 2025 జూన్ 27న హింగే మనోహర్ అనే వ్యక్తికి విక్రయించాడు. అయితే, ఒప్పందం ప్రకారం పూర్తి డబ్బులు చెల్లించకుండానే మనోహర్ ఆ భూమిలో మిరప పంట సాగు చేయడం ప్రారంభించాడు.

పూర్తిగా డబ్బులు చెల్లించే వరకు పంట వేయవద్దని శ్రీనివాస్ గతంలోనే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ, కొనుగోలు చేసిన వ్యక్తి తన మాటలను లెక్కచేయకుండా మిరప సాగు కొనసాగించాడని, ఈ క్రమంలోనే చేతికి వచ్చిన మిరప తోటను శ్రీనివాస్ ధ్వంసం చేసినట్లు సమాచారం.

మిరప తోట ధ్వంసం కావడంపై సమాచారం అందుకున్న పోలీసులు వెంకటాపురం శివారులోని ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ మహేందర్రెడ్డి తెలిపారు .

బాధితుడిని పరామర్శ



ఏటూర్ నాగారం, నవంబర్ 3, మనం ప్రతినిధి: ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్బాబును కమలాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. ఇటీవల పార్టీ నాయకులు, కార్యకర్తలకు తన ఇంట్లో విందు ఏర్పాటు చేసే క్రమంలో ఏర్పాట్లు చేస్తుండగా కాలుకు గాయమై ఫ్రాక్చర్ కావడంతో ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో స్వగ్రామమైన ఏటూరునాగారానికి వచ్చిన లక్ష్మణ్బాబును కమలాపురం బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు తుక్కాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు కలిసి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకుని తిరిగి ప్రజాక్షేత్రంలోకి రావాలని ఆకాంక్షించారు.

పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ నాయకులు పప్పోజు సత్యనారాయణచారి, యలవర్తి శ్రీనివాసరావు, పగడాల వెంకటరెడ్డి, గోమాస చంద్రరావు, గంగుల శ్రీనివాస్, తుక్కాని ఉమేష్, పంపన పార్వతి, జెట్టి లక్ష్మి, గుగులోతు తిరుపతమ్మ, బాదావత్ కళ్యాణి, ఝాన్సీ, ధనసరి అరుణ, మాలోత్ స్వాతి తదితరులు ఉన్నారు.

మూడవ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని సందర్శించిన జిల్లా విద్యాశాఖ అధికారి



దుగ్గొండి, నవంబర్ 03 మనం ప్రతినిధి: దుగ్గొండి మండలం మల్లంపల్లిలో మూడవ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రశాంత్ రెడ్డి సందర్శించడం జరిగింది, ఈ కాంప్లెక్స్ సమావేశాన్ని ఉద్దేశించి ప్రతి విద్యార్థి తప్పకుండా చదవడం రాయడం వచ్చి ఉండాలని సూచించారు అలాగే ఉపాధ్యాయులంతా తగిన విధంగా ప్రణాళికలు రచించుకొని విద్యార్థులకు తగిన విధంగా బోధించి సామర్థ్యాలు రాబట్టాలని ఆదేశించడం జరిగింది ఈ కాంప్లెక్స్ సమావేశంలో మండలంలోని ప్రతి పాఠశాల నుండి 50% ఉపాధ్యాయులు హాజరు కావడం జరిగింది ఈ కాంప్లెక్స్ సమావేశాల్లో ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి ఎస్ వెంకటేశ్వర్లు హాజరు కాగా కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు ఏ రామస్వామి, భార్గవి, జ్యోతిలక్ష్మి నిర్వహించడం జరిగింది ఇందులో రిసోర్స్ పర్సన్స్ గా శ్రీవిద్య ,సాంబయ్య, సతీష్ వ్యవహరించారు. అలాగే ఈ కాంప్లెక్స్ సమావేశాలను ఉద్దేశించి జిల్లా ఎఫ్ ఎల్ ఎన్ నోడల్ అధికారి బాలవద్దిరాజు పాల్గొని విద్యార్థులకు సామర్థ్యాలు రావడంలో ఉపాధ్యాయుల అవలంబించాల్సిన వ్యూహాన్ని విశదీకరించడం జరిగింది.

సీఎంఆర్ బకాయిల మాయాజాలం

ప్రభుత్వ ధాన్యం ఎక్కడ? బకాయిలు ఎన్ని కోట్లు?.

జిల్లాలో సుమారు 84 రైస్ మిల్లులు.. 2024-25 లోనే 805 ఎస్కేల బాయిల్ రైస్ బకాయి.!

ముస్తాబాద్లో ఒక్క మిల్లుకే 169 ఎస్కేలు.. విలువ సుమారు రూ.20 కోట్లు!

పాత బకాయిలు తేల్చకుండా కొత్త ధాన్యం కేటాయింపులపై అనుమానాలు

సివిల్ సప్లై అధికారుల తనిఖీలు, రికవరీ చర్యలపై ప్రజల్లో చర్చ



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 03 (మనం ప్రతినిధి): ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) రూపంలో తిరిగి ప్రభుత్వానికి అప్పగించాల్సిన బాధ్యత రైస్ మిల్లర్లపై ఉంది. అయితే రాజన్న సిరిసిల్ల జిల్లాలో సీఎంఆర్ బకాయిల వ్యవహారం ఆందోళన కలిగిస్తోంది. గత సంవత్సరాలకు సంబంధించిన బకాయిలు ఎంత? మిల్లర్లు ప్రభుత్వానికి ఎంత బియ్యం అప్పగించారు? ఇంకా ఎన్ని ఎస్కేలు పెండింగ్లో ఉన్నాయి? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు రావాల్సి ఉంది. కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ బియ్యం బకాయిలుగా పేరుకుపోతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది.

జిల్లాలో 84 రైస్ మిల్లులు.. బకాయిల లెక్కలెన్ని?

రాజన్న సిరిసిల్ల జిల్లాలో సుమారు 40 బాయిల్ రైస్ మిల్లులు, 44 రా రైస్ మిల్లులు కలిపి మొత్తం 84 రైస్ మిల్లులు ఉన్నాయి, తెలుస్తుంది. వీటికి సంబంధించి ప్రభుత్వానికి అప్పగించాల్సిన సీఎంఆర్ బియ్యం లెక్కలు పూర్తిస్థాయిలో బయటకు రావాల్సి ఉంది.

ముఖ్యంగా 2024-25 సంవత్సరానికి సంబంధించి బాయిల్ రైస్ మిల్లర్ల నుంచి ప్రభుత్వానికి సుమారు 805 ఎస్కేల బియ్యం బకాయి ఉన్నట్లు సమాచారం. ఈ బకాయిల్లో ఇప్పటివరకు ఎంత మేరకు వసూలు చేశారు? ఇంకా ఎంత పెండింగ్లో ఉంది? అనే వివరాలను అధికారులు వెల్లడించాల్సి ఉంది.

తెలంగాణలో నయా డిజిటల్ వ్యవస్థ

- ఏఐతో మార్కెట్ యార్డుల అక్రమాలకు చెక్
- అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక ఆదేశాలు

హైదరాబాద్, నవంబర్ 3, మనం ప్రతినిధి : తెలంగాణలోని వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో అక్రమాలను అరికట్టి, పంటల క్రయవిక్రయాల్లో పారదర్శకత పెంచేందుకు ఏఐ ఆధారిత డిజిటల్ వ్యవస్థను ప్రవేశపెట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రైతుల వివరాల నమోదు నుంచి పంటల వేలం, విక్రయాల వరకు అన్ని ప్రక్రియలను ఒకే వేదికపైకి తీసుకురావాలని సూచించారు. ఐటీ శాఖ సమన్వయంతో వారం రోజుల్లో టెండర్లు పిలవాలని స్పష్టం చేశారు. కోహెడ సమీకృత పండ్ల మార్కెట్ మొదటి దశను వచ్చే మార్చి నాటికి అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. మార్కెట్ యార్డుల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు పంటల కొనుగోళ్లు, విక్రయాల్లో పారదర్శకత పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనుంది. దేశంలోనే తొలిసారిగా కృత్రిమ మేధ (అఐ) ఆధారిత డిజిటల్ వ్యవస్థను రాష్ట్రంలోని మార్కెట్ యార్డుల్లో అందుబాటులోకి తీసుకురావాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రతి లావాదేవీ పారదర్శకంగా జరిగేలా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఇందుకోసం ఐటీ శాఖ సమన్వయంతో వారం రోజుల్లోగా టెండర్ల ప్రక్రియ ప్రారంభించాలని ఇటీవల రెండు రోజుల క్రితం మార్కెట్ యార్డుల ఆధునికీకరణపై ఆయన సమీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. డిజిటల్ విధానం ద్వారా మార్కెట్ యార్డుల్లో జరిగే లావాదేవీలను పర్యవేక్షించడంతో పాటు అక్రమాలు, అవకతవకలకు అవకాశాలు తగ్గుతాయని ప్రభుత్వం భావిస్తోంది. పంటల తూకం, ధర నిర్ణయం, వేలం, విక్రయాలకు సంబంధించిన వివరాలు ఒకే వేదికపై నమోదైతే రైతులకు మరింత స్పష్టత లభించే అవకాశం ఉంటుంది. ఏ దశలోనూ సమాచారం దాచిపెట్టకుండా, సంబంధిత వివరాలను అధికారులు పర్యవేక్షించేలా సాంకేతిక వ్యవస్థను తీర్చిదిద్దాలని మంత్రి సూచించారు. ఏఐ ఆధారిత డిజిటల్ వ్యవస్థ అమల్లోకి వస్తే రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ల నిర్వహణలో సాంకేతిక మార్పులకు మార్గం సుగమం కానుంది.

కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో భయంకర పరిస్థితులు

- రేవంత్‌రెడ్డి ధర్నా, అమిత్ షా పాదయాత్రతో తెలంగాణకు ఏం ఒరిగింది?
- తెలంగాణలో ఆర్ఆర్ ట్యాక్స్‌పై అమిత్ షా సిబిఐ విచారణ జరిపించాలి?
- రేవంత్‌రెడ్డి తెలంగాణను లూటీ చేస్తున్నరు?
- ఢిల్లీకి రేవంత్ పైసలు పంపితే కేంద్రం ఏం చేస్తోంది? : ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్



హైదరాబాద్, నవంబర్ 3, మనం ప్రతినిధి : తెలంగాణలో దుష్ట కాంగ్రెస్ ప్రజాపాలనలో అత్యంత భయంకర పరిస్థితులు దాపురించాయని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్ తనదైన శైలిలో తీవ్రంగా విరుచుకుపడ్డారు. నీళ్లపై ఆధారపడిన పరిశ్రమలు మూతపడే పరిస్థితి వచ్చిందన్నారు. ప్రకృతి వైపరిత్యాలను ఎదుర్కోవడంలో ప్రభుత్వం విఫలం అయిందని మండిపడ్డారు. ఈ మేరకు మంగళవారంనాడు తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో శ్రవణ్ మీడియాతో మాట్లాడుతూ... కరువును ఎదుర్కోవడంలో ఏపీ ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరించిందని, దీంతో 750 టీఎంసీల గోదావరి నీళ్లు, 50 టీఎంసీల కృష్ణా నీళ్లు ఏపీకి తీసుకెళ్లారన్నారు.

ఇక, అమిత్ షా, రేవంత్ రెడ్డి ఇద్దరూ పోటీ పడి విమర్శలు చేసుకున్నారు. ఢిల్లీలో రేవంత్ రెడ్డి ధర్నా,హైదరాబాద్‌కు వచ్చి అమిత్ షా పాదయాత్రతో తెలంగాణకు ఏం ఒరిగిందని ప్రశ్నించారు. కాంగ్రెస్,బీజేపీ రాజకీయ డ్రామాలు ఆడుతున్నాయని మండిపడ్డారు. అమిత్ షా హైదరాబాద్‌కు వచ్చి గుడికి వెళ్లారు. పాదయాత్ర చేశారు. సభలో మాట్లాడి ఢిల్లీకి వెళ్లిపోయారు. తెలంగాణలో కరువుపై అమిత్ షా ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. తెలంగాణ నుంచి ఉన్న కేంద్ర మంత్రులు, ఎంపీలు ఎందుకు కరువుపై అమిత్ షా కు చెప్పలేదన్నారు. దేశాన్ని మోడీ, అమిత్ షా ఇద్దరు పాలిస్తున్నారు. దేశంలో డి ఫాక్టో పీఎం అమిత్ షా అని పేర్కొన్నారు. కరువు ఫైల్ కేంద్ర హోం శాఖా, వ్యవసాయ శాఖా మంత్రుల వద్దకు పోతుందని తెలియదా? అంటూ బీజేపీ ఎంపీలపై ధ్వజమెత్తారు. తెలంగాణలో ఆర్ఆర్ ట్యాక్స్‌పై అమిత్ షా సిబిఐ విచారణ జరిపించాలన్నారు. ఢిల్లీకి రేవంత్ రెడ్డి పైసలు పంపితే కేంద్రం ఏం చేస్తోందన్నారు.

రేవంత్ రెడ్డి తెలంగాణను లూటీ చేస్తున్నారు. వేల కోట్లు దండుకుంటున్న రేవంత్ రెడ్డిని మోదీ, అమిత్ షా ఎందుకు కాపాడుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి మరో హిమంత బిశ్వ శర్మ లా మోడీ, అమిత్‌షాకు కనిపిస్తున్నారు. రేవంత్‌రెడ్డి పైన మోడీ, అమిత్‌షాకు ప్రత్యేకమైన ప్రేమ ఉందని పేర్కొన్నారు. కేంద్రం 20 వేల కోట్లు ఇవ్వాలని ఢిల్లీలో రేవంత్ రెడ్డి ఎందుకు చిన్న ధర్నా చేయలేదని సూటి ప్రశ్నించారు. దేశంలో పెద్ద ఓట్ చోర్ రేవంత్ రెడ్డిది. ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డిపై ఇప్పటికీ కేసు ఉందని గుర్తు చేశారు. డీజీపీ రాష్ట్రంలో అనుముల రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంతో బీఆర్ఎస్ నేతలు పాల్వాయి స్రవంతి,కె .కిషోర్ గౌడ్ ఉన్నారు.

తెలంగాణ అసెంబ్లీని విస్తరిద్దాం

- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విస్తరణకు మాస్టర్ ప్లాన్
- కొత్త భవనాలు, పార్కింగ్‌కు ప్రభుత్వం ప్రతిపాదనలు
- శాసన మండలి ప్రాంగణాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించిన సీఎస్
- అధికారులతో పలు అంశాలపై సీఎస్ సంజయ్ జాజు సుదీర్ఘ సమీక్ష



హైదరాబాద్, నవంబర్ 3, మనం ప్రతినిధి : తెలంగాణ శాసనసభ, శాసన మండలి ప్రాంగణాలను ఆధునిక సౌకర్యాలు, హంగులతో అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కార్యాచరణకు సిద్ధమవుతోంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మంగళవారంనాడు శాసన మండలి ప్రాంగణాన్ని సందర్శించి, ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్‌ను పరిశీలించారు. అభివృద్ధి పనుల కోసం గుర్తించిన స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన సంబంధిత అధికారులతో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ ప్రాంగణాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విస్తరించడంతో పాటు, ప్రజాప్రతినిధులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంపైనా ప్రధానంగా చర్చించారు.

శాసన సభ స్పీకర్, శాసన మండలి ఛైర్మన్‌తో పాటు కీలక ప్రజాప్రతినిధుల నివాస భవనాల నిర్మాణానికీ ప్రతిపాదనలను పరిశీలించారు. అలాగే శాసనసభకు అనుబంధ, పరిపాలనా భవనాల నిర్మాణంతో పాటు శాసనసభా పక్ష కార్యాలయాలు, విశ్రాంతి భవనం, క్రీడా మైదానం ఏర్పాటు వంటి ప్రతిపాదనలపై సీఎస్‌కు అధికారులు వివరించారు. పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా పార్కింగ్ సౌకర్యాలను మెరుగుపరచడం, శాసనసభ ప్రాంగణాన్ని మరింత విస్తరించే అవకాశాలపైనా చర్చించారు. ప్రాంగణ విస్తరణలో భాగంగా పర్యాటక శాఖకు చెందిన భూమితో పాటు డీజీపీ కార్యాలయానికి సంబంధించిన కొంత భూమినీ శాసనసభకు బదిలీ చేసే అంశం కూడా సమీక్షకు వచ్చింది. ఆయా భూముల లభ్యత, అభివృద్ధి పనులకు వాటి వినియోగంపై అధికారులు చర్చించారు.

పచ్చదనానికి ప్రాధాన్యత..

శాసనసభ ప్రాంగణ అభివృద్ధి కేవలం భవనాల నిర్మాణానికే పరిమితం కాకుండా, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా ఉండాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే ఉన్న పచ్చదనానికి ఎలాంటి విఘాతం కలగకుండా అభివృద్ధి పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

పర్యావరణహిత విధానాలు, సుస్థిర అభివృద్ధి ప్రమాణాలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ రూపొందించాలని సీఎం సూచించడంతో ఆ దిశగా ప్రతిపాదనలను పరిశీలిస్తున్నారు. ప్రాంగణంలో పచ్చదనాన్ని కాపాడటంతో పాటు, ఆధునిక మౌలిక సదుపాయాలు, మెరుగైన రవాణా, పార్కింగ్ వ్యవస్థలను సమన్వయం చేయడంపై దృష్టి సారించారు. మొత్తంగా తెలంగాణ శాసనసభ ప్రాంగణాన్ని మరింత విస్తృతంగా, ఆధునికంగా, పర్యావరణహితంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ కార్యరూపం దాల్చితే శాసనసభ ప్రాంగణానికి కొత్త రూపురేఖలు రానున్నాయి.

కివీస్ గడ్డపై టీమ్ఇండియా వన్డే రికార్డులు ఇవే!



న్యూజిలాండ్ తో ఐదు టీ20ల సిరీస్ ను గెలిచిన ఉత్సాహంతో ఉన్న టీమ్ఇండియా ఇప్పుడు వన్డే సిరీస్ పై కన్నేసింది. ఈ నెల 4 నుంచి న్యూజిలాండ్ తో భారత జట్టు తలపడనుంది. స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఆడతుండటంతో ఈ సిరీస్ పై మరింత ఆసక్తి పెరిగింది. ఇప్పటివరకు న్యూజిలాండ్ గడ్డపై వన్డేల్లో భారత గణాంకాలపై ఓ లుక్కేద్దాం..

45లో 14 గెలుపు: న్యూజిలాండ్ లో భారత్ 45 వన్డేలు ఆడగా 14 మ్యాచ్ ల్లో గెలిచింది. 26 మ్యాచ్ ల్లో ఓడిపోయింది. ఒక మ్యాచ్ టై అవ్వగా, నాలుగు మ్యాచ్ ల్లో ఫలితం తేలలేదు.

అత్యధిక స్కోరు: 2009 మార్చి 8న క్రైస్ట్ చర్చ్ లో భారత్ 50 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 392 పరుగుల భారీస్కోరు చేసింది.

అతిపెద్ద విజయం: పరుగుల పరంగా చూస్తే.. 2019 జనవరి 26న మౌంట్ మాంగనుయ్ లో 325 పరుగుల లక్ష్యంతో దిగిన కివీస్ ను 90 పరుగుల తేడాతో భారత్ ఓడించింది. వికెట్ల పరంగా... 2019 జనవరి 23న నేపియర్లో 156 పరుగుల లక్ష్యాన్ని భారత్ కేవలం 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది.

అత్యధిక పరుగులు: సచిన్ తెందూల్కర్ 18 మ్యాచుల్లో 652 పరుగులు చేశాడు.

అత్యుత్తమ వ్యక్తిగత స్కోరు: 2009 మార్చి 8న క్రైస్ట్ చర్చ్ లో సచిన్ 133 బంతుల్లో 164* పరుగులతో అజేయ ఇన్నింగ్స్ తో అదరగొట్టాడు.

అత్యధిక సెంచరీలు: వీరేంద్ర సెహ్వాగ్ 12 మ్యాచుల్లో 3 సెంచరీలు చేసి.. అత్యధికంగా 16 సిక్సర్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. ఎంఎస్ ధోనీ 13 మ్యాచ్ ల్లో 5 హాఫ్ సెంచరీలు బాదాడు.

బౌలింగ్ రికార్డులు: జవగళ్ శ్రీనాథ్ 18మ్యాచుల్లో 38 వికెట్లు తీసి టాప్ బౌలర్ గా నిలవగా, అనిల్ కుంబ్లే 1994 వెల్లింగ్టన్ మ్యాచ్ లో అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు (5/33) నమోదు చేశాడు. తొలి వికెట్ కు భారీ భాగస్వామ్యం: 2009 మార్చి 11న హామిల్టన్లో గౌతమ్ గంభీర్ - వీరేంద్ర సెహ్వాగ్ జోడీ మొదటి వికెట్కు 201 పరుగుల రికార్డు భాగస్వామ్యాన్ని నెలకొల్పింది.

మమితా బైజు అసలు పేరు ఏంటో తెలుసా..?



మమితా బైజు.. ఇప్పుడు సౌత్ఇండియాలో ఈ పేరు ఒక సంచలనం. ప్రేమలు మూవీతో మలయాళీలతో పాటు తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ బ్యూటీ.. ఆ తర్వాత వరస సినిమాలతో దూసుకెళ్తోంది. ఇటీవల విశ్వనాథ్ అండ్ సన్స్, బెత్లెహామ్ కుటుంబం యూనిట్ తో భారీ విజయాలను అందుకుంది. ఈ ఏడాదిలో అత్యధిక హిట్లు అందుకున్న దక్షిణాది బ్యూటీ మమితనే. తాజాగా ఈ బ్యూటీ ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకుంది. ఇండస్ట్రీ మొత్తం మార్మోగుతున్న మమిత అనే పేరు..తనది కాదని..ఓ పొరపాటు వల్ల అసలు పేరు మారిపోయి ఈ పేరు స్థిరపడిందని వెల్లడించింది.

తాజాగా ఓ ఇంటర్వ్యూలో మమిత మాట్లాడుతూ... 'నేను పుట్టినప్పుడు అమ్మనాన్నలు పెట్టిన పేరు నమిత. కానీ బర్త్ సర్టిఫికెట్ నమోదు చేసే సమయంలో జరిగిన పొరపాటు వల్ల 'నమిత' కాస్తా 'మమిత'గా రాశారు. ఈ విషయాన్ని మా వాళ్లు నాలుగైదేళ్ల వరకు గమనించలేదు. చివరికి నన్ను స్కూల్ లో జాయిన్ చేసినప్పుడు సర్టిఫికెట్ లో పేరు చూసి షాక్ అయ్యారు. కాకపోతే అప్పటికే చాలా ఏళ్లు గడిచిపోవడంతో చేసేదేమీ లేక వాళ్లకి ఇష్టం లేకున్నా ఆ పేరునే కొనసాగించారు. అలా నా పేరు నమిత నుంచి మమితగా మారిపోయింది' అని మమిత చెప్పుకొచ్చింది. నమిత కొత్త సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుత ఆమె తమిళంలో 'ఇరండు వానమ్'తో పాటు మలయాళంలో 'హలో డియర్' చిత్రంలో నటిస్తోంది.

భారత్ Vsపాక్.. వరల్ కప్ మ్యాచ్ టికెట్లకు 84 లక్షల రిక్వెస్ట్లు



వచ్చే ఏడాది జరగనున్న వన్డే ప్రపంచ కప్ నకు దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా ఉమ్మడిగా ఆతిథ్యమివ్వనున్నాయి. 2027 అక్టోబర్ 2 నుంచి టోర్నీ మొదలుకానుంది. ఇప్పటి నుంచే మ్యాచ్ ల టికెట్ల కోసం పేర్లు నమోదు చేసుకోవడానికి ఐసీసీ అవకాశం కల్పించగా.. అభిమానుల నుంచి అపూర్వ స్పందన లభిస్తోంది. అక్టోబర్ 10న జొహానెస్ బర్గ్ లోని వాండరర్స్ స్టేడియంలో చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్ తలపడనున్నాయి. ఈ హైవోల్టేజ్ మ్యాచ్ టికెట్ల కోసం విపరీతమైన పోటీ నెలకొంది. స్టేడియం సీటింగ్ సామర్థ్యం 34,000 కాగా.. టికెట్ల కోసం ఏకంగా 84 లక్షల రిక్వెస్ట్ లు వచ్చాయని ఐసీసీ తెలిపింది. ఇదే వాండరర్స్ స్టేడియంలో నవంబర్ 21న ఫైనల్ మ్యాచ్ జరగనుండగా.. టికెట్ల కోసం 79 లక్షల వినతులు వచ్చాయని వెల్లడించింది. వరల్ కప్ ఫైనల్ మ్యాచ్ కంటే దాయాదుల పోరుకు ఎంత క్రేజ్ ఉందో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు.

వరల్ కప్లో టీమ్ఇండియా షెడ్యూల్ (గ్రూప్ స్టేజీ)

అక్టోబరు 7 - భారత్ Vs ఆస్ట్రేలియా
అక్టోబరు 10 - భారత్ Vs పాకిస్థాన్
అక్టోబరు 14 - భారత్ Vs అఫ్గానిస్థాన్
అక్టోబరు 17 - భారత్ Vs క్వాలిఫయర్-ఎ
అక్టోబరు 24 - భారత్ Vs జింబాబ్వే

గోల్కీపర్ను ఢీకొని.. మైదానంలో కుప్పకూలి.. ఫుట్ బాలర్ మృతి

స్పెయిన్లోని ఫుట్బాల్ క్లబ్ మ్యాచ్లో తీవ్ర విషాదం నెలకొంది. మైదానంలో గోల్కీపర్ను బలంగా ఢీకొనడంతో ఓ 30 ఏళ్ల ఫుట్బాలర్ అక్కడికక్కడే కుప్పకూలి ప్రాణాలు కోల్పోయాడు. సీడీ టెనెరిఫ్, ఎఫ్సీ ఆండోరా క్లబ్ల మధ్య జరిగిన మ్యాచ్లో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది.

స్పెయిన్ లోని ఎస్టాడియో మైదానంలో సోమవారం ఈ మ్యాచ్ జరిగింది. ఇరు జట్లు 2-2 స్కోర్ తో సమానంగా ఉన్నప్పుడు టెనెరిఫ్ క్లబ్ ఆటగాడు జీసస్ డి మిగెల్ (30) బంతిని ఛేజ్



చేసుకుంటూ ముందుకొచ్చాడు. అదే సమయంలో గోల్ పోస్ట్ వద్ద ఉన్న ఆండోరా జట్టు గోల్ కీపర్ జీసస్ ఓనో బంతిని ఆపేందుకు పెనాల్టీ ఏరియా వద్దకు దూసుకొచ్చాడు. ఈ క్రమంలో ఫుట్ బాలర్ మిగెల్ ఛాతీకి గోల్ కీపర్ ఓనో మోకాలు బలంగా తగిలింది. దీంతో మిగెల్ నొప్పితో విలవిల్లాడుతూ పి కుప్పకూలాడు. ఆ వెంటనే కార్డియోరెస్పిరేటరీ అరెస్ట్ కు గురయ్యాడు. వైద్య సిబ్బంది తక్షణమే స్పందించి అతడికి సీపీఆర్ చేశారు. దాదాపు 5 నిమిషాల తర్వాత మిగెల్కు పల్స్ అందింది. వెంటనే అంబులెన్స్లో అతడిని ఆసుపత్రికి తరలించారు. అయితే, చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మిగెల్ ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషయాన్ని తెలియజేస్తూ టెనెరిఫ్ క్లబ్ సంతాపం ప్రకటించింది. 2015లో సీనియర్ ఫుట్బాల్ కెరీర్ను ప్రారంభించిన మిగెల్.. పలు క్లబ్ లకు ప్రాతినిధ్యం వహించాడు. గతేడాదే టెనెరిఫ్ క్లబ్ లో చేరాడు.

'ఈఎన్ఈ రిపీట్' ట్రైలర్ : సినిమా హిట్ కాకపోతే ఉరి తీసేయండి..

విశ్వక్ సేన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'ఈఎన్ఈ రిపీట్' (ఈ నగరానికి ఏమైంది రిపీట్). తరుణ్ భాస్కర్ దర్శకత్వం వహించిన 'ఈ నగరానికి ఏమైంది' (2018) మూవీకి సీక్వెల్ గా విశ్వక్ సేన్-తరుణ్ భాస్కర్ కాంబినేషన్ లోనే 'ఈఎన్ఈ రిపీట్' రూపొందింది. శ్రీనాథ్ మాగంటి, అభినవ్ గోమరం, వెంకటేశ్ కాకుమాను ఇతర పాత్రలు పోషించారు. ఎస్ ఒరిజినల్స్, రూట్ నోడ్ సినిమా పతాకాలపై సృజన్ యరబోలు, సందీప్ నాగిరెడ్డి నిర్మించిన ఈ మూవీ ఈ నెల 19న విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్ని విడుదల చేశారు మేకర్స్. ఈ నగరానికి ఏమైంది సినిమాలో చివర్లో విశ్వక్ సేన్ విజయ్ దేవరకొండతో షార్ట్ ఫిలిం తీస్తున్నట్టు చూపించారు. ఈ ట్రైలర్ అక్కడ నుంచే ప్రారంభం అవుతుంది. 'ఏమైంది రా స్టోరీ నచ్చలేదా(విశ్వక్ సేన్), 'హా.. నువ్వు రాసింది ఏమన్నా టైటానిక్ అనుకుంటున్నావా? (అభినవ్).. అంటే మనకిప్పుడు పాన్ ఇండియా కలెక్షన్స్ రావు అంటున్నావు(వెంకటేశ్ కాకుమా), సినిమా హిట్ కాకపోతే వీడిని ఉరితీసేయండి(అభినవ్), 'పిచ్చెక్కిపోతుంది ఆడియన్స్కి' లాంటి డైలాగ్స్తో ఆద్యంతం వినోదాత్మకంగా ట్రైలర్ని కట్ చేశారు. ట్రైలర్ని బట్టి చూస్తే.. విశ్వక్ సినిమా తీయడానికి ప్రయత్నిస్తున్నట్టు, ఈ నలుగురు ఫ్రెండ్స్ బ్యాంకాక్ వెళ్లి అక్కడ పడ్డ ఇబ్బందులు, మధ్యలో కామెడీతో ఈ సినిమా ఉండబోతుందని తెలుస్తుంది.




ఏ వైఫల్యాన్నీ శాశ్వత ఓటమిగా భావించవద్దు.. : సూర్య



కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, జీతు మాధవన్ కాంబోలో తెరకెక్కిన లేటెస్ట్ సినిమా 'సీన్'. ఈ సినిమాలో సూర్య ఇన్ బరాజ్ అనే పోలీస్ ఆఫీసర్ గా నటిస్తుండగా, నజ్రియా నజీమ్, నస్లెన్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సూర్య, జీతు మాధవన్ కలసి పనిచేయడం ఇదే మొదటిసారి కావడం విశేషం. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ దీపావళి పండగ సందర్భంగా నవంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈనేపథ్యంలో.. ప్రమోషన్స్ లో పాల్గొన్న సూర్య జీవితంలో కష్టపడటం గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. జీవితాన్ని నమ్మాలని, ఏ ఓటమినీ శాశ్వతంగా భావించవద్దని అన్నారు. మనం ఏది కావాలని గట్టిగా కోరుకుంటామో అదే అవుతామని చెబుతుంటారు, కానీ కేవలం కోరుకోవడంతోనే సరిపోదని సూర్య అన్నారు. దాన్ని సాధించడానికి నిజంగా కష్టపడాలని, కలలు నిజం కావాలంటే గట్టి ప్రయత్నం ఉండాలని ఆయన చెప్పారు. జీవితాన్ని గట్టిగా నమ్మాలని, అది చాలా అందమైనదని సూర్య తెలిపారు. మనుషులమైన మనకు ప్రాణం ఉన్నంతవరకు ప్రతి విషయాన్ని మార్చుకోవచ్చని, తప్పులను సరిదిద్దుకోవచ్చని చెప్పారు. శ్వాస ఉన్నంతవరకు ఏదీ ఓటమి కాదని, ఏదీ పూర్తిగా ముగిసిపోదని అన్నారు. ఎప్పుడైనా, ఎక్కడి నుంచైనా మళ్లీ కొత్తగా ప్రారంభించి అన్నీ సరిదిద్దుకోవచ్చని చెప్పారు. ఇక తన వయసు 50 ఏళ్లు దాటిన తర్వాత ఆలోచనల్లో మార్పు వచ్చిందని, ఇప్పుడు తనకు మనశ్శాంతి, మంచి ఆరోగ్యమే ముఖ్యమని సూర్య తెలిపారు.

నేను పార్టీలకు తిరిగే రకం కాదు.. : దిశా పటానీ



బాలీవుడ్ హాట్ బ్యూటీ దిశా పటానీ తెలుగు ప్రేక్షకులకు కూడా సుపరిచితమే. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన కల్కి, సాహో వంటి చిత్రాలతో మెప్పించిన ఈ భామ.. ఎంత బిజీగా ఉన్నప్పటికీ నిత్యం సోషల్ మీడియాలో హాట్ అండ్ గ్లామరస్ ఫోటోషూట్లతో రచ్చ చేస్తుంటుంది. తనదైన హాట్ షో చేస్తూ.. అందరినీ ఆశ్చర్యపరుస్తుంటుంది. దీంతో ఈ భామను చూడగానే ఈమె రియల్ లైఫ్ లోనూ రాత్రింబవళ్లు పబ్ లు, పార్టీలు, హ్యాంగౌట్స్ తో కాలం గడిపేస్తుందని అంతా చర్చించుకుంటున్నారు. సినిమా అవకాశాలతో కంటే పార్టీలతో బిజీగా ఉంటుందనే ప్రచారం జరుగుతోంది. ఈనేపథ్యంలో.. తాజాగా, దిశా పటానీ తన గురించి ప్రచారంలో ఉన్న ఈ రూమర్స్ అన్నింటికీ చెక్ పెట్టింది.

సోషల్ మీడియాలో కనిపించే తన గ్లామరస్ ఇమేజ్ కి, తన రియల్ లైఫ్ స్వభావానికి అస్సలు సంబంధమే లేదని క్లారిటీ ఇచ్చింది. తాను అసలు పార్టీలకు తిరిగే రకమే కాదని, పర్సనల్ లైఫ్ లో చాలా రిజర్వ్ డ్ గా ఉంటానని తేల్చిచెప్పింది. ఎవరితోనూ త్వరగా కలవలేనని, బయట నెటిజన్లు అనుకుంటున్నట్టుగా నైట్ లైఫ్, పబ్ కల్చర్ కు తాను చాలా దూరమని వెల్లడించింది. గ్లామర్ ఫొటోషూట్స్ చూసి తప్పుగా అనుకోవద్దని కోరింది. సినిమాల్లో కనిపించే గ్లామర్ పాత్రలు కేవలం నటనలో భాగం మాత్రమేనని, వాటిని వ్యక్తిగత జీవితంతో కంపేర్ చేయడం సరికాదని దిశా అభిప్రాయపడింది. షూటింగ్ లేని సమయంలో ఇంట్లోనే ప్రశాంతంగా ఉండటం, పుస్తకాలు చదువుకోవడం, జిమ్ లో వర్కవుట్లు చేయడం, తన పెట్స్ తో సమయం గడపడమే తనకు ఇష్టమైన పని అని చెప్పింది. ప్రస్తుతం ఈ కామెంట్స్ నెట్టింట వైరల్ గా మారాయి.

అతి తక్కువ సమయంలోనే పూర్తి చేశాము.. : నిహారిక

నిహారిక కొణిదెల నిర్మాణంలో తెరకెక్కుతున్న PepNxt సినిమా 'పాకెట్ రాకెట్స్' నుంచి తాజాగా టీజర్ రిలీజ్ చేశారు మేకర్స్. 'సమయం ఆసన్నమైంది, మా మొదటి అడుగు మొదలైపోయింది! పాకెట్ రాకెట్స్ అనే విచిత్రమైన, ఉద్వేగభరితమైన, ఉత్కంఠభరితమైన ప్రపంచంలోకి ప్రవేశించడానికి సిద్ధంగా ఉండండి.. టీజర్ ను ఇప్పుడే చూడండి, డిసెంబర్ 11న థియేటర్లలో పూర్తి ఉత్సాహంతో పాల్గొనేందుకు సిద్ధం కండి' అంటూ వదిలిన ఈ టీజర్ యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ గా ఆకట్టుకుంది.



ఇక ఈ టీజర్ రిలీజ్ ఈవెంట్ లో నిర్మాత నిహారిక కొణిదెల మాట్లాడుతూ.. 'పాకెట్ రాకెట్స్ సినిమా నాకు ఒక స్పెజ్. జులైలో ప్రారంభించిన ఈ సినిమాను కేవలం ఆరు నెలల్లోనే పూర్తి చేశాం. ఇది నాకు చాలా ప్రత్యేకమైన మూవీ. నా జీవితంలో ఒక భాగంలా, ఎంతో ఆసక్తికరంగా సాగిన ప్రాజెక్ట్ ఇది. మా సినిమా డిసెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు రానుంది' అన్నారు. కాగా.. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్, మ్యాక్సిమమ్ సిటీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి రుద్ర అత్రి దర్శకత్వం వహించాడు. ఇందులో త్రినాథ్ వర్మ, నిర్మల్ హీరోలుగా, శ్రియా కొంతం హీరోయిన్ గా నటిస్తుండగా.. సీనియర్ నటుడు జేడీ చక్రవర్తి కీలక పాత్ర పోషిస్తున్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.